www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 13-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 58 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: విదియ మ.3:19 తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాషాఢ రా.11:21 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: ఉ.8:06-9:48, దుర్ముహూర్తం: ఉ.8:20-9:12, మ.12:41-1:33, అమృతఘడియలు: సా.6:16-7:57, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మెర్సిడెస్ బెంజ్.. ఏఎంజీ జీ63 కలెక్టర్

ధర రూ.4.30 కోట్లు

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్.. భారత మార్కెట్లో మరిన్ని కస్టమైజ్డ్ మోడళ్లను ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది. బెంగళూరులోని గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ద్వారా ఈ ప్రత్యేక ఎడిషన్ కార్లను తీసుకురానున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ వెల్లడించారు. ఇందులో భాగంగానే గురువారం మెర్సిడెస్.. ఏఎంజీ జీ63 కలెక్టర్ పేరుతో ప్రత్యేక ఎడిషన్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.4.30 కోట్లు (ఎక్స్‌షోరూమ్). ప్రత్యేక ఎడిషన్‌లో భాగంగా కేవలం 30 కార్లను మాత్రమే కంపెనీ మార్కెట్లోకి విడుదల చేయనుంది. కాగా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మరిన్ని కస్టమైజ్డ్ మోడళ్లను, ప్రత్యేక ఫీచర్లతో తీసుకురానున్నట్లు అయ్యర్ తెలిపారు.

విదేశాల్లో 'ఎఫ్‌డీ'లపై నిషేధం?

విదేశాలకు సొమ్ము బదిలీ నిబంధనలు కఠినతరం చేసే యోచనలో ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: భారతీయులు విదేశాలకు పంపే సొమ్ము (ఓవర్సీస్ రెమిటెన్స్)కు సంబంధించిన నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కఠినతరం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశం బయటికి పంపిన సొమ్ముతో విదేశీ కరెన్సీల్లో లాకిన్ పీరియడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) చేయడం లేదా వడ్డీ ఆర్జిత అకౌంట్లో జమ చేయడాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో ఆర్‌బీఐ చర్చలు కొనసాగిస్తోందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇది దేశ సంపదను విదేశాలకు బదిలీ చేయడం లాంటిదేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి. మన దేశవాసులు విదేశాల్లో తమ పేరు మీదే కాదు, ఇతరుల పేరున కూడా సొమ్ము డిపాజిట్ చేయకుండా ఆర్‌బీఐ నిబంధనలను కట్టుదిట్టం చేయాలని భావిస్తోందని వారు తెలిపారు. కాగా ఈ తరహా సొమ్ము బదిలీలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్‌ఆర్ఎస్)ను సవరించనున్నట్లు తెలిసింది.

ఏడాదిలో రూ.2.14 కోట్లు పంపొచ్చు..

ఇటీవలి కాలంలో విదేశాలకు సొమ్ము బదిలీలు భారీగా పెరిగాయి. కొందరు ఎల్‌ఆర్ఎస్ మార్గంలో తమ సంపదను క్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని ఆర్‌బీఐ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే, ఇది మన విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలకు గండికొట్టడమే కాకుండా రూపాయి మారకం విలువలో ఒడుదుడుకులకూ కారణమవుతోంది. ప్రస్తుతం ఎల్‌ఆర్ఎస్ ద్వారా భారతీయులు ఉన్నత విద్య, ప్రయాణం, విదేశీ స్టాక్ మార్కెట్ లేదా బాండ్లలో పెట్టుబడులు లేదా వైద్య అవసరాల కోసం ఏదైనా ఆర్థిక సంవత్సరంలో 2.5 లక్షల డాలర్ల (దాదాపు రూ.2.14 కోట్లు) వరకు సొమ్మును బయటికి దేశానికి బదిలీ చేయవచ్చు.



మార్చిలో 17.32 కోట్ల డాలర్ల విదేశీ కరెన్సీ డిపాజిట్లు

ఆర్‌బీఐ డేటా ప్రకారం.. ఈ ఫిబ్రవరిలో భారతీయుల ఫారిన్ కరెన్సీ డిపాజిట్లు 5.162 కోట్ల డాలర్లుగా నమోదు కాగా.. మార్చిలో 17.32 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో సాధారణంగానే మార్చిలో భారతీయుల విదేశీ రెమిటెన్స్‌లు భారీగా పెరుగుతాయని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారతీయులు దాదాపు 3,000 కోట్ల డాలర్లు విదేశాలకు పంపించారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో పంపిన 3,100 కోట్ల డాలర్లతో పోలిస్తే మాత్రం గత సారి విదేశీ రెమిటెన్స్‌లు స్వల్పంగా తగ్గాయి.

మార్కెట్ క్రాష్

- సెన్సెక్స్ 823 పాయింట్లు పతనం
- మళ్లీ 25,000 దిగువకి నిఫ్టీ
- రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం భారీగా పతనమయ్యాయి. పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్ ఇందుకు ప్రధాన కారణం. ముడి చమురు ధరల పెరుగుదల, చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలు, ట్రంప్ ఏకపక్ష సుంకాల పెంపు యోచనలో ఉన్నారన్న వార్తలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, వీక్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల కాలపరిమితి ముగింపు కూడా మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయి. ఈ నేపథ్యంలో మదుపరులు ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ ఒక దశలో 992 పాయింట్ల వరకు క్షీణించింది. చివరికి సూచీ 823.16 పాయింట్ల (1 శాతం) నష్టంతో 81,691.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 253.20 పాయింట్లు (1.01 శాతం) కోల్పోయి 24,888.20 వద్దకు జారుకుంది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.98 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.449.58 లక్షల కోట్లకు (5.26 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 27 నష్టపోయాయి.

తాన్లా షేర్ల బైబ్యాక్: హైదరాబాద్‌కు చెందిన తాన్లా ప్లాట్‌ఫామ్స్ మరోసారి మార్కెట్ నుంచి సొంత షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనుంది. ఈ నెల 16న (సోమవారం) కంపెనీ బోర్డు సమావేశమై బైబ్యాక్ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో ఒకదశలో 12 శాతం ఎగబాకింది. చివరికి 9.18 శాతం వృద్ధితో రూ.679.35 వద్ద ముగిసింది. తాన్లా షేర్ల బైబ్యాక్ చేయటం గడిచిన ఐదేళ్లలో ఇది మూడోసారి. కంపెనీ 2020లో రూ.154 కోట్లు, 2022లో రూ.170 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది.

బోయింగ్ షేరు ఢమాల్

BOEING

గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కొద్ది నిమిషాలకే కుప్పకూలింది. దాంతో ఆ విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది చనిపోయారు. ఈ ఘోర ప్రమాదం నేపథ్యంలో అమెరికా మార్కెట్లో బోయింగ్ షేరు గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో 5 శాతం వరకు క్షీణించింది. మార్కెట్ ప్రారంభానికి ముందు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో 8 శాతం వరకు పతనమైంది. ఈ ఘటనతో అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలకూ అంతరాయం కలిగింది. దాంతో దేశీయ లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ ఇండిగో షేరు బీఎస్ఈలో 2.65 శాతం నష్టపోగా.. స్పైస్‌జెట్ షేరు 1.78 శాతం క్షీణించింది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర కూడా 1.54 శాతం తగ్గింది.

ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి ద్రవ్యోల్బణం

మే నెలలో 2.82 శాతం

న్యూఢిల్లీ: కొన్ని వారాలుగా అదుపులో ఉన్న ఆహార, నిత్యావసర వస్తువుల ధరలు మే నెలలో మరింతగా దిగొచ్చాయి. ఫలితంగా రిటైల్ ద్రవ్యోల్బణం 2.82 శాతానికి తగ్గింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. 2019 ఫిబ్రవరిలో నమోదైన కనిష్ఠ స్థాయి 2.57 శాతం తర్వాత ద్రవ్యోల్బణం ఈ స్థాయికి దిగి రావడం ఇదే ప్రథమం. ఇది ఏప్రిల్‌లో 3.16 శాతం ఉండగా గత ఏడాది మే నెలలో 4.8 శాతంగా ఉంది.

తెలంగాణలో అత్యంత కనిష్ఠం

ప్రాంతాల వారీగా చూసినట్టయితే రిటైల్ ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 2.59 శాతం, పట్టణ ప్రాంతాల్లో 3.07 శాతంగా నమోదైంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలవారీగా చూసినా తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్ఠ స్థాయి 0.55 శాతంగా నమోదైంది.

జీఎస్‌కేతో భారత్ బయోటెక్ జట్టు

సంయుక్తంగా డయేరియా వ్యాక్సిన్ తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం జీఎస్‌కే పీఎల్‌సీతో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (బీబీఐఎల్) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అధిక తీవ్రత గల అతిసార (డయేరియా) వ్యాధి (షిగెలోసిస్) కట్టడికి ఉపయోగించే వ్యాక్సిన్‌ను తయారు చేయనుంది. ఆల్ట్‌సోన్‌ఫ్లెక్స్ 1-2-3 పేరిట జీఎస్‌కే ఇప్పటికే రూపొందించిన ఈ వ్యాక్సిన్ ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ దశలో ఉంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన వ్యాక్సిన్ ఇది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లో అధికారిక లైసెన్స్ గల షిగెల్లా వ్యాక్సిన్ ఏదీ లేదు. బ్యాక్టీరియా ద్వారా ఈ అతిసార వ్యాధి తీవ్రంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో అల్పాదాయ, మధ్యాదాయ దేశాలకు శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు.

ఇరు సంస్థల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం భారత్ బయోటెక్ మూడో దశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం, నియంత్రణాపరమైన అనుమతులు సాధించడంతో పాటు భారీ ఎత్తున ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. క్లినికల్ ట్రయల్స్ డిజైనింగ్, తయారీ కార్యకలాపాల కోసం విదేశీ నిధుల సమీకరణ, వాణిజ్యీకరణ వ్యూహాలను జీఎస్‌కే పర్యవేక్షిస్తుంది.

ఎంఐపీఎస్‌తో సైయెంట్ భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఎస్ఐసీ (అప్లికేషన్-స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్), ఏఎస్ఎస్‌పీ (అప్లికేషన్-స్పెసిఫిక్ స్టాండర్డ్ ప్రోడక్ట్) అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ సెమీ కండక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఆర్ఐఎస్‌సీ-వీ ప్రాసెసర్ ఐపీల తయారీలోని అంతర్జాతీయ దిగ్గజం ఎంఐపీఎస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తమ భాగస్వామ్యంలో ఆటోమోటివ్, ఇండస్ట్రియల్, డేటా సెంటర్ విభాగాల కోసం సురక్షితమైన, రియల్ టైమ్ అప్లికేషన్స్ రూపొందించగలుగుతామని సైయెంట్ తెలిపింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	96	అనంతపురం	108
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,200 ▲	91,000 ▲	1,18,900 ▼
విజయవాడ	98,000 ▼	90,150 ▼	1,05,000 ▼
విశాఖపట్నం	1,00,810 ▲	91,000 ▲	1,18,900 ▼
రాజమండ్రి	99,270 ▲	90,100 ▼	1,11,500 ▲
ప్రొద్దుటూరు	96,900 ▲	89,150 ▲	1,04,000 ▲
ముంబై	97,455 ▲	89,269 ▲	1,05,498 ▲

నవంబరు నుంచి ట్రూజెట్ టేకాఫ్!

విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు

న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానయాన సంస్థ ట్రూజెట్ (గతంలో టర్బో మేఘా ఎయిర్‌వేస్) టేకాఫ్‌కు సిద్ధమవుతోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి ఇందుకోసం ఇప్పటికే అనుమతి సంపాదించింది. 2015-22 మధ్య కాలంలో ప్రాంతీయ విమానయాన సంస్థగా ట్రూజెట్ దేశంలో విమాన సర్వీసులు నిర్వహించింది. అయితే కొవిడ్‌తో తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2022 ఫిబ్రవరిలో కార్యకలాపాలు నిలిపివేసింది. విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించేందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి ఎయిర్ ఆపరేటర్స్ అనుమతి (ఏఓపీ) కోసం ట్రూజెట్ దరఖాస్తు చేసింది. ఈ అనుమతి లభిస్తే ఈ ఏడాది నవంబరు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రం గా తన సర్వీసులు ప్రారంభించాలని ట్రూజెట్ యోచిస్తున్నట్టు సమాచారం. గతంలో ట్రూజెట్.. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించింది.

రూ.200 కోట్ల పెట్టుబడి: విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం ట్రూజెట్ యాజమాన్యం రూ.200 కోట్ల వరకు పెట్టుబడులు సమీకరించినట్టు సమాచారం. తొలుత ఒక ఎయిర్‌బస్ ఏ320 విమానంతో విమాన సర్వీసులు ప్రారంభించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. తర్వాత ఏటీఆర్ రకం విమానాలు సమకూర్చుకోవాలని కంపెనీ భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	535
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

వింబుల్డన్ ప్రైజ్‌మనీ.. రూ. 625 కోట్లు

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ ప్రైజ్‌మనీతోపాటు విజేతలకు అందించే మొత్తం భారీగా పెరిగింది. ఈ టోర్నమెంట్ మొత్తం ప్రైజ్‌మనీ ఏకంగా రూ. 625 కోట్లకు చేరగా..పురుషులు, మహిళల సింగిల్స్ చాంపియన్లు ఒక్కొక్కరికి రూ. 34 కోట్లు ప్రదానం చేయనున్నారు. ఈ వివరాల్ని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నిర్వాహకులు గురువారం ప్రకటించారు. ఓవరాల్ ప్రైజ్‌మనీ గత ఏడాది కంటే రూ. 58 కోట్లు పెరిగింది. తొలి రౌండ్ పరాజితులు రూ. రూ. 76.77 లక్షలు అందుకోనున్నారు.

సిఫ్ట్ కౌర్‌కు కాంస్యం



మ్యూనిచ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా కాంస్య పతకం సాధించింది. గురువారం జరిగిన మహిళల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్ ఫైనల్లో తీవ్ర పోటీ ఎదుర్కొన్న సిఫ్ట్ 453.1 పాయింట్లతో మూడో స్థానం దక్కించుకుంది. నార్వేకు చెందిన జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ (466.9) స్వర్ణం, ఎమీలీ జేగి (స్విట్జర్లాండ్, 464.8) రజత పతకాలు సాధించారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 592 పాయింట్లు స్కోరు చేసిన కౌర్ రెండో స్థానంతో ఎనిమిది మంది షూటర్ల ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఇక..ఈ విభాగంలో బరిలో దిగిన ఇతర భారత షూటర్లు ఆషీ చౌక్సీ (589) 11వ, అంజుమ్ మౌద్గిల్ (586) 27వ, శ్రియాంకా సాదంగి (582) 53వ స్థానాలలో నిలిచారు. కాగా ఈ ఏడాది ఆరంభంలో బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన ప్రపంచ కప్‌లో సిఫ్ట్ కౌర్ పసిడి పతకం కొల్లగొట్టింది.

వచ్చే జనవరిలో భారత టూర్‌కు కివీస్?

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ జట్టు వచ్చే ఏడాది జనవరిలో భారత్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. ఈ టూర్‌లో కివీస్ 3 వన్డేలు, 5 టీ20ల సిరీస్‌లు ఆడే అవకాశం ఉంది. టీ20 వరల్డ్‌కప్‌నకు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపకరిస్తుందని కివీస్ భావిస్తోందట. గత ఏడాది భారత్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను కివీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

స్పోర్ట్స్

ఇంగ్లండ్ టూర్‌కు శ్రీచరణి, అరుంధతి

టీ20, వన్డేలకు మహిళల జట్ల ఎంపిక





న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు ఎంపిక చేసిన భారత మహిళల జట్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి, తెలంగాణ క్రీడాకారిణి అరుంధతి రెడ్డిలకు చోటు దక్కింది. ఇంగ్లండ్ పర్యటన కోసం గురువారం ప్రకటించిన జట్టులో గాయపడిన సురుచి ఉపాధ్యాయ్ స్థానాన్ని లెఫ్టామ్ స్పిన్నర్ రాధా యాదవ్‌తో భర్తీ చేశారు. ఈ నెల 28 నుంచి జరిగే టూర్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

జట్లు ఇవే..

టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, రిచా ఘోష్, యాస్తిక భాటియా (ఇద్దరూ వికెట్ కీపర్లు), హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి, సయాలి, రాధా యాదవ్.

వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్లీన్, జెమీమా, రిచా ఘోష్, యాస్తిక భాటియా (ఇద్దరూ వికెట్ కీపర్లు), తేజల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి, సయాలి, రాధా యాదవ్.

ఇంగ్లండ్ టూర్ షెడ్యూల్..

జూన్ 28	తొలి టీ20	నాటింగ్‌హామ్
జూలై 1	రెండో టీ20	బ్రిస్టల్
జూలై 4	మూడో టీ20	ఓవల్
జూలై 9	నాలుగో టీ20	మాంచెస్టర్
జూలై 12	ఐదో టీ20	బర్మింగ్‌హామ్
	వన్డే సిరీస్	
జూలై 16	తొలి వన్డే	సౌతాంప్టన్
జూలై 19	రెండో వన్డే	లార్డ్స్
జూలై 22	మూడో వన్డే	చెస్టర్ లి స్ట్రీట్

- **భారత్‌కు వరుసగా నాలుగో ఓటమి**

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): ప్రొ.హాకీ లీగ్ యూరప్ అంచెలో భారత జట్టు వరుసగా నాలుగో పరాజయాన్ని మూటగట్టుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా 2-1తో భారత్‌పై గెలుపొందింది.

తుదిజట్టు కూర్పుపైనే దృష్టంతా..!

నేడు భారత జట్ల మధ్య ప్రాక్టీస్ మ్యాచ్

బెకెన్‌హామ్ (కెంట్): ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు ఏకైక ప్రాక్టీస్ మ్యాచ్‌కు భారత సీనియర్ జట్టు సిద్ధమైంది. శుక్రవారం నుంచి జరిగే నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో భారత్-ఎతో టీమిండియా తలపడనుంది. భారత ప్లేయర్ల మధ్య అంతర్గత మ్యాచ్ కావడంతో.. టెస్ట్ జట్టు కూర్పుపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ సారథ్యానికి ఈ మ్యాచ్ ఓ పరీక్షగానే చెప్పుకోవాలి. ఇక, తుది జట్టులో జడేజా లేదా కుల్దీప్‌లో ఎవరిని తీసుకోవాలనేదానిపై కోచ్ గౌతమ్ గంభీర్ ఓ నిర్ణయానికి రావచ్చు. మరోవైపు ఆరు నెలల తర్వాత టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న పేసర్ బుమ్రా ఫిట్‌నెస్‌ను నిశితంగా గమనించనున్నారు. వెన్నెముక గాయంతో విశ్రాంతి తీసుకొన్న బుమ్రా ఐపీఎల్‌లో బరిలోకి దిగాడు. ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణల్లో ఎవరు కెప్టెన్ నమ్మకాన్ని గెల్చుకుంటారో ఈ మ్యాచ్‌తో బయటపడనుంది. అలాగే తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి, ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం ఉన్న శార్దూల్ ఠాకూర్‌లలో ఎవరు బెర్త్ దక్కించుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా బ్యాటర్లకు బ్యాటింగ్ ప్రాక్టీస్‌తోపాటు బౌలర్లు లయను అందుకోవడానికి ఈ మ్యాచ్ ఎంతో ఉపయోగపడనుంది.



ఇదే సరైన సమయం

ప్రతీ బంతికీ పోరాడండి

భారత ఆటగాళ్లకు కోచ్ గంభీర్ సలహా

లండన్: ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన భారత ఆటగాళ్లు సత్తా నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉండాలంటూ ప్రధాన కోచ్ గౌతం గంభీర్ సూచించాడు. స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో పాటు స్పిన్నర్ అశ్విన్ లేకుండానే టీమిండియా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆటగాళ్లంతా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చాడు. ఈనెల 20 నుంచి సిరీస్ జరుగనుంది. 'ఈ టూర్‌ను మనం రెండు రకాలుగా చూడవచ్చు. మొదటిది ముగ్గురు అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనున్నాం. రెండోది దేశం కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మనకు ఓ అద్భుతమైన అవకాశం దక్కింది. ప్రస్తుత జట్టులో తమను తాము నిరూపించుకోవాలనే తపన, నిబద్ధత కనిపిస్తున్నాయి. అయితే ఈ టూర్‌ను చిరస్మరణీయం చేసుకోవాలంటే మనం సౌకర్యవంతమైన జోన్ నుంచి బయటకు రావాల్సిందే. ప్రతి రోజు, ప్రతీ సెషన్, ప్రతీ గంట, ప్రతీ బంతికి కూడా పోరాడితేనే ఫలితం దక్కించుకుంటాం' అని ప్రాక్టీస్ సందర్భంగా జట్టు సభ్యులతో గంభీర్ అన్నాడు.

అదృష్టవంతుణ్ణి..

టెస్టుల్లో రీఎంట్రీపై కరుణ్ నాయర్



లండన్: ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టెస్ట్‌ల్లో ఆడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని కరుణ్ నాయర్ చెప్పాడు. 33 ఏళ్ల నాయర్ ఇంగ్లండ్ లయన్స్‌తో తొలి అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తరఫున డబుల్ సెంచరీ చేయడం ద్వారా..ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌కు తుది జట్టులో చోటుకు బలంగా రేస్‌లో నిలిచాడు. 'చాలాకాలం తర్వాత టెస్ట్‌లు ఆడే అవకాశం రానుండడం గొప్ప అనుభూతి కలిగిస్తోంది' అని కరుణ్ అన్నాడు. 2018లో ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టులో నాయర్ ఉన్నాడు. కానీ అప్పుడు జరిగిన ఐదు టెస్ట్‌లకూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇక..గత సీజన్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో విదర్భ రంజీ టైటిల్ గెలవడంలో కరుణ్ కీలకపాత్ర పోషించాడు.

రసవత్తరం..

- రెండో రోజు 14 వికెట్లు
- 138కే కుప్పకూలిన దక్షిణాఫ్రికా
- దెబ్బతీసిన పేసర్ కమిన్స్
- ఆధిక్యంలో ఆస్ట్రేలియా
- రెండో ఇన్నింగ్స్ 144/8



కమిన్స్ (6/28)

1 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్లో ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌గా కమిన్స్ (12). అలాగే లార్డ్స్ మైదానంలో ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన (6/28) కనబర్చిన కెప్టెన్‌గానూ నిలిచాడు. ఇక తాజా డబ్ల్యూటీసీ సీజన్‌లో ఎక్కువ వికెట్లు (78) పడగొట్టిన బౌలర్‌గా బుమ్రా (77)ను సైతం అధిగమించాడు.

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్స్ ఫైనల్ అత్యంత రసవత్తరంగా మారింది. రెండో రోజు కూడా 14 వికెట్లతో ఇరు జట్ల బౌలర్లు రాజ్యమేలారు. అయితే ఓవరాల్‌గా డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 218 పరుగుల కీలక ఆధిపత్యంతో పైచేయిలో ఉంది. పిచ్‌తీరును బట్టి చూస్తే మూడో రోజే ఈ టెస్టులో విజేత ఖరారయ్యే అవకాశం కనిపిస్తోంది. పేసర్ కమిన్స్ (6/28) పదునైన బంతులతో దక్షిణాఫ్రికా వెన్నువిరిచాడు. దీంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 138 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా ఆసీస్‌కు 74 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. మిడిలార్డర్‌లో బెడింగమ్ (45), కెప్టెన్ బవుమా (36) మాత్రమే రాణించారు. స్టార్క్‌కు రెండు, హాజెల్‌వుడ్‌కు ఓ వికెట్ దక్కింది. 43/4 ఓవర్‌నైట్ స్కోరుతో గురువారం రెండో రోజు ఆటను ఆరంభించిన సఫారీలు కమిన్స్‌ను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. తొలి సెషన్‌లో బవుమా వికెట్ మాత్రమే కోల్పోగా ఐదో వికెట్‌కు బెడింగమ్‌తో అత్యధికంగా 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత కమిన్స్ విజృంభణకు 8.1 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. మొత్తంగా చివరి ఆరు వికెట్లలో ఐదుగురిని అతనే పెవిలియన్‌కు చేర్చగా.. కేశవ్ (7) రనౌటయ్యాడు. మరోవైపు టెస్టుల్లో కమిన్స్ 300 వికెట్లను సైతం పూర్తి చేసుకున్నాడు.

ఆదుకున్న క్యారీ: రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఆట ముగిసే సమయానికి 8 వికెట్లకు 144 పరుగులు చేసింది. క్రీజులో స్టార్క్ (16 బ్యాటింగ్), లియోన్ (1 బ్యాటింగ్) ఉన్నారు. పేసర్లు ఎన్‌గిడి (3/35), రబాడ (3/44) విజృంభించడంతో ఓ దశలో ఆసీస్ 73/7 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. అయితే క్యారీ (43) అండగా నిలవడంతో జట్టు కోలుకుంది. అతడికి స్టార్క్ సహకరించడంతో ఎనిమిదో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. అలాగే ఆధిక్యం కూడా 200 దాటి సఫారీలకు సవాల్ విసిరింది.

సంక్షిప్త స్కోర్లు: ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్** (బెడింగమ్ 45, బవుమా 36; కమిన్స్ 6/28, స్టార్క్ 2/41); **ఆసీస్ రెండో ఇన్నింగ్స్:** 144/8 (క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/35, రబాడ 3/44).

బెడింగమ్ అవుటా? నాటౌటా?



డబ్ల్యూటీసీ ఫైనల్ రెండో రోజు ఆటలో అరుదైన సన్నివేశం చోటు చేసుకుంది. లంచ్ బ్రేక్‌కు ముందు 49వ ఓవర్‌లో పేసర్ వెబ్‌స్టర్ వేసిన బంతిని దక్షిణాఫ్రికా బ్యాటర్ డేవిడ్ బెడింగమ్ డిఫెన్స్ ఆడాడు. అయితే బంతి ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకుని తన ప్యాడ్‌కు తాకింది. ఆ తర్వాత బాల్ కింద పడే సమయంలో కీపర్ క్యారీ క్యాచ్ కోసం ముందుకు వచ్చాడు. కానీ ఇంతలోనే బెడింగమ్ దాన్ని అందుకుని కింద పడేశాడు. దీంతో బంతిని చేత్తో ముట్టుకున్నాడనే కారణంతో ఆసీస్ అప్పీల్ చేసింది. కానీ ఫీల్డ్ అంపైర్లు నాటౌట్‌గా ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఫీల్డర్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని బంతిని ఆపితేనే బ్యాటర్‌ను అవుట్‌గా ప్రకటిస్తారు. ఇక్కడ బెడింగమ్‌కు అలాంటి ఉద్దేశం లేదని అంపైర్లు భావించారు. అలాగే బంతి ప్యాడ్‌లో చిక్కుకున్నాక డెడ్‌గా ప్రకటిస్తారని కామెంటేటర్ హేడెన్ తెలిపాడు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



12

అమెరికా ఆర్మీ డేకు అతిథిగా
పాక్ సైన్యాధిపతి మునీర్
రేపు జరగనున్న పరేడ్‌కు హాజరు
దౌత్యపరంగా ఎదురుదెబ్బ.. కాంగ్రెస్ విమర్శ

శుక్రవారం | 13-6-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
| విజయవాడ సిటీ**

మరణ విహంగం

గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం
290 మంది దుర్మరణం

మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ
టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కూలిన ఎయిరిండియా విమానం.. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఘటన
లండన్‌కు వెళ్తున్న క్రమంలో ఘోర ప్రమాదం
పైలట్లు సహా విమానంలోని 240 మంది దుర్మరణం
మృత్యుంజయులుగా బయటపడింది ఇద్దరే
జనావాసాలపైకి దూసుకుపోయిన విమానం
మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడ్డ బోయింగ్-787
హాస్టల్‌లోని 50 మంది మెడికల్ విద్యార్థుల మృతి!
గుర్తుపట్టలేని విధంగా కాలిపోయిన మృతదేహాలు
మృతుల గుర్తింపునకు కొనసాగుతున్న డీఎన్ఏ సేకరణ
అహ్మదాబాద్‌కు రామ్మోహన్‌నాయుడు, అమిత్‌షా

పూర్తి కథనాలు 9, 10, 11 పేజీల్లో





అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపట్లోనే ప్రమాదానికి గురై కిందపడి పేలిపోయిన ఎయిరిండియా విమానం



మెడికోల హాస్టల్లోకి దూసుకెళ్లిన విమాన శకలం



ప్రమాదంలో భవనంపై తెగి పడిన విమానం రెక్క

మధ్యాహ్నం ఒకటిన్నర! అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లేందుకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి బోయింగ్ 787 గాల్లోకి లేచింది! కేవలం 59 సెకన్లలోనే ఎలా పైకి లేచిందో అలాగే కిందకు కూలిపోయింది! చుట్టుపక్కల జనావాసాల్లోకి దూసుకుపోయింది! విమానం అప్పుడే బయలు దేరడంతో ట్యాంకు నిండా ఇంధనమే! అది కూడా.. ఏకంగా 1.25 లక్షల లీటర్లు! దాంతో, భారీ విస్ఫోటం. పెద్దఎత్తున మంటలు! కరి మబ్బులు నేలకు దిగాయా అన్నట్లు చుట్టూ దట్టంగా కమ్మేసిన పొగ! ఈ ఘోర ప్రమాదంలో విమానంలోని 240 మంది మరణించారు! వారిలో అత్యధికుల మృతదేహాలు గుర్తు కూడా పట్టలేనంత దారుణంగా కాలిపోయాయి! కొందరికి తల, మరికొందరికి కాళ్లు, చేతులు తెగి రోడ్డుపైన పడ్డాయి! ఈ ఘోరం కారణంగా మరో దారుణమైన విషాదమూ చోటుచేసుకుంది! కూలుతూనే జనావాసాల్లో దిగిన విమానం అక్కడి మెడికల్ కాలేజీ హాస్టల్లోకి దూసుకెళ్లింది! మధ్యాహ్న భోజన విరామం కావడంతో అప్పుడే అక్కడ మెడికోలు, డాక్టర్లు, సిబ్బంది భోజనాలు చేస్తున్నారు! పేలిన విమానం, దాని శకలాలు హాస్టల్లోకి చొచ్చుకురావడంతో వారిలో దాదాపు 50 మంది వరకూ దుర్మరణం చెందారని దైనిక్ భాస్కర్ గుజరాతీ ఎడిషన్ దివ్య భాస్కర్ పేర్కొంది! ప్రమాదంలో పెద్దఎత్తున స్థానికులు గాయపడ్డారని తెలిపింది! ఇంతటి ఘోర ప్రమాదం నుంచి ఇద్దరు మృత్యుంజయులుగా బయటపడడం నిజంగా అద్భుతమే! ప్రమాదం ఎందుకు.. ఎలా జరిగిందన్నది నిపుణులకూ అంతుచిక్కడం లేదు! ఇంజన్లు విఫలం కావడమే ప్రమాదానికి కారణమని చెబుతున్నా.. దానిపైనా భిన్నాభిప్రాయాలే!!

కాబోయే డాక్టర్లు.. కలచెదిరి..

హాస్టల్ మెస్‌పై విమానం కూలడంతో పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థుల మృతి!
భోజనం చేస్తూనే కన్నుమూసిన కొందరు
మరికొందరికి తీవ్ర గాయాలు
భవనంలో ఎటు చూసినా విధ్వంసమే
50 మంది వైద్య విద్యార్థులు మరణించినట్టు పేర్కొన్న దైనిక్ భాస్కర్ వార్తా సంస్థ



విమానం కూలడంతో దగ్ధమైన మెడికల్ కాలేజీ హాస్టల్ భవనం



కార్పొరేటర్ స్థాయి నుంచి.. రాష్ట్రానికి రెండుసార్లు సీఎంగా
ముగిసిన విజయ్ రూపానీ ప్రస్థానం

అసలేం జరిగింది..!?

ల్యాండింగ్ గేర్ కిందికి ఎందుకు ఉంది?
2 ఇంజన్లు విఫలమయ్యే అవకాశాలు తక్కువ
విమానం అసలు ప్రయాణానికి సిద్ధంగా ఉందా?
ఇంజన్ల విఫలం లేదా పక్షి ఢీకొట్టడం వల్లే కూలింది!
విమాన ప్రమాదంపై నిపుణుల విశ్లేషణలు

మాటలకందని విషాదం

విమాన ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ తదితరుల దిగ్భ్రాంతి

డ్రీమ్‌లైనర్.. డిజాస్టర్!

బోయింగ్ 787 అత్యాధునికం.. సమస్యలూ అత్యధికం
హైడ్రాలిక్ లీక్, బ్యాటరీ సమస్యలతో పలుమార్లు అత్యవసర ల్యాండింగ్.. తయారీ, భద్రతలో లోపాలు
పలు విమానయాన సంస్థల ఫిర్యాదులు
కుప్పకూలడం మాత్రం ఇదే తొలిసారి!



రమేశ్ విశ్వాస్

మృత్యుంజయుడు

ప్రాణాలతో బయటపడ్డ రమేశ్ విశ్వాస్
ట్రాఫిక్‌జామ్ ఆమెకు వరమైంది

మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం

వైద్య కాలేజీ హాస్టల్‌ను పునర్నిర్మించి ఇస్తాం
టాటా గ్రూప్ ప్రకటన



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

ముందస్తు వ్యూహంతోనే అరాచకం

కుట్ర కోణంపై పోలీసులు అనుమానాలు
ముందురోజు వాట్సాప్ మెసేజీల పరిశీలన
పొదిలిలో మహిళలపై దాడి కేసులో తొమ్మిది మంది వైసీపీ మూకల అరెస్టు 7

పరీక్షలు మొదలయ్యాయి.. స్టే ఇవ్వలేం 7

మెగా డీఎస్సీ నిలిపివేతకు సుప్రీం నో

తిరుమల కొండపై ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం: ఈవో 7

ఏం మాట్లాడేదీ తెలియదా?



కృష్ణంరాజును మంగళగిరి కోర్టులో హాజరుపరిచి తీసుకువెళుతున్న పోలీసులు

వేశ్యల రాజధాని అని ఎలాగన్నారు? 12
కృష్ణంరాజును నిలదీసిన మంగళగిరి కోర్టు
తప్పుచేశానని అర్థమవుతోందన్న కృష్ణంరాజు
ఏ-1కు రిమాండ్ విధించిన మెజిస్ట్రేట్.. గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

మహిళలకు కోటా రెడీ!

2029 ఎన్నికల్లో 33% సీట్లు.. లోక్‌సభ, అసెంబ్లీల్లో అమలుకు కేంద్రం ప్రణాళిక
కొత్త జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన
ఆ ప్రక్రియలోనే అతివలకు రిజర్వేషన్ ఇచ్చేందుకు సన్నద్ధం 12

9 నెలల్లోనే జనాభా లెక్కలు రెడీ!

ఫారాలు పూర్తిచేయడం ఉండదు
డేటా మొత్తం ప్రత్యేక యాప్ ద్వారా సేకరణ
16 భాషల్లో ఈ యాప్ రూపకల్పన

ఇక ఉపేక్షించను!

రౌడీమూకతో రైతులకు పరామర్శా?
జగన్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం
శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోను
ఇప్పటి వరకూ నా మంచితనమే చూశారు
రౌడీయిజం చేసేవారి ఆటలిక సాగనివ్వను
రాక్షసుల్లా రాష్ట్రాన్ని నాశనం చేసే కుట్ర
11 సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదు
వేశ్యల రాజధాని అన్నవారి ఇళ్లలో ఆడవాళ్లు లేరా?
ఎంత కొవ్వెక్కితే ఇలాంటి మాటలొస్తాయి?
'తల్లికి వందనం' కింద ఒక్కరోజే 10 వేల కోట్లు
దేశంలో మరే రాష్ట్రమూ సంక్షేమంలో మన దరిదాపుల్లో లేదు: సీఎం చంద్రబాబు

విమాన దుర్ఘటనతో 'ఏడాది' వేడుకలు రద్దు 8
చంద్రబాబుతో 15న సినీ ప్రముఖుల భేటీ 4



విద్యా మంత్రి లోకేశ్‌కు 'తల్లికి వందనం' జీవో ప్రతిని అందజేస్తున్న సీఎం చంద్రబాబు

మాట నిలబెట్టుకున్నాం

సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన **తల్లికి వందనం** అమలుకు శ్రీకారం: సీఎం

67 లక్షల మందికి లబ్ధి.. గత ప్రభుత్వంలో కంటే **24.65** లక్షల మంది అదనం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): "ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చాం. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం. ఇచ్చిన హామీని అమలు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహావిషాదం...

ఆ భయానక ఘటన ఒళ్ళు జలదరింపచేస్తోంది. ఆ పెను విషాదం గుండెలను నలిపేస్తున్నది. అలవోకగా సముద్రాలను అధిగమించి, సునాయాసంగా వేలాదికిలోమీటర్లు దూసుకుపోవాల్సిన ఆ లోహవిహంగం నింగిని తాకకముందే నేలవాలిపోయింది. తల్లిగర్భంలో శిశువులా భద్రంగా ఉన్నామని, గమ్యాన్ని నిక్షేపంగా చేరుకుంటామన్న ప్రయాణికుల నమ్మకాన్ని ఈ ఇనుప రెక్కల పక్షి వమ్ముచేసింది. అనేక ఆశలనూ, ఆశయాలను, ఊసులనూ గుండెల్లో నింపుకొని, నేలవాలగానే ముంచెత్తబోయే సన్నిహితుల, ఆత్మీయుల ఆలింగనాల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్నవారు అర్థంతరంగా, అతివిషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సివచ్చింది. మహాశక్తిమంతమైన ఇంజన్, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్న ఒక గొప్ప కంపెనీ విమానం రివ్వున ఎగిరి, లండన్‌లో నిక్షేపంగా దిగడానికి బదులు వందల అడుగులు లేవడానికే వేదనపడటం, క్షణాల్లో కూలి భగ్గుమనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏం జరిగిందన్నది కళ్ళకు కనిపిస్తోంది. ఎందుకు జరిగిందన్న ప్రశ్న మాత్రం నిర్దిష్టమైన, నమ్మశక్యమైన సమాధానం దొరికేవరకూ మనలను నిలవనివ్వదు. మాటలకు అందని మహా విషాదం ఇది.

పట్టుమని తొమ్మిదివందల అడుగులు కూడా లేవలేక విమానం కుప్పకూలింది. విమాన ప్రమాదాల్లో సగానికి పైగా టేకాఫ్, లాండింగ్ సందర్భాల్లోనే జరుగుతాయి కనుక, పక్షి ఢీకొన్నదేమోనన్న అనుమానాలూ ఉన్నాయి. టేకాఫ్ సక్రమంగా జరగలేదని, అందుకు తగినంత శక్తి సమకూరలేదని అర్థమవుతూనే ఉంది. పొట్టనిండా ఇంధనం ఉన్నా, సరఫరా వ్యవస్థల్లో లోపం ఉంటే, ఇంధనం సరిగా చేరక ఇంజన్ విఫలమవుతుంది. ఇంజన్ మీద అత్యంత భారం పడే టేకాఫ్ సందర్భం పైలట్ల నైపుణ్యానికీ, అనుభవానికీ కూడా ఓ విషమపరీక్ష. నిండుగా ఉన్న ఇంధనం నిక్షేపంగా గమ్యానికి చేర్చాల్సింది పోయి విమానం మొత్తం క్షణాల్లో భగ్గుమనిపోయేందుకు ఉపకరించడం విషాదం. కాపాడమంటున్న ఆ మేడేకాల్ క్షేత్రస్థాయికి చేరి, ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది స్పందించేలోగానే విమానం మరింత కిందకు జారింది, అంతిమంగా కుప్పకూలింది. దురదృష్టకరమైన ఈ పరిణామానికి తోడు, ఆ విమానం వైద్యవిద్యార్థుల హాస్టల్ మీద పడి, అనేక మంది ప్రాణాలు తీసింది. తాను కుప్పకూలుతూ అన్నం తింటున్న వారిని పొట్టనబెట్టుకుంది. ఈ హాస్టల్ భవనం సహా విమానాశ్రయానికి చేరువలో ఉన్న ప్రాంతాలన్నీ ఈ విధ్వంసం తీవ్రతకు ప్రత్యక్షసాక్ష్యాలు. డీఎన్ఏ పరీక్షతో తప్ప మృతులను గుర్తుపట్టలేని రీతిలో ఈ వినాశనం జరిగింది. అందరినీ పొట్టనబెట్టుకున్న ఆ విమానంలో నుంచి ఒకే ఒక్కడు నిక్షేపంగా బయటపడటం ఓ అద్భుతం. విమానంలో నుంచి ఎవరో విసిరివేసినట్టుగా, ఒంటిమీద పెద్ద గాయాలు లేకుండా బతికి బయటపడిన ఈ వ్యక్తి తనకు తానుగా నడిచిపోతున్న ఆ దృశ్యం ఎన్నటికీ చెరిగిపోనిది.

ఇప్పుడు ప్రమాదానికి గురైన విమానానికి వయసెక్కువనీ, సాంకేతిక సమస్యలతోనూ, పలుమార్లు డీజీసీఏ హెచ్చరికలతో దానిని పక్కనబెట్టారని కొన్ని వార్తలు వస్తున్నాయి. నిజానిజాలు అటుంచితే, శల్యపరీక్షలు చేయనిదే, ప్రయాణానికి నూరుశాతం అర్హమైనదని నిర్ధారణ కానిదే ఏ విమానమూ గాలిలోకి ఎగరదు. అత్యంత అనుభవజ్ఞులైన పైలట్, కోపైలట్‌కు ఏ మాత్రం అనుమానం కలిగినా ఈ ప్రయాణానికి అంగీకరించేవారే కాదు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగిన తరువాత, మొత్తంగా బోయింగ్ మీద, ప్రత్యేకించి ఈ తరహా విమానాలమీద కొన్ని సత్యాసత్యాలు ప్రచారంలోకి రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఈ విమానాలు నిక్షేపంగా తిరుగుతున్నమాటా నిజం. ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన సందర్భంలో టాటా సంస్థకు సంక్రమించిన విమానాల్లో కొన్నింటికి వయసు మీదపడటంతో వాటి ఆధునికీకరణ కూడా సాగుతోందని అంటారు. గత నెలలోనే నాలుగు వందల మిలియన్ డాలర్ల వ్యయంతో అది మలిదశ కార్యక్రమానికి నడుంబిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో, ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదు. విమానాల ఆధునికీకరణకు సంబంధించి దేశీయ విమానయానసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని వాటి తరఫున విదేశాలతో వ్యవహరించడం అవసరం. సాంకేతిక వైఫల్యాల నుంచి మానవ నిర్లక్ష్యం వరకూ ఈ ప్రమాదానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ నిజాయితీతో గుర్తించి, కఠినమైన చర్యలను చేపట్టడంతో పాటు, సరైన పరిష్కారాలను సాధించడం అవసరం.

విద్యాధామాల్లో రెక్కలు తెగుతున్న స్వేచ్ఛ



ప్రతి ప్రశ్నకు సమాధానం కోసం మనం ఎఐను ఆశ్రయిస్తున్నప్పుడు సరైన ప్రశ్న అడిగేందుకు ఎఐ సహాయాన్ని పొందలేమూ? అశోక విశ్వవిద్యాలయ విద్యా కుటుంబానికి చెందిన బిఖ్‌చందాని లేఖను చదివినప్పుడు నా మనసులో మెదిలిన మొదటి ఆలోచన అది. బిఖ్‌చందాని బహిరంగంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలతో నేను విభేదిస్తున్నప్పటికీ ఆయన లేఖను సానుభూతితో చదివాను. ప్రథమ శ్రేణి లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపరిచేందుకు, నిజంగా లాభాపేక్ష లేకుండా సకల వసతులు, సదుపాయాలు సమకూర్చిన అశోక విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు ప్రతి ఒక్కరి, ముఖ్యంగా దాని నుంచి తమ పిల్లలు లబ్ధి పొందుతున్న నా లాంటి తల్లిదండ్రుల గౌరవానికి సంపూర్ణంగా అర్హులు.

బిఖ్‌చందాని ఒక అస్పష్టమైన, తప్పుడు తార్కికతతో కూడిన ప్రశ్న అడగడం నాకు విచారం కలిగించింది. 'లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాలు అన్నీ స్వతస్సిద్ధంగా క్రియాశీలమైనవా? క్రియాశీలత వాటి ముఖ్య కర్తవ్యమా?' కాదు అనేదే దీనికి ఇవ్వగల సమాధానం. అన్ని విశ్వవిద్యాలయాలు ఒకేలా ఎలా ఉంటాయి? ఇతర విశ్వవిద్యాలయాలు వ్యవహరిస్తున్న తీరుతెన్నులు 'అశోక'కు ఆదర్శమూ, ప్రమాణమూ ఎలా అవుతాయి? ఏది ఏమైనప్పటికీ ఒక విశ్వవిద్యాలయం స్వాభావిక క్రియాశీలతతో వ్యవహరించడమంటే ఏమిటి? విశ్వవిద్యాలయం ఒక సంస్థగా క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉండదూ? బిఖ్‌చందాని ఈ ప్రశ్నను, తాను ధర్మకర్తగా ఉన్న విశ్వవిద్యాలయంలోని వందలాది అధ్యాపకుల–దేశంలోనే అత్యుత్తమమైనవారు– ను కాకుండా ఒక చాట్ బాక్స్‌ను అడగడం నన్ను విస్మయపరిచింది.

బిఖ్‌చందాని అడగవలసిన ప్రశ్నలు: లిబరల్ ఆర్ట్స్ విద్య తన స్వభావ రీత్యా ఏదో ఒక విధమైన క్రియాశీలతను ప్రోత్సహిస్తుందా? అయినప్పుడు లిబరల్ ఆర్ట్స్ విద్యను బోధించే విశ్వవిద్యాలయం ఆ క్రియాశీలతతో ఎలా వ్యవహరించాలి? సమాజాన్ని బాధిస్తున్న సమస్యలను విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులలో చేర్చడం ద్వారా వాటి పరిష్కారానికి క్రియాశీలంగా పని చేయాలా? అటువంటి నిమగ్నతను కేంపస్ సంస్కృతిలో ప్రోత్సహించాలా? కేంపస్‌లోను, కేంపస్ వెలుపల అటువంటి క్రియాశీల కార్యకలాపాలలో పాల్గొనేందుకు అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందిని అనుమతించాలా?

ఇవన్నీ ఏ సంస్థకు అయినా, ముఖ్యంగా ఏ విద్యా సంస్థకు అయినా సాధారణ ప్రశ్నలే. ఉత్తమ విద్య ఏదైనా విద్యార్థులలో జిజ్ఞాసను పెంచాలి. ఉత్సుకత, ప్రశ్నించడం, విశాల దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, శ్రద్ధ, సృజనాత్మకతతో కూడిన విచారణ స్ఫూర్తిని పెంపొందించాలి. గ్రహించిన జ్ఞానాన్ని ప్రశ్నించడాన్ని, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అధికారాన్ని నిలదీయడాన్ని నేర్పాలి. విద్య స్వతస్సిద్ధంగా విధ్వంసకమైనదని బ్రెజీలియన్ విద్యావేత్త, తత్వవేత్త Paulo Freire అన్నారు. ఈ విద్యా ధర్మాన్ని లిబరల్ ఆర్ట్స్ విద్య మరింత ముందుకు తీసుకెళుతుంది. తమ విమర్శనాత్మక ఆలోచనను సొంత జీవితాలకు, సమాజానికి వర్తింపచేసేలా విద్యార్థులను పురిగొల్పుతుంది. అందుకు అవసరమైన శిక్షణనిస్తుంది. తమలోను, తోటివారిలోను ఉన్న దురభిప్రాయాలు, సమాజంలోని ఆధిపత్యవర్గాల ప్రత్యేక హక్కులను ప్రశ్నించేలా చేస్తుంది. ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్ లాంటి రాజనీతి శాస్త్ర విద్యార్థులు, అధ్యాపకులు ఈ విషయంలో మరింత ముందుంటారు. రాజకీయ అధికార ప్రాబల్య ప్రాభవాలను నిత్యం నిశితంగా ప్రశ్నించడం వారి మేధో కర్తవ్యం కదా.

> ఒక విశ్వవిద్యాలయం తన విద్యా కుటుంబంలోని ఒక సభ్యుడు రాజకీయ కారణాలతో వేధింపులకు గురవుతున్నప్పుడు అతడికి బాసటగా ఉండాలా? వివాదం మొదలయినా మొదలవక ముందే అతడిని అతడి కర్మకు వదిలేయాలా? అతడికి న్యాయపరంగా కాకపోయినా నైతిక మద్దతు అయినా ఇవ్వకూడదా? కనీసం మౌనంగా ఉండిపోకూడదా? బిఖ్‌చందాని లేఖను అశోక విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుల నుంచి దాని విస్తృత విద్యా కుటుంబానికి సందేశంగా భావిస్తే అది ఒక అంతిమ హెచ్చరిక చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. ఆ హెచ్చరిక తీవ్రంగా, స్ఫుటంగా, భీతిగొల్పే విధంగా ఉన్నది.

లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం దేనికైనా వేయవలసిన ప్రశ్న ఇది: 'తన బోధనకు ముందున్న పరిస్థితులు, బోధన పర్యవసానాలతో విశ్వవిద్యాలయం ఎలా వ్యవహరించాలి? ఈ విద్యను బోధించేవారు విమర్శనాత్మకంగా, నిష్పాక్షికంగా, విశాల దృక్పథంతో ఆలోచించ గలిగినవారు అయినప్పుడే నాణ్యమైన లిబరల్ ఆర్ట్స్ విద్య సమకూరుతుంది. బోధనా సంస్థ భావాల స్వేచ్ఛా వినిమయాన్ని ప్రోత్సహించడమనేది కూడా చాలా ముఖ్యం. మానవీయ శాస్త్రాల విద్య సొంత నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యమున్న వారిని, తమ విశ్వాసాలకు అనుగుణంగా నిజజీవితంలో ప్రవర్తించగల దృఢ వ్యక్తిత్వమున్న వారిని రూపొందించేదిగా ఉండాలి. వ్యక్తుల వాస్తవ జీవితాలు, సమాజ సమష్టి జీవితం సంక్లిష్టమైనవి. అవి విసిరే సమస్యలు, సవాళ్లను క్రియాశీలంగా ఎదుర్కొనేందుకు అనుమతించకుండా, అందుకు దోహదం చేయకుండా ఒక లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంతో సహా ఏ విశ్వవిద్యాలయమైనా తన విద్యా బోధన విధ్యుక్త ధర్మాన్ని పరిపూర్తి చేయగలదా? సమాజ సమస్యల పరిష్కారానికి క్రియాశీల కృషిని పౌర ధర్మంగా గౌరవించాలి. ఇదే క్రియాశీలత అయితే లిబరల్ ఆర్ట్స్ విద్య, క్రియాశీలత మధ్య బొడ్డుతాడు సంబంధమున్నదని గుర్తించాలి, అంగీకరించాలి.



■ యోగేంద్ర యాదవ్

ఒక విశ్వవిద్యాలయం ఏదో ఒక తరహా పక్షపాతాన్ని పెంపొందించాలని నేను చెప్పడం లేదు. పోటీ దృక్పథాలు, భావజాలాలకు సమ ప్రాధాన్యం లభించేలా చూడాలి. మహమూదాబాద్ లాంటి అధ్యాపకుల రాజకీయ విశ్వాసాలు చర్చనీయాంశాలుగా ఉన్నంతవరకు అవి విద్యకు ఆటంకం కాబోవు. పక్షపాత దృక్పథంతో సిద్ధాంతాలను విద్యార్థుల మనసుల్లోకి ఎక్కించడం, వాటిని సహజ వివేకంగా ఆమోదించడం సరికాదు, అటువంటి క్రియాశీలతకు నియమ నిబంధనలు ఉండాల్సిన అవసరమున్నది. సంస్థాగత ప్రదేశాలలో ఏ తరహా, ఏ రీతి క్రియాశీలతను అనుమతించాలి, ప్రోత్సహించాలి అనే విషయమై విశ్వవిద్యాలయాలు స్పష్టమైన హద్దులు ఏర్పరచుకోవచ్చు. అయితే విమర్శనాత్మక ఆలోచనను, పౌర చర్య (సివిక్ యాక్షన్)ను వేరుపరచడం వల్ల లిబరల్ ఆర్ట్స్ విద్య పరమ లక్ష్యమే నిష్ఫలమవుతుంది.

ప్రత్యామ్నాయ దృక్కోణాలను అన్వేషించే ఈ ప్రాథమిక చర్చ మహమూదాబాద్ కేసులో ప్రశ్నను తప్పించుకోవడానికి ప్రయత్నించకూడదు. ఇంతకూ ఆ ప్రశ్నను బిఖ్‌చందాని పరిగణనలోకి తీసుకోనేలేదు. అధ్యాపకుల లేదా విద్యార్థుల ప్రతి సోషల్ మీడియా పోస్ట్‌కు లేదా వారు రాసిన ఒక పరిశోధనా వ్యాసానికి విశ్వవిద్యాలయం బాధ్యత వహించాలని ఎవరూ అడగడం లేదు. ఇదీ అసలు ప్రశ్న: ఒక విశ్వవిద్యాలయం తన విద్యా కుటుంబంలోని ఒక సభ్యుడు రాజకీయ కారణాలతో వేధింపులకు గురవుతున్నప్పుడు అతడికి బాసటగా ఉండాలా? వివాదం మొదలయినా మొదలవక ముందే అతడిని అతడి కర్మకు వదిలేయాలా? అతడికి న్యాయపరమైన మద్దతు ఇవ్వకపోయినప్పటికీ నైతిక మద్దతు అయినా ఇవ్వకూడదా? కనీసం మౌనంగా ఉండిపోకూడదా?

శోచనీయమైన విషయమేమిటంటే సరిగ్గా ఈ విషయంలోనే అశోక వర్సిటీ ప్రతిస్పందన అసంతృప్తికరంగా ఉన్నది. ఆ సంస్థ తాను ప్రవర్తించిన తీరుకు భిన్నంగా వ్యవహరించి వుంటే బాగుండేదనిపిస్తుంది. మహమూదాబాద్ అరెస్ట్‌కు 'అశోక' ప్రథమ ప్రతిస్పందన, ఆ ప్రొఫెసర్ సోషల్ మీడియా పోస్ట్ సైనిక దళాలకు వ్యతిరేకంగా ఉన్నదనే డొంకతిరుగుడు వాదనను సమ్మతించిన విధంగా ఉన్నది. అరెస్ట్ అయిన అనంతరం మీడియా, ప్రభుత్వం మాదిరిగానే విశ్వవిద్యాలయమూ అతడు తప్పు చేసినట్టుగానే భావించినట్టు ఉన్నది. బిఖ్‌చందాని లేఖ మరో విధంగా భావించేందుకు ఆస్కారమివ్వడం లేదు. మహమూదాబాద్ తన రాజకీయ ఎజెండాకు 'అశోక'ను ఉపయోగించుకున్నాడనేది విశ్వవిద్యాలయ నిర్వాహకులు ఆక్షేపిస్తున్నారు. ఇందులో నిజం లేకపోలేదు. ఈ దృష్ట్యా తమ విద్యాకుటుంబంలోని బాధ్యతాయుత వ్యక్తి ఎవరైనా తన రాజకీయ చర్యలతో విశ్వవిద్యాలయానికి ఇబ్బందులు కలిగించకుండా ఉండేలా ఒక నిర్దుష్టమైన విధానాన్ని రూపొందించుకోవాలి.

భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన అధ్యాపకులతో వ్యవహరించే విషయంలో 'అశోక' ప్రతిస్పందన ఉదార దృక్పథంతో లేదనే విమర్శలు రావడం మహమూదాబాద్ విషయంలోనే మొదటిసారి కాదు. అలాంటి ప్రతి సందర్భంలోనూ విశ్వవిద్యాలయం ఔదార్యరహితంగా, అసహిష్ణుతతో వ్యవహరించేందుకే మొగ్గుచూపినట్టుగా కనిపిస్తుంది. బిఖ్‌చందాని లేఖను విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుల నుంచి దాని విస్తృత విద్యా కుటుంబానికి సందేశంగా భావిస్తే అది ఒక అంతిమ హెచ్చరికను సూచిస్తున్నట్టు స్పష్టమవుతుంది. ఆ హెచ్చరిక తీవ్రంగా, స్ఫుటంగా, భీతిగొల్పే విధంగా ఉన్నది.

అశోక వర్సిటీ నిర్వాహకులు ఎటువంటి ప్రతిబంధకాలలో పనిచేస్తున్నారో మనకు తెలియదు. ఉదారవాద భావాలు, విశాల దృక్పథాన్ని పెంపొందించేందుకు అంకితమైన ఒక విశ్వవిద్యాలయం అప్రజాస్వామిక, సంకుచిత పాలనా వ్యవస్థలో పనిచేయడమనేది దాని ఆశయాలు, లక్ష్యాల రీత్యా ఒక అసంగత విషయం. తమకు ఇబ్బందులు కలిగించే రాజకీయ చర్యలను ఇంకెంత మాత్రం సహించకూడదనే అభిప్రాయానికి అశోక వ్యవస్థాపకులు వచ్చి ఉండవచ్చు. అసలు వర్సిటీ మనుగడకు, తమ వ్యాపార ప్రయోజనాలకు ఆపద వాటిల్లకుండా తమ స్వప్నాన్ని వారు సమర్థించుకోలేరు. ఇది అర్థం చేసుకోదగిన విషయమే. అయితే వారు తమ పరిస్థితిని నైతిక సూత్రాలు, నైతిక పరిగణనలను నొక్కి చెప్పే భాషలో వ్యక్తీకరించవలసిన అవసరం లేదు. మీరు సమర్థించలేని బాధితుడిని అపరాధానికి పాల్పడిన వాడుగా భావించకూడదు.

ఉదారవాద విద్యా విలువల సంక్షోభానికి సంబంధించిన ఈ చర్చ అశోక విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు నిర్వాహకులకే పరిమితమవకుండా అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థినీ విద్యార్థులతో కూడిన విస్తృత అశోక విద్యా కుటుంబానికి విస్తరించాలి. మరి ఆ ఉన్నత విద్యా ధామంలో ఉదారవాద విద్యను కాపాడుకోవడంలో వారందరికీ విధిగా సంబంధముండి తీరాలి. ఈ దేశంలో ఉదారవాద విద్య నిజమైన విషాదం అశోక విశ్వవిద్యాలయంలో సంభవించింది మాత్రమే కాదు. సమున్నత విద్యా బోధన, పరిశోధనకు పేరు పొందిన జేఎన్‌యూ, డీయూ, హెచ్‌సీయూ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ మొదలైన వాటిని చెడగొట్టిన తీరుతెన్నులు కూడా ఆ విషాదకథలోకే వస్తాయి. విద్యార్థుల, అధ్యాపకుల పౌర ధర్మ క్రియాశీలతను ఉన్నతశ్రేణి విద్యా సంస్థలు, సంపద్వంతులు అయిన వాటి దాతలు సమర్థించరు. ప్రజలే ఆ చైతన్యశీల క్రియాశీలతను సమర్థించాలి, కాపాడుకోవాలి. ఇది చెప్పేందుకు మనకు ఒక చాట్ బాట్ అవసరం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

వర్సిటీల ప్రక్షాళన ఇలా మొదలుకావాలి!

కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో విశ్వవిద్యాలయాలను శుద్ధి చేయాలని ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఒక రచయిత రాశారు. విశ్వవిద్యాలయాలకు రాజకీయ వాతావరణం కాకుండా విద్యా వాతావరణం అవసరమనేది నిజం. తదనుగుణంగా, అతిథి అధ్యాపక వ్యవస్థ ప్రక్షాళనతోనే ఆ కార్యాచరణ మొదలుకావాలి. ఒక విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకుల సగటు వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుంది. కొన్ని సందర్భాల్లో 55 సంవత్సరాల వరకూ ఉంటుంది. వారు దాదాపు 20 ఏళ్ల క్రితం తమ పీహెచ్‌డీలను పూర్తి చేసుకొని ఉంటారు. అయినా వారు దేశంలోని ప్రభుత్వ/ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవిని పొందలేకపోయారంటే, సమర్థత కొరవడడం వల్ల, వారు రాష్ట్రం వెలుపల ఏ పదవికీ దరఖాస్తు చేసుకోలేదని భావించవచ్చు. ఇక, ఈ అతిథి అధ్యాపకులలో ఎంతమంది UGC-NET లేదా CSIR పరీక్షలో అర్హత సాధించారు? చాలా తక్కువ. అర్హత సాధించిన వారు కూడా అనేక ప్రయత్నాల తర్వాతే క్లియర్ చేశారు. ఉదాహరణకు–2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించినప్పుడు అతిథి అధ్యాపకులలో ఎక్కువమంది ఈ పరీక్షలో అర్హత సాధించనేలేదు. పైగా వీరిలో చాలామంది ఆంగ్లంలో ఉపన్యసించలేరు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 79 దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులున్నారు. తరచుగా వారు ఈ అతిథి అధ్యాపకులు అర్థం కాని ప్రాంతీయ భాషలో తమకు బోధిస్తున్నారని వైస్-ఛాన్సలర్‌కు ఫిర్యాదులు చేశారు. అతిథి అధ్యాపకులు భారతీయ విద్యార్థులు కాపీ చేయడాన్ని ప్రోత్సహిస్తారని కూడా విదేశీ విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఒక విద్యార్థి కాపీ చేయడానికి సహకరిస్తూ ఒక గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యుడు పట్టుబడ్డాడు కూడా. ఈ అధ్యాపకుల్లో అత్యధికులు ఆంగ్లంలో వ్యాసం రాయలేరు, ఆంగ్లంలో పుస్తకం చదవలేరు. కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులకు ఉన్నత విద్యలో మార్పు గురించి అవగాహన లేదు. వీరిలో చాలామంది దేశంలోని ఉన్నతవిద్యా సంస్థలను సందర్శించలేదు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సెమినార్ పత్రాన్ని సమర్పించలేదు. విశ్వవిద్యాలయాలలోని అతిథి అధ్యాపకులలో ఎక్కువ మంది రాజకీయ లేదా కుల కారణాల ద్వారా ప్రవేశించారు. అతి తక్కువమంది మాత్రమే అర్హతల కారణంగా విశ్వవిద్యాలయాలలో చేరారు. ప్రతిభావంతులలో ఎక్కువమంది ఇతర విశ్వవిద్యాలయాలకు వెళ్ళిపోయారు.

ఇరవై సంవత్సరాల క్రితం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఇచ్చిన మొదటి NAAC నివేదికలోని సిఫార్సులలో ఒకటి విశ్వవిద్యాలయంలో 'ఇన్–బ్రీడింగ్' తగ్గించడం. అంటే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వంటి విశ్వవిద్యాలయ పోస్టులను రాష్ట్రం వెలుపలి వ్యక్తులతో భర్తీ చేయాలి. ఆ సిఫార్సుకు వ్యతిరేకంగా, స్థానిక వ్యక్తులనే నియమిస్తున్నారు. వాస్తవానికి, అతిథి అధ్యాపకులలో ఎవరికీ సేజ్, రౌట్లెడ్జ్, స్ప్రింగర్ వంటి అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన జర్నల్స్‌లో ప్రచురణలు లేవు. అనర్హులైన అతిథి అధ్యాపకులను తొలగించడం ద్వారా విశ్వవిద్యాలయాల ప్రక్షాళన ప్రారంభించాలి. విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి కొత్త ప్రభుత్వం విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సమగ్ర ఎంపిక ప్రక్రియ చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు గత వైభవాన్ని తిరిగి పొందాలి. ముఖ్యంగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం దాని వందవ సంవత్సరంలో సంస్కరణలను చేపట్టాలి. భావితరాలకు రోల్ మోడల్‌గా మారే విద్యా పదవుల్లో ప్రతిభ ఉన్న వ్యక్తులను నియమించాలి.

– డాక్టర్ సి.ఎం వినయకుమార్
అసోసియేట్ ప్రొఫెసర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం

పొట్లపల్లి కమల మనోహర్‌రావుపై డాక్యుమెంటరీ

పొట్లపల్లి కమల మనోహర్‌రావు డిసెంబర్ 20, 1919న జన్మించారు. స్వగ్రామం అశ్వరావుపల్లి (రఘునాథపల్లి మండలం, జనగాం జిల్లా). ఆయన నిజాం ప్రభుత్వంలోని సామాజిక సంక్షేమశాఖలో పనిచేశారు. ఆదివాసీ సమూహాల అభివృద్ధి కోసం, ప్రత్యేకంగా గిరిజన సంక్షేమశాఖ ఏర్పాటుకు కృషిచేసి సాధించారు. 1966లో గిరిజన సంక్షేమశాఖ స్థాపించినపుడు ఆయన దాని మొదటి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి 1975లో పదవీ విరమణ వరకు ఆదివాసీల జీవన విధానం మెరుగుపరచడం కోసం ఎంతో కృషి చేశారు. 'సింగిల్ విండో' పరిపాలనా సూత్రాన్ని ప్రవేశపెట్టిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. ఆదిలాబాద్ గోండు ఆదివాసీలపై అధ్యయనం చేసిన ప్రొఫెసర్ హైమండార్ఫ్ కమల మనోహర్‌రావు సేవలను గుర్తించి, అభినందిస్తూ కొన్ని లేఖలు కూడా రాశారు. గోండులకు భూమి హక్కు, పట్టాలూ లభించడంలో కమల మనోహర్‌రావు కృషి కూడా ఉంది. ఆయనపై ఒక డాక్యుమెంటరీ అధ్యయనం చేస్తున్నాం. ప్రభుత్వ అధికారిగా గిరిజన సంక్షేమానికి ఆయన చేసిన కృషికి సంబంధించిన వివరాలన్నీ సేకరించదలచుకున్నాము. ఆయనకు సంబంధించిన సమాచారం, ఆర్టికల్స్, పుస్తకాలు ఉంటే మాకు తెలియచేయాలని కోరుతున్నాం. ఆయనతో పరిచయం ఉన్నవారు ఆ జ్ఞాపకాలను పంచుకోదలిస్తే, మేమే వచ్చి ఆ వివరాలు రికార్డు చేసుకుంటాము. ఫోన్: 94405 95858; ఈమెయిల్: smrm5858@gmail.com

– శ్యాంమోహన్

జీపీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

గ్రామ పంచాయతీ కార్మికులు తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణతో పాటు అనేక విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు తక్కువ ఆదాయంతో, ఉద్యోగ భద్రత లేకుండా కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వీరికి సంబంధించి గతంలో పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవో నెం.57లో పలు అంశాలున్నాయి. గ్రామ పంచాయతీ కార్మికులను ఫుల్‌టైం, మల్టీపర్పస్ ఉద్యోగులుగా గుర్తించాలని, వారి వేతనాలను కనీసం పదివేలకు పెంచాలని, గ్రామ ఆదాయంలో సగం వరకు వేతన వ్యయంగా వెచ్చించవచ్చని జీవోలో స్పష్టంగా ఉంది. ఈ అంశాలు అమలుకాకపోవడంతో జీపీ కార్మికులు నిరాశ చెందుతున్నారు. MGNREGA పథకంలో అమలవుతున్న విధంగా జీపీ కార్మికుల వేతనాలు కూడా 'డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' పద్ధతిలో చెల్లించాలి. 2023లో ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఒప్పంద ఉద్యోగుల సేవల నియమితీకరణ చట్టం' ప్రకారం 2014 జూన్ 2 నాటికి ఉద్యోగంలో కొనసాగుతున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించే వీలుంది. ఇదే నిబంధన జీపీ కార్మికులకూ వర్తింపజేయాలి. వీరిలో చాలామంది 45 ఏళ్లకు పైబడినవారు. ఇతర ఉపాధి అవకాశాలు పొందలేని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం జీపీలను ఆదాయం, జనాభా ప్రాతిపదికన నాలుగు గ్రేడ్లుగా రూపొందించాలన్న యోచనలో ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయతీ సిబ్బందిని ఆయా పోస్టుల్లో సర్దుబాటు చేస్తే పంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

– టి.యం.బి. బుచ్చిరాజు
చైర్మన్, ఏపీ పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్

రాజ్యాంగం కంటే వెనకబడినవారు ఏం విప్లవకారులు?

మావోయిస్టుల శాంతి చర్చల ప్రకటనలో రెండుసార్లు రాజ్యాంగ విలువల ప్రస్తావన రావటాన్ని ఒక విశేషంగా గుర్తిస్తూ, డానీ రాసిన, పాలకులు–మావోయిస్టులు, మధ్య రాజ్యాంగం! అనే వ్యాసానికి (ఆంధ్రజ్యోతి–ఏప్రిల్ 15) కొనసాగింపుగా 'రాజ్యాంగంపై మావోయిస్ట్ అవగాహన స్పష్టమే' అంటూ మే 8న పాణి ఒక వ్యాసం రాశారు. పాణి తన వ్యాసంలో, "పౌర హక్కులు, చట్టబద్ధ పాలన, ఆదేశిక సూత్రాలు అనేవి రాజ్యాంగంలో భాగం కావటం చారిత్రకంగా ప్రగతిశీలమైన విషయం. ...పీడిత సమూహాల రక్షణలో ఎంతో కొంత సానుకూల పాత్ర పోషిస్తుంది. ...అయినప్పటికీ సానుకూల అంశాలు వాటంతటవి అమలు కావటం లేదు. ఈ సానుకూల అంశాలను ప్రభుత్వాలు బాహటంగా ఉల్లంఘిస్తున్నాయి. దీనికి తోడు సామాజిక వివక్షల వల్ల కూడా రాజ్యాంగం అమలులోకి రావడం లేదు," అంటున్నారు. నిజమే. మొదటి రెండు పారిశ్రామిక తీర్మాన విధానాలు తప్ప ఆ తరువాత వచ్చినవన్నీ రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నమైనవే. అలాగే పాణి అన్నట్లు అనేక సానుకూల అంశాలు అమల్లోకి రావడం లేదనేదీ వాస్తవమే. అప్పుడు ఏం చేయాలి? సానుకూల అంశాలు అమల్లోకి రావడానికి పోరాటాలు చేయాలి. ఇక్కడ సమస్య పోరాటాల గురించి కాదు, ఆ పోరాటాల కోసం మావోయిస్టులు ఎంచుకున్న సాయుధ పంథా గురించి. దీన్ని ఆయన గుర్తించడం లేదు. అలాగే విప్లవం రాజ్యాంగ పరిధిలో లేని విషయం అంటూనే రాజ్యాంగ పరిధిలో శాంతి చర్చలు జరగాలంటున్నారు. మరి విప్లవం అనేది ఒక్క మావోయిస్టు పార్టీకి మాత్రమే లక్ష్యంగా ఉందా? ఇతర ఎమ్ఎల్ పార్టీలకు గాని కమ్యూనిస్టు పార్టీలకు గాని లక్ష్యంగా లేదా? అంటే ఉంది. అటువంటప్పుడు వారికి లేని రాజ్యాంగపరమైన సమస్య కేవలం మావోయిస్టు పార్టీ వారికి ఎందుకు కలుగుతుంది? ఇది కదా మౌలిక ప్రశ్న.

రాజ్యాంగంలో సానుకూల అంశాలు ఉన్నాయనే అవగాహన మావోయిస్ట్ ఉద్యమానికి మొదటి నుండి ఉన్నట్లు, అందు కోసం పోరాటం చేస్తున్నట్లు పాణి చెప్పుకొస్తున్నారు. మరి అలాంటి వైఖరి ఉన్నవాళ్ల ఈ రాజ్యాంగాన్ని కూల్చేస్తామని ఎందుకంటారు? మరొక దగ్గర రాజ్యాంగంలోని సమానత్వ భావనకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి విధానాల వల్ల దోపిడీ, పీడనలు పెరుగుతున్నాయని పాణి అంటారు. అటువంటప్పుడు రాజ్యాంగం విప్లవకరమైనదని చెబుతున్నట్లే కదా! కానీ మావోయిస్టుల సమర్థన కోసం మరలా ఇలా దోపిడీ, పీడనలు పెరగటానికి రాజ్యాంగంలోనే అవకాశాలు ఉన్నాయని, అలాంటి సమస్యల వల్లనే విప్లవోద్యమం పుట్టుకొచ్చిందని చెప్పటం ఎలా సరైనది అవుతుంది? నిజంగా నక్సల్బరీ ఉద్యమం భూ సమస్య కేంద్రంగా మొదలైందన్నది అందరికీ తెలిసిందే. భూ సమస్య అనేది పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థ తాలూకు అవశేషం. నిజంగా పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థ అయిన భూస్వామ్యం రద్దు లక్ష్యంగా వ్యవసాయక విప్లవం ఇరుసుగా భావించే వారికి ఈ బూర్జువా రాజ్యాంగం అడ్డు కాదు.

> కమ్యూనిస్టు పార్టీలలోని వారి కార్యక్రమాన్ని చూసినా, కార్యాచరణ చూసినా విప్లవ లక్షణాలు ఏమీ కానరావు. వారి కంటే కూడా ఈ బూర్జువా రాజ్యాంగమే విప్లవకరంగా ఉంది. దీన్ని గుర్తించడంలో కమ్యూనిస్టులు మొదటి నుంచీ విఫలమే. అందువల్లనే ఈ రాజ్యాంగం కంటే కూడా 75 ఏళ్లు వెనుకబడిపోయారు.



మావోయిస్టు పార్టీయే కాదు అన్ని కమ్యూనిస్టు పార్టీలు రాజ్యాంగాన్ని బూర్జువా రాజ్యాంగంగానే గుర్తిస్తున్నాయి. బూర్జువా రాజ్యాంగం పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుంది అనే దానిలో ఎవరికీ సందేహం లేదు. అందుకనే కమ్యూనిస్టులు మొదట్లో ఈ రాజ్యాంగాన్ని కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజ్యాంగం పట్ల మొదటి నుంచీ కమ్యూనిస్టులకు వ్యతిరేకత ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీల వైఖరిలో ప్రస్తుత కాలంలో మార్పులు చూస్తున్నాం. అందువల్లనే వారు రాజ్యాంగ పరిరక్షణ అనే పిలుపులను ఇస్తున్నారు. కానీ మావోయిస్టులు ఇలాంటి పిలుపును ఇచ్చిన సందర్భం కానీ, దానికోసం వారి కార్యచరణను కానీ మనం చూడం. కానీ ఇలాంటి వైఖరి వారు కలిగి ఉన్నట్లు, పోరాటం చేస్తున్నట్లు పాణి చెప్పుకొస్తున్నారు.

మావోయిస్ట్‌లు తాము ఎంచుకున్న సాయుధ పోరాటాన్ని మైదాన ప్రాంతాలలో ఉండి చేసే వీలులేని కారణంగానే గిరిజన ప్రాంతాలను ఆశ్రయించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. పాణి దీనికి సమర్థనగా 'నూతన ప్రజాస్వామిక విప్లవమంటే భూములు పంచడమే కాదు. అర్ధ భూస్వామ్యానికి, కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే విస్తృత పోరాటం' అనే వ్యాఖ్యానాన్ని జోడిస్తున్నాడు. మరి అన్ని ఎమ్ఎల్ పార్టీలూ ఇదే లక్ష్యాన్ని కలిగి ఉన్నాయి కదా. మరి మావోయిస్టులకు ఎదురైన సమస్యలు వారికి ఎందుకు కలగటం లేదు. అంటే వారు ఏమీ పోరాటాలు చేయటం లేదనా? కేవలం మావోయిస్టులే చేస్తున్నారనా? నిజంగా కార్పొరేట్ హిందుత్వ ఫాసిజంకు వ్యతిరేకంగా మావోయిస్టులు పోరాటం చేస్తున్నట్టయితే వారు బలంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ఓడిపోవాలి కదా? అలా ఎందుకు జరగటం లేదు? వెనుకబాటు, ఆటవిక జీవనం కలిగిన గిరిజనులు చేస్తున్న పోరాటాన్ని వర్గ పోరాటంగా మార్క్స్ అసలు ఎక్కడైనా చెప్పాడా? అంటే గిరిజనులు ఎల్లాకాలం ఆటవిక జీవనంలోనే ఉండిపోవటాన్ని విప్లవంగా చెప్పాడా? అలా ఉండిపోవటమే సోషలిస్టు విప్లవ లక్షణం అవుతుందా? అలాగే అడవుల పరిరక్షణ, అక్కడున్న వనరుల సంరక్షణ కేవలం అమాయక గిరిజనుల బాధ్యత అవుతుందా? ఇందుకోసం సాయుధ పంథా ఎంచుకోవటం సరైనదేనా?

వాస్తవానికి 1850లోనే ఇంటర్నేషనల్ కమ్యూనిస్టు లీగ్ 21 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు ఉండాలని, మంచి అభ్యర్థులను ఎన్నికల్లో నిలపాలని డిమాండ్ చేసింది. ఏ మాత్రం గెలవని చోట కూడా కమ్యూనిస్టు లీగ్ తన అభ్యర్థులు నిలపాలని మార్క్స్ చెప్పాడు. కమ్యూనిస్టు ఉద్యమ మూలకర్తలు ఇలా చెబుతున్నప్పటికీ దానికి భిన్నంగా సాయుధ పంథా ఆధారంగా ముందుకు సాగిపోవాలని పాణి సూచిస్తున్నారు. రాచరిక కాలం నాటి సాయుధ పోరాట పంథా పోయి ఎన్నికల్లో పాల్గొనే విధానం అమల్లోకి వచ్చి 175 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకా అదే పాత పంథా కొనసాగాలని పిలుపు ఇవ్వడంలో విప్లవ లక్షణం ఉన్నదా?

పాణి తన వ్యాసంలో అనేక చోట్ల విప్లవం, విప్లవోద్యమం అనే పదాలు వాడారు. నిజంగా మావోయిస్టులు ఏ రకంగా విప్లవకారులో, వారి కార్యక్రమంలోనూ కార్యాచరణలోనూ ఉన్న విప్లవ లక్ష్యాలు ఏమిటో వివరించగలరా? భూములు పంచటం అనే ఒక మాట తప్పించి మిగతా ఏ విషయాలలో వారు విప్లవకారులు? నిజానికి అన్ని కమ్యూనిస్టు పార్టీలలో వారి కార్యక్రమాన్ని చూసినా, వారి కార్యాచరణ చూసినా విప్లవ లక్షణాలు ఏమీ కానరావు. వారి కంటే కూడా ఈ బూర్జువా రాజ్యాంగమే విప్లవకరంగా ఉంది. అందుకనేగా మార్క్సిస్ట్ మేధావి ప్రభాత్ పట్నాయక్ 1950 రాజ్యాంగం అమలుతో భారతదేశంలో దీర్ఘకాలిక విప్లవం ప్రారంభమైందని అంటున్నాడు. దీన్ని గుర్తించడంలో మొదటి నుంచీ కమ్యూనిస్టులు విఫలమే! అందువల్లనే ఈ రాజ్యాంగం కంటే కూడా 75 ఏళ్లు వెనుకబడిపోయారు. ఇలాంటి వాళ్లు విప్లవకారులు ఎలా అవుతారో మరి.

■ ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు

బడిగంట మోగింది

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం

తొలిరోజు 80 శాతం హాజరు





పటమటలోని స్కూల్‌కు ఉత్సాహంగా వెళ్తున్న విద్యార్థులు, ఒకరి వెంట ఒకరు క్యూ కట్టి నడుస్తున్న విద్యార్థినులు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మూగబోయిన బడి గంటలు మోగాయి. సరస్వతీ నిలయాలు తలుపులు తెరుచుకున్నాయి. జిల్లాలోని మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజు 80 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, షూ అందజేశారు. విద్యార్థులకు అందజేసే కిట్లను మండల విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాలలకు పంపుతున్నారు. ఈ కిట్లు పూర్తిస్థాయిలో చేరుకున్నాక పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాఠ్య, నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో చేరుకున్నందున విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. జిల్లాలో సుమారు 1,000 కిపైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇంకా కొన్ని పాఠశాలలకు యూనిఫాం, షూ చేరలేదు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయి. కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరాక మొత్తం సర్దుబాటు చేసి విద్యార్థులకు ఒక్కొక్కటిగా అందజేయాలని అధికారులు భావిస్తున్నారు.

• విజయోత్సవం



ఎన్డీయే కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం గురునానక్ కాలనీలోని టీడీపీ విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో 11 కేజీల కేక్ కట్ చేసి ఎన్డీయే నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 4

కడగండ్లు

మునేరు ఉగ్రరూపంతో మెయిన్ బ్రాంచ్ కెనాల్ తువ్వకాల్వకు గండ్లు

ఖరీఫ్ ప్రారంభం వేళ రైతులకు కన్నీటి కష్టాలు

గండ్లు పూడ్చకపోతే ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

ఒవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు కోటి ఆశలతో పంటల సాగుకు సమాయత్తమవుతున్న రైతులను కాల్వలు వెక్కిరిస్తున్నాయి. దీనికి కారణం సాగునీటి కాల్వలు మరమ్మతులకు నోచుకోకపోవడమే.. గతేడాది కురిసిన భారీ వర్షాలు, వరదలకు ముఖ్యంగా మునేటి మెయిన్ బ్రాంచ్ కెనాల్ తువ్వకాల్వకు పడిన గండ్లను ఇప్పటికీ పూడ్చలేదు. పర్యవసానం ఈ కాల్వ పరిధిలో వందలాది ఎకరాల భూములకు సజావుగా సాగునీరు అందే పరిస్థితి లేదు. దీంతో సీజన్‌లో సాగు ప్రశ్నార్థకంగా మారి ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తువ్వకాల్వకు పడిన పెద్ద గండి (మైసమ్మ గండి)



(కంచికచర్ల-ఆంధ్రజ్యోతి) : మునేటి మెయిన్ బ్రాంచ్ కెనాల్ తువ్వకాల్వ పరిధిలో సారవంతమైన మాగాణి భూములున్నాయి. వరి పంట పుష్కలంగా పండుతుంది. వ్యవసాయ పంపుసెట్లు కూడా ఉండటంతో రైతులు రెండు పంటలు పండిస్తున్నారు. వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు నుంచి ప్రారంభమయ్యే తువ్వకాల్వ ద్వారా వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేమవరం, పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల పరిధిలో దాదాపు 1,500కు పైగా ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అయితే, గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మునేరు ఉగ్రరూపం దాల్చింది. ఎన్నడూ లేనంతగా 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావటంతో తువ్వకాల్వ ఛిన్నాభిన్నమైంది. కాల్వకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. ముఖ్యంగా ఆళ్లూరుపాడు సమీపంలో భారీ గండి (మైసమ్మ గండి) పడింది. దీనికి సమీపంలో మరో భారీగండి పడి వరి పైరంతా తుడిచిపెట్టుకుపోయింది. వరద ఉధృతికి పంట భూముల్లో పెద్ద గొయ్యిలు పడ్డాయి. అడుగు నుంచి మూడడుగుల మందం వరకు ఇసుక మేట వేసింది. వరద వల్ల ఆయా గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఇలా అయితే సాగు ఎలా

తువ్వకాల్వ పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాగాణి వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. కాల్వను బాగుచేయనందున పంట సాగుచేసి కష్టాలు కోరి తెచ్చుకునే కంటే సాగు చేయకపోవటమే ఉత్తమమన్న అభిప్రాయంలో రైతులున్నారు. ఒకరిద్దరు కౌలు రైతులు మిగతా 4లో..

మరమ్మతులకు నోచని కాల్వలు

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ తువ్వకాల్వకు ఇంకా మరమ్మతులు చేయలేదు. కాల్వకు పడిన భారీ గండ్లను సైతం పూడ్చలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఈ కాల్వ పరిస్థితి తయారైంది. యుద్ధప్రాతిపదికపై బాగు చేయాల్సిన కాల్వ గురించి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో కాల్వకు సాగునీరు విడుదల చేసే పరిస్థితి లేక ఆయకట్టులో ఎంతో విలువైన మాగాణి భూములు బీడుగా మారాయి. మునేటి వరద దెబ్బకు భూములు కకావికలమైన సంగతి విదితమే. పలువురు రైతులు ఖర్చుకు వెనుకాడకుండా ఇసుక మేటలు తొలగించి, గోతులు పూడ్చారు. కొందరు రైతులు ఇసుక మేటలు తొలగించలేదు. గోతులు పూడ్చలేదు. మునేటికి ఒక మాదిరి వరద వచ్చినా ప్రమాదం పొంచి ఉందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఎంత పనిచేశావ్ నాన్నా..!

మైలవరంలో ఇద్దరు చిన్నారులను కడతేర్చిన తండ్రి

అప్పులు చేసిన తండ్రి ఆ బాధను పిల్లలపై చూపించాడు. హాస్టల్ నుంచి తల్లిదండ్రుల ఆప్యాయత కోసం వచ్చిన వారి ఆయుష్షు అంతలోనే తీసేశాడు. నిద్రలో ఉన్నవారిని శాశ్వతంగా నిద్రపోయేలా చేశాడు. ఆ తర్వాత ఆచూకీ లేకుండాపోయాడు. రెండు రోజుల్లో ఫాదర్స్ డే ఉండగా, మైలవరంలో అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులను కన్నతండ్రే కడతేర్చడం వెనుక కథ ప్రతి ఒక్కరి కంట నీరు తెప్పిస్తోంది.

- అప్పుల బాధలు తాళలేక గడ్డి మందు పెట్టి హత్య
- తాను కూడా చనిపోతున్నానని సూసైడ్ నోట్
- ఆనక కనిపించకుండా పోయిన తండ్రి
- ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు

విజయవాడ/మైలవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రవిశంకర్.. మైలవరంలోని తిరువూరు రోడ్డులో ఉంటూ ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన భార్య చంద్రిక ఉపాధి నిమిత్తం ఇటీవల బెహ్రాన్ వెళ్లింది. వీరికి లీలాసాయి (7), లక్ష్మీ హిరణ్య (9) పిల్లలు. జి.కొండూరులోని మిషనరీ హాస్టల్‌లో ఉంటూ ఐదు, మూడు తరగతులు చదువుతున్నారు. ఈ కుటుంబం తిరువూరు రోడ్డులో అద్దెకు ఉంటోంది. రెండు నెలల క్రితం చంద్రిక పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడి నుంచి ఉపాధి కోసం బెహ్రాన్ వెళ్లింది. అప్పటి నుంచి రవిశంకర్ పిల్లలతో కలిసి ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో పిల్లలిద్దరూ మిగతా 4లో..



పిల్లలు లీలాసాయి, లక్ష్మీ హిరణ్యతో రవిశంకర్, చంద్రిక (ఫైల్)

‘సిఫార్సు’ భక్తులు టికెట్ కొనాల్సిందే..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- దుర్గగుడి ఈవో శీనానాయక్

విజయవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి ప్రొటోకాల్ జాబితాలో ఉన్నవారి సిఫార్సు లేఖలతో వచ్చిన భక్తులు కచ్చితంగా టికెట్ కొనాలని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో శీనానాయక్ స్పష్టం చేశారు. ‘ఆంధ్రజ్యోతి’లో గురువారం ప్రచురితమైన ‘ఇదేం పద్ధతి’ కథనంపై ఆయన స్పందించారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారికి మాత్రమే నిబంధనల ప్రకారం దర్శన ఏర్పాట్లు చేస్తామని, వారి సిఫార్సు లేఖలతో వచ్చేవారు మాత్రం తప్పనిసరిగా టికెట్లు కొనాలని స్పష్టం చేశారు. ఆ డబ్బు అమ్మవారి మూలధనానికి చేరుతుందని, ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మరొకరు అరెస్టు

- ఎండీఎంఏ కేసులో పామర్రుకు చెందిన వ్యక్తి అరెస్టు
- పరారీలో కీలక నిందితులు

విజయవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ నుంచి కొరియర్ సర్వీసు ద్వారా ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చిన కేసులో మరో నిందితుడికి ఇటీవల పోలీసులు సంకెళ్లు వేశారు. పామర్రు మండలానికి చెందిన మనోహర్ అనే నిందితుడ్ని టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పెనమలూరు మండలం సనత్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్, ఫన్‌టైమ్స్ క్లబ్ వీధికి చెందిన బొంతు నితీష్ కుమార్, యనమలకుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు మిగతా 4లో..

రాజధాని పనుల కోసం క్వారీల కేటాయింపు

ఆరు సంస్థలకు గన్నవరంలో లీజుకిస్తూ ఉత్తర్వులు

428 ఎకరాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలకు అనుమతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతిలో వివిధ ప్రాజెక్టులను దక్కించుకున్న పలు నిర్మాణ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం గన్నవరం నియోజకవర్గంలోని 428 ఎకరాల గ్రావెల్, మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ ప్రతిపాదనల మేరకు నిర్మాణ సంస్థలకు గ్రావెల్ క్వారీలను నామినేషన్ విధానంలో అప్పగించేందుకు అంగీకరించింది. గన్నవరం నియోజకవర్గంలో గ్రావెల్, ఎర్రమట్టి సహజ వనరులు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో భాగంగానే బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్‌సీసీ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ లిమిటెడ్, బీఎస్‌సీపీఎల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వంటి మొత్తం ఆరు సంస్థలకు భారీగా క్వారీ లీజులను నామినేషన్ విధానంలో కేటాయించారు. బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్‌కు అత్యధికంగా గన్నవరం మండలంలో నాలుగు క్వారీ లీజుకివ్వగా, పరిమాణం పరంగా మేఘా ఇంజనీరింగ్‌కు అత్యధికంగా క్వారీలు ఇచ్చారు. అత్యధికంగా మేఘాకు 120 ఎకరాలు, రెండో అత్యధికంగా బీఎస్ఆర్‌కు 115 ఎకరాలు అనుమతించారు. ఇవన్నీ పురుషోత్తపట్నం, కొండపావులూరు, వెదురుపావులూరు, గొల్లనపల్లి, గోపవరపుగూడెం గ్రామాల్లో ఉన్నాయి. కాగా, కేటాయింపులు జరిపిన సంస్థలు నిబంధనలకు అనుగుణంగా తవ్వకాలు జరిపేలా గనుల శాఖ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎండీయూ వాహనాలు ఫర్ సేల్

- ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వాహనాలు ఓఎల్ఎక్స్‌లో ప్రత్యక్షం
- రూ.3-4 లక్షలకు పోస్టులు పెడుతున్న ఎండీయూ ఆపరేటర్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు మొబైల్ డిస్పర్స్‌మెంట్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లు ఆ వాహనాలను అమ్మకానికి పెట్టారు. సెకండ్‌హ్యాండ్ వస్తువుల సేల్స్ నిర్వహించే ఓఎల్ఎక్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో సెకండ్ సేల్స్ కింద వీటిని విక్రయిస్తున్నారు. ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్, మొబైల్ యాప్స్‌లో ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉచిత యాడ్స్ పోస్ట్ చేసే అవకాశాన్ని ఉపయోగించుకుని మరీ అమ్మకానికి పెడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఇద్దరు మిగతా 4లో..

అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారు

- పేర్ని నాని, ఆయన కుమారుడిపై కేసు నమోదు కాలేదుగా!
- నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వివరాలు ఇవ్వండి
- రెవెన్యూ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

4

దుర్గగుడిలో పలువురు ఏఈవోలు, అధికారులకు విధుల కేటాయింపు

ఈవో ఆకస్మిక తనిఖీలు

పది సప్లిమెంటరీలో 5,108 మంది ఉత్తీర్ణత

విజయవాడ/మచిలీపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5,108 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో 2,682 మంది అబ్బాయిలు, 1,778 మంది అమ్మాయిలు మొత్తం 4,460 మంది పరీక్షలకు హాజరుకాగా, 1,791 మంది అబ్బాయిలు, 1,325 మంది అమ్మాయిలు మొత్తం మిగతా 4లో..



బీఆర్టీఎస్ రోడ్డులోని యోగాస్ట్రీట్‌లో గురువారం ఆయుష్ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాలు వేయగా, పలువురు యువకులు వేసిన ఆసనాలు ఆశ్చర్యం కలిగించాయి. 4



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం గురునానక్‌కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేసి కూటమి నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, ప్రజలు ఆశించినట్టుగా ఇది ప్రజా ప్రభుత్వమని నిరూపించుకుందన్నారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా తల్లికి వందనం పథకం అమల్లోకి వచ్చిందన్నారు. రైతు భరోసా ఈనెల నుంచే అందించబోతున్నట్టు, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కానున్నట్టు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్క్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జి.రఘురామరాజు, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్, సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చేకూరి రాజేశ్వరరావు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి తినిపించుకుంటున్న నెట్టెం, తాతయ్యలు

హామీల అమలులో కూటమిదే అగ్రస్థానం

» నెట్టెం, తాతయ్య ప్రశంసలు

జగ్గయ్యపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం ఆర్థిక అరాచకంలో పీకల్లోతు మునిగిపోయినా ఎన్నికల హామీల అమలు.. ప్రజల ఆకాంక్షలు నేరవేర్చటంలో కూటమి ప్రభుత్వం ముందుందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు అన్నారు. గురువారం పట్టణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీలో వారు పాల్గొన్నారు. మునిసిపల్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నెట్టెం మాట్లాడుతూ, తల్లికి వందనంతో రాష్ట్రంలో 67,27,164 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. గతంలో జగన్ ఒక్క విద్యార్థికే పథకం అమలుచేస్తే తమ ప్రభుత్వం ఇంట్లో చదువుకునే పిల్లలందరికి వర్తింపజేస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ, పెన్షన్లు, జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి నుంచి ఒకరోజు ముందే వేతనాలు పింఛన్లు ఇచ్చే స్థితికి కూటమి ప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నెట్టెం శివరాం, శ్రీరాం చినబాబు, కన్నెబోయిన రామలక్ష్మి, నూకల కుమార్‌రాజా, ధూళిపాళ లక్ష్మణరావు, మేకా వెంకటేశ్వర్లు, గొట్టే నాగరాజు, పి.ఉపేంద్ర, గద్దె రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.




శ్రీరాంపురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత

సంక్షేమ పథకాల ఆద్యుడు ఎన్టీఆర్

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

రెడ్డిగూడెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. శ్రీరాంపురం గ్రామంలో టీడీపీ సీనియర్ నేత, పాల కేంద్రం అధ్యక్షుడు నాదెండ్ల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. తెలుగుజాతి ఉన్నంతకాలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్ ఉండిపోతారన్నారు. కార్యక్రమంలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, నాదెండ్ల చెన్నకేశవరావు (కేసుబాబు) జంపాల సీతారామయ్య, నర్రా వాసు, కొల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసరావు, నాదెండ్ల హేమంత్ చౌదరి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

విజన్-2047 ముఖ్యమంత్రి కల

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్-2047 ముఖ్యమంత్రి చంద్రబాబు కల అని, శక్తివంతమైన, సమగ్రమైన, అభివృద్ధితో ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు రూపొందించిన విజన్-2047 ప్రణాళిక అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం నిడమానూరు టీడీపీ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనకు ఏడాది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, గురజాల జగన్మోహన్‌లు హాజరయ్యారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఉత్తమ మౌలిక వసతులు కల్పించడం, నిజమైన మార్పును తీసుకురావడంపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఫణి కుమార్, గొడ్డల చిన్న రామారావు, కోనేరు సందీప్, పరుచూరి నరేష్, సర్నాల బాలాజీ, గూడవల్లి నరసింహారావు, కొల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కవచం యోగా!

» ప్రపంచ అవార్డు 'టీం ఎన్జీఆర్' కృషి ఫలితమే

» 14న కొండపల్లి ఖిల్లాపై యోగాంధ్ర కార్యక్రమం

» జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ లక్ష్మీశ పిలుపు



వైద్యులతో కలిసి యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సత్యనారాయణపురం/కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే యోగాను జీవితంలో భాగం చేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఆనందమయమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చునని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయూష్‌శాఖ, జిల్లా అధికారయంత్రాంగం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, వైద్య విద్యార్థులు, డాక్టర్లతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనిషి అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు యోగాసనాలు రక్షణ కవచాలన్నారు. కార్యక్రమంలో, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆయుష్ అధికారి రామ్‌తేహి, ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ఫాగ్సీ ప్రతినిధి డాక్టర్ త్రిపుర, రమేష్ హాస్పటల్స్ వైద్యులు డాక్టర్ పి.రమేష్, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా తీరంలో వాటర్ క్రాఫ్ట్-ఫ్లోటింగ్ యోగా విజయవంతమై ప్రపంచ రికార్డు సాధించడం వెనుక 'టీమ్ ఎన్టీఆర్' ఉద్యోగుల కృషి వుందని, కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డు సాధించిన సందర్భంగా ఏపీ ఎన్జీవో జిల్లా, నగర శాఖ కార్యవర్గసభ్యులు గురువారం కలెక్టర్ లక్ష్మీశను క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కృష్ణాతీరంలో వాటర్ క్రాఫ్ట్-ఫ్లోటింగ్ యోగాను నిర్వహించాలన్న ఆలోచనను ఆచరణలో పెట్టి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో చేపట్టనున్న ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసి జిల్లా కీర్తిప్రతిష్టలు సాధించడంలో అడుగులు కలపాలన్నారు. ఈనెల 14న కొండపల్లి ఖిల్లాలో ప్రత్యేకంగా ఉద్యోగులతో మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, యోగాంధ్ర విజయవంతంలో అహర్నిశలు కృషిచేయడంతో పాటు ప్రతిరోజు ఉదయాన్నే గంట సమయాన్ని కేటాయిస్తూ ప్రజలతో కలిసి మమేకమై యోగాసనాలను ఆచరిస్తున్న కలెక్టర్ తీరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఉద్యోగులందరి పక్షాన కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్‌ను అభినందించిన వారిలో ఎన్జీవో నాయకులు వేమూరి ప్రసాద్, రమేష్, బీవీ రమణ, ఎం.రాజుబాబు, రామకృష్ణ, శివలీల, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్, బి.రాజశేఖర్, ఎం.మధుసూధనరావు, ఖాసిం సాహెబ్, సాగర్ తదితరులున్నారు.

యోగ గీతం టీజర్ విడుదల

విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్‌ను యోగాంధ్రగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు పేర్కొన్నారు. ఓల్గా ఆర్చరీ అకాడమీ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ



ఆధ్వర్యంలో యోగాపై రూపొందించిన ప్రత్యేక గీతానికి సంబంధించిన టీజర్‌ను గురువారం శాప్ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ, యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయి రికార్డును నమోదు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ నెల 21న విశాఖలో 5 లక్షల మందితో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని మోదీ వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రపంచంలోనే తొలిసారిగా యోగాపై ప్రత్యేక గీతాన్ని రూపొందించడం జరిగిందని, తాను స్క్రిప్టు సిద్ధం చేయగా సుద్దాల అశోక్ తేజ పాట రచించారని, సింగర్ శ్రీకృష్ణ పాడారని తెలిపారు. పూర్తి పాటను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్, శాప్ ఏవో వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో పలువురు ఏఈఓలు, అధికారులకు విధుల కేటాయింపు

ఇంద్రకీలాద్రి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన, ఇక్కడ పనిచేస్తున్న ఏఈఓలు, ఇతర అధికారులకు గురువారం విధులు కేటాయిస్తూ ఈవో వీకే శీనానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్, ఈవో సీహెచ్ రంగారావుకు సీవీ రెడ్డి ఛారిటీస్, భూములు, లీజులు, న్యాయ సంబంధిత వ్యవహారాలు, ఆర్టీఏ యాక్ట్ కేటాయించారు. ఏఈవో బీవీ రెడ్డికి అన్నదానం, వేదపాఠశాల, వసతి గృహాలు అప్పగించారు. ఎన్.రమేష్ బాబుకు ప్రధాన ఆలయం, ప్రోటోకాల్, సరుకుల గోడౌన్, పండుగలు, పూజలు, ట్రస్ట్‌బోర్డు, ఉపాలయాలు, ఎం.వి.ఫామ్స్, స్టేషనరీ కేటాయించారు. పి.చంద్రశేఖర్‌కు రెలిజియస్, సెక్యులర్ పరిపాలన, లీగల్ సర్వీస్ అంశాలు, కౌంటర్ల సూపర్‌విజన్, డిస్పాచ్, ఆల్ సెక్యూరిటీ, శానిటేషన్ అప్పగించారు. మెడికల్ లీవులో ఉన్న సుధారాణికి ఆడిట్, చీరల విభాగం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సాధారణ అంశాలు, ఇతరత్రా కేటాయించారు. ఏఈఓ ఎం.ఎస్.ఎల్.శ్రీనివాస్‌కు అకౌంట్స్, ఐటీ, జీఎస్టీ రిటర్న్స్, ప్రసాదాల తయారీ విభాగాలు కేటాయించారు. ఏఈఓ ఎం.తిరుమలేశ్వరరావుకు కేశఖండన శాల, దత్తత ఆలయాలు, దుర్గాఘాట్ ఓవరాల్ పర్యవేక్షణ, కనకదుర్గానగర్‌లోని అన్ని అంశాలు, దుర్గాఘాట్‌లో హారతులు వంటివి కేటాయించారు. ఏఈఓ కేడర్‌లో ఉన్న కె.గంగాధర్‌కు కనకదుర్గ ప్రభ ఎడిటర్‌గా, పిఆర్‌ఓ, ధర్మపథం, ప్రభుత్వ పథకాల సమన్వయం, ఫీడ్ బ్యాక్ కౌంటర్ల పర్యవేక్షణ, భక్తుల నుంచి అభిప్రాయాలు తీసుకుని మంచి ఫలితాల కోసం పర్యవేక్షణకు అప్పగించారు. అలాగే సూపరింటెండెంట్‌లకు విధులను కేటాయించారు.

ఈవో ఆకస్మిక తనిఖీలు

ఇంద్రకీలాద్రి: దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ పలు విభాగాలలో తనిఖీలు చేశారు. లోపాలను గుర్తించి, భక్తుల ఇబ్బందులను గమనించి, ఆయా విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం ఈవో ఆకస్మికంగా అర్జునవీధిలో ఉన్న శృంగేరి మఠంలోని అన్నదాన విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల శుభ్రతను పరిశీలించారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండటంతో సూపరింటెండెంట్, గుమాస్తాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.



అన్నదాన విభాగంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఈవో

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

» జేసీ ఇలక్కియ

కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులను సంరక్షించడం, హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా గురువారం కార్మిక శాఖ, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, సంయుక్త ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రాఫిట్ షూ కంపెనీ సంయుక్త సహకారంతో సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేసీ మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలందరూ బడిలో వుండాలని బాల కార్మికులు లేని సమాజాన్ని అందరు కలిసి నిర్మించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియా

సంస్థలో బాల కార్మికులు లేరు అనే స్టిక్కర్లను జేసీ ఆవిష్కరించారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సీహెచ్ ఆశారాణి మాట్లాడుతూ, బడి బయట వున్న బాలలను గుర్తించడం, రక్షించడంలో సమాజం కీలక పాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో-ఆర్డినేటర్ అరవ రమేష్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జి.ధనలక్ష్మి, అధికారులు టి.రాజేష్, డి.రత్నకుమారి, పి.రామ్‌కుమార్, జి.విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ట్యాక్స్ జీవోపై మంత్రి హామీ

బెంజ్‌సర్కిల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రావాణాశాఖ మంత్రి ఎ.రాంప్రసాద్‌రెడ్డిని లారీ ఓనర్ల సంఘాల ప్రతినిధులు గురువారం విజయవాడలో మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌టాక్స్ తగ్గించడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రీన్‌టాక్స్ జీవోను వెంటనే విడుదల చేయాల్సిందిగా ఆయన్ని అభ్యర్థించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వారంలోనే హరితపన్ను తగ్గింపుపై ఉత్తర్వులు విడుదల చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజ, కార్యదర్శి సీహెచ్ వినయ్, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్, సభ్యులు సూరపనేని సురేష్ పాల్గొన్నారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎంపీ దిగ్భ్రాంతి

వన్‌టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇది దురదృష్టకరమని, హృదయ విదాకర ఘటనగా ఎంపీ అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు ఎంపీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో సామాన్య ప్రజలు కూడా ప్రాణాలు కోల్పోవటం బాధాకరమన్నారు.

బాధ్యతల స్వీకారం



శారదారాణి

గొల్లపూడి : విజయవాడ రూరల్ గొల్లపూడిలోని విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ సెక్రటరీగా మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎ.శారదారాణి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల ఆమె డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. 2007 నుంచి 2013 వరకు ఉమ్మడి కృష్ణాజిల్లా మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి అనంతరం డీడీగా పదోన్నతి పొందారు. దుగ్గిరాలలో పనిచేస్తున్న ఆమెను మరల ఉమ్మడి కృష్ణాజిల్లాకు బదిలీ చేశారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తల్లిదండ్రుల ఆందోళనల మధ్య
పాఠశాలల పునఃప్రారంభం

జగ్గయ్యపేట రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలలు గురువారం ఆందోళనలతో పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలను పండుగ వాతావరణంలో ప్రారంభించాలనే ప్రభుత్వ ఆదేశాలు ఉండగా.. వేదాద్రి, రావిరాల, అన్నవరం, తక్కెళ్లపాడు, ధర్మవరప్పాడుతండ, కె.అగ్రహారం గ్రామాలలోని పాఠశాలల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను తీసేసి అనుసంధానంగా ఐదు కి.మీల పరిధిలోని జడ్పీ పాఠశాలలో విలీనం చేయడంతో సుదూర ప్రాంతాలకు ఆడపిల్లలు ఎలా వెళ్తారని పిల్లల కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పాఠశాలల్లోనే తరగతులు నిర్వహించాలని నినాదాలు చేస్తూ మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈవో చిట్టిబాబు మాట్లాడుతూ, మండలంలోని 61 పాఠశాలలు ప్రారంభమయ్యాయని 326 మంది విద్యార్థులు, నూరుశాతం ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు. గ్రామాలకు అనుసంధానంగా దగ్గరలో చేర్పించి ప్రభుత్వ పథకాలను అందుకోవాలని, అన్ని సబ్జెక్టులకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించినట్టు తెలిపారు.

ఎంత పనిచేశావ్ నాన్నా..!

(3వ పేజీ తరువాయి)

హాస్టల్ నుంచి తండ్రి వద్దకు వచ్చారు. రవిశంకర్ కొద్దిరోజుల కిందటి వరకు తన తల్లిదండ్రులు అనిత, లక్ష్మీపతి కలిసి ఉండేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లిదండ్రులు దేవుని చెరువు వద్దకు అద్దెకు వెళ్లిపోయారు. లక్ష్మీపతి రోజూ తన కుమారుడి ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈనెల 8వ తేదీన లక్ష్మీపతి యథావిధిగా కుమారుడు ఇంటికి వచ్చాడు. తాళాలు వేసి ఉండటంతో తిరిగి వెళ్లిపోయాడు. ఇలా వచ్చిన ప్రతిసారీ ఇంటికి తాళాలు వేసి ఉంటున్నాయి. గురువారం మళ్లీ కుమారుడి ఇంటికి వచ్చాడు. రవిశంకర్ ఉపయోగించే సైకిల్ ఆరుబయట ఉండటంతో ఎండ, వానకు పాడైపోతుందని వరండాల్లో పెట్టాడు. వరండాలోకి వెళ్లగానే, దుర్వాసన వచ్చింది. ఏదో జంతువు చనిపోయి ఉంటుందని భావించిన లక్ష్మీపతి కిటికీకి అడ్డుగా కట్టిన కర్టెన్ తీసి చూడగా లక్ష్మీహిరణ్య, లీలాసాయి మంచంపై విగతజీవులుగా పడి ఉన్నారు. లక్ష్మీపతి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా, వరండాలో స్టూల్‌పై గడ్డి మందు సీసా కనిపించింది. దీన్నిబట్టి రవిశంకర్ పిల్లలిద్దరికీ డ్రింక్‌లో గానీ, భోజనంలో గానీ గడ్డి మందు కలిపి ఇచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్టు భావిస్తున్నారు. రవిశంకర్ ఫోన్ స్విచ్చాఫ్ అని వస్తోంది.

అప్పులే కారణమా?

రవిశంకర్‌కు అప్పులు ఉన్నాయని తండ్రి లక్ష్మీపతి చెబుతున్నాడు. అతను పని చేసే హోటల్ వద్ద విచారణ చేయగా, వారం రోజులుగా రావట్లేదని చెప్పారు. క్లూస్ టీం ఇంట్లో పరిశీలించగా, ఆత్మహత్య చేసుకుంటున్నట్టు రవిశంకర్ రాసిన లేఖ లభించింది. 'నాతోపాటు అందరినీ తీసుకెళ్తాను. నాకు చాలా అప్పులు ఉన్నాయి' అని అందులో రాశాడు. దీన్నిబట్టి ముందుగా పిల్లలిద్దరినీ చంపేసి, ఆ తర్వాత అతడూ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. రవిశంకర్ తల్లిదండ్రులతో మాట్లాడినప్పుడు, ఇతరులతో మాట్లాడినప్పుడు పదేపదే అప్పుల గురించి ప్రస్తావించేవాడు. ఆ అప్పులు ఎందుకు చేశాడో, అప్పు చేసిన డబ్బు ఎక్కడ ఉపయోగించాడో చెప్పేవాడు కాదు. అసలు అప్పులెంత ఉన్నాయో ఏనాడూ చెప్పలేదని తండ్రి లక్ష్మీపతి చెబుతున్నాడు. ఉపాధి కోసం భార్య చంద్రికను బెహ్రేన్ పంపడానికి ఈ అప్పులు చేశాడా.. అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అసలు రవిశంకర్‌కు ఎవరెవరు అప్పులు ఇచ్చారన్న దానిపై కూపీ లాగుతున్నారు. అలాగే, రవిశంకర్ తల్లి అనితకు, భార్య చంద్రికకు మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. అత్తాకోడళ్లకు ఏ విషయంలోనూ పడేది కాదని లక్ష్మీపతి మాటల ద్వారా తెలుస్తోంది. అలాగే, భార్య అనిత పోరు భరించలేక కొద్దిరోజుల క్రితం లక్ష్మీపతి ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదైనట్టు స్థానికులు చెబుతున్నారు.

నానమ్మ, తాతయ్య ఉండి ఉంటే..

ఏడాదిలో సగానికిపైగా జి.కొండూరులోని మిషనరీ హాస్టల్‌లో ఉండే లీలాసాయి, లక్ష్మీ హిరణ్యను తాతయ్య లక్ష్మీపతి, నానమ్మ అనిత గారాబంగా చూసేవారు. వారు ఉండి ఉంటే.. ఆ చిన్నారులిద్దరూ ప్రాణాలతో ఉండేవారని చుట్టుపక్కల వారు చెప్పారు. కిటికీలో నుంచి లక్ష్మీపతి చూడగా, పిల్లలిద్దరూ మంచంపై పురుగులు పట్టి కనిపించడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. విగతజీవులుగా ఉన్న మనవడు, మనవరాలిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఇప్పటి వరకు రవిశంకర్ ఆచూకీ లభించలేదు. దీనిపై మైలవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడగండ్లు

(3వ పేజీ తరువాయి)

సిద్ధపడుతున్నప్పటికీ కౌలుకు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. ఆయకట్టులో వ్యవసాయ పంపుసెట్లు ఉండటంతో రెండో (రబీ) పంటకు రైతులు మొగ్గుచూపుతున్నారు. అయితే గండ్లను పూడ్చి, తువ్వకాల్వను తక్షణమే బాగుచేయాల్సిందిగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో మునేటికి భారీ వరదొచ్చినప్పటికీ ఆయకట్టుకు నష్టం జరగకుండా ఉండేందుకు కాల్వ ఎత్తు పెంచి, రివిట్‌మెంట్ చేసి పటిష్ఠం చేయాల్సిందిగా ముచ్చింతాలకు చెందిన రైతు నాయకుడు కొమ్మినేని సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రతిపాదనలు పంపాం.. : జేఈ ప్రసన్నలక్ష్మి

ఈ విషయమై మునేటి సబ్‌డివిజన్ జేఈ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ పెనుగంచిప్రోలు బ్రాంచి (తువ్వకాల్వ) కాల్వకు పడిన గండ్లు పూడ్చటానికి రూ.1.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. కాల్వను పటిష్ఠపరిచి, రివిట్‌మెంట్ చేసేందుకు రూ.కోట్లలో ఖర్చవుతుందన్నారు. మున్ముందు మునేటి వరదకు నష్టం జరగకుండా ఉండేందుకు రైతుల కోరిక మేరకు కాల్వను పటిష్ఠం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు చెప్పారు.

మరొకరు అరెస్టు

(3వ పేజీ తరువాయి)

చేశారు. వారి నుంచి 33 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. తనతో పాటు ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్న నూజివీడుకు చెందిన మనోహర్ అనే యువకుడు ఈ డ్రగ్‌ను అలవాటు చేసినట్టు జీవన్‌కుమార్ పోలీసులకు చెప్పాడు. పామర్రు మండలం జమీగొల్వేపల్లికి చెందిన మనోహర్‌కు నూజివీడుకు చెందిన యువతితో కొన్నాళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరూ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మనోహర్ బీటెక్‌తో పాటు ఎంబీఏ పూర్తిచేశాడు. ఇతను పలు సోలార్ ప్రాజెక్టులను తయారు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లో స్నేహితుడితో కలిసి ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. కారులో హైదరాబాద్ నుంచి పామర్రుకు వస్తుండగా మనోహర్‌ను పట్టుకున్నారు. తనకు ఎండీఎంఏ డ్రగ్‌తో ఎలాంటి సంబంధం లేదని మనోహర్ పోలీసు విచారణలో చెప్పినట్టు సమాచారం. ఈ డ్రగ్‌ను జీవన్‌కుమార్ రుచి చూపించాడని వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం మనోహర్ విచారణ కొనసాగుతోంది. కాగా, జీవన్‌కుమార్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా డబ్బు తీసుకున్న బందోపాధ్యాయ చౌదరి, ఎండీఎంఏ సరుకును పంపిన రింకూ పరారీలో ఉన్నారు. జీవన్‌కుమార్ గ్యాంగ్ చిక్కగానే వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

ఎండీయూ వాహనాలు..

(3వ పేజీ తరువాయి)

ఎండీయూ ఆపరేటర్లు ఇప్పటికే ఓఎల్‌ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రూ.3 లక్షల సేల్‌తో పోస్ట్ చేయడం గమనార్హం.

ప్రభుత్వ ఆదేశాలు లేకుండా..

కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా డోర్ డెలివరీని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఆ వాహనాలను ఎండీయూ ఆపరేటర్లకే ఇచ్చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. గతంలో వారు తీసుకున్న రుణాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించాలన్న ఆలోచన కూడా చేస్తోంది. కానీ, ప్రభుత్వం సర్క్యులర్ ఇవ్వకుండా ఇలా వాహనాలను విక్రయించవచ్చా లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వం రుణాన్ని చెల్లిస్తానంటోంది కాబట్టి.. ఆ వాహనాలన్నీ ఎండీయూ ఆపరేటర్ల సొంతమవుతాయి. కాబట్టి ఆ వాహనాలను వారే మైనా చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ, ప్రభుత్వ ఆదేశాలు లేకుండా వాటి విక్రయాలు జరిగితే కొనుగోలు చేసిన వారికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారు

» పేర్ని నాని, ఆయన కుమారుడిపై కేసు నమోదు కాలేదుగా!

» నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వివరాలు ఇవ్వండి

» రెవెన్యూ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామంటూ.. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తమపై కేసులు పెట్టబోతున్నారంటూ వైసీపీ నేత పేర్ని వెంకటరామయ్య (నాని), కుమారుడు సాయి కృష్ణమూర్తి వేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లపై ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని గుర్తు చేసింది. అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారని వ్యాఖ్యానించింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కోర్టును ఎలా ఆశ్రయిస్తారని ప్రశ్నించింది. నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలన్న పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. విచారణను జూన్ 16కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. 2024 ఎన్నికల సందర్భంగా మచిలీపట్నంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారంటూ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తమపై కేసులు పెట్టబోతున్నారంటూ పేర్ని నాని, ఆయన కుమారుడు కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సరైన విచారణ లేకుండా, తమ వాదన చెప్పుకొనే అవకాశం ఇవ్వకుండా.. తమపై ఎలాంటి బలవంతపుచర్యలు తీసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులను నిలువరించాలని వ్యాజ్యంలో కోరారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీపై విచారణ కొనసాగుతోందన్నారు. కేవలం ఆందోళనతో పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి దీనికి సంబంధించిన వివరాలు సమర్పించాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

పది సప్లిమెంటరీలో..

(3వ పేజీ తరువాయి)

3,116 మంది ఉత్తీర్ణులయ్యారు. 69.87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కృష్ణా జిల్లాలో 1,984 మంది అబ్బాయిలు, 1,294 మంది అమ్మాయిలు మొత్తం 3,278 మంది పరీక్షలు రాయగా, 1,137 మంది అబ్బాయిలు, 855 మంది అమ్మాయిలు మొత్తం 1,992 మంది ఉత్తీర్ణులయ్యారు. శాతం 60.77గా నమోదైంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116,125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

అహ్మదాబాద్ విమాన ప్రమాదం దురదృష్టకరం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను

భారతీనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లోని సర్ధార్ వల్ల భాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోవడం దురదృష్టకరమని, తాను ఎంతో దిగ్భ్రాంతికి గురయ్యాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.




నిర్మల శిశుభవన్‌లో పండ్లు, బిస్కెట్లు అందిస్తున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె , చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గద్దె క్రాంతి తదితరులు

ప్రజల ఆశలు నెరవేర్చేలా పాలన

కూటమి ఏడాది పాలన సందర్భంగా 20వ డివిజన్‌లో జరిగిన విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సాగిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఉదయం తూర్పు పరిధి 20వ డివిజన్ పొట్టి శ్రీరాములు హైస్కూల్ సమీపంలోని నిర్మల శిశుభవన్ వద్ద ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకుడు గణేష్‌లు కేక్ కట్ చేశారు. ఈ సభకు జనసేన నాయకులు జి.జయకుమార్ అధ్యక్షత వహించారు. ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన ముగ్గురు బాధితులకు ఒక్కొక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కులను, ఇద్దరికి తోపుడుబండి, టిఫిన్ బండిని గద్దె అందచేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.45 లక్షల విలువైన 35 చెక్కులను లబ్ధిదారులకు కూటమి నాయకులు అందజేశారు. నిర్మల శిశుభవన్‌లోని మానసిక వికలాంగులకు తెంటు రాజేష్ అందించిన పండ్లు, బ్రెడ్ కూటమి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ప్రజల ఆశలు నెరవేరే విధంగా పాలన సాగించామని పేర్కొన్నారు. జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనను అందచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ముమ్మనేని ప్రసాద్, కొడాలి సాయిబాబు, కొవ్వూరి కిరణ్, వేములపల్లి రంగారావు, వాసా పల్లపురాజు, తదితరులు పాల్గొన్నారు. **రాణిగారితోట:** రాణిగారితోట 18వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ విద్యార్థులతో కలిసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, నాగేందర్ రెడ్డి, రాయి రంగమ్మ, వెంకటేశ్వర రెడ్డి, హమీనా తదితరులు పాల్గొన్నారు.



సుపరిపాలన-స్వర్ణాంధ్ర వేడుకల్లో శాప్ చైర్మన్ రవి నాయుడు

విజయవాడ స్పోర్ట్స్: శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం సుపరిపాలన-స్వర్ణాంధ్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022-2023లో వైసీపీ ప్రభుత్వం క్రీడాకారులకు చెల్లించకుండా నిలిపి వేసిన 8.72 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాలు కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ అధికారులు పాల్గొన్నారు.

నేటి కౌన్సిల్ సమావేశం వాయిదా

కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశం శుక్రవారం జరగాల్సి ఉంది. కొన్ని కారణాలతో సమావేశాన్ని వాయిదా వేసినట్టు వీఎంసీ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి సమావేశం ఎప్పుడు జరిగేది తరువాత తెలుపుతామన్నారు.

టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా బేగ్

కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్‌గా(టీపీఎస్)గా వసీం బేగ్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు గురువారం టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నందిగామ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న బేగ్ సాధారణ బదిలీల్లో భాగంగా వీఎంసీకి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా (టీపీవో)గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యి మరల సాధారణ బదిలీలో టీపీఎస్‌గా వీఎంసీకి వచ్చారు.



యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న ఆర్ఐవో ప్రభాకర్, ఎస్ఐ రేవతి

గడువులోగా అనుమతులు పొంది కళాశాలను నడపండి: ఆర్ఐవో

బెంజిసర్కిల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల గడువులోగా అన్నీ అనుమతులు పొంది కళాశాలను నడపాలని గోల్డెన్ ఐ కళాశాల యాజమాన్యాన్ని ఆర్ఐవో ఆదేశించారు. బెంజిసర్కిల్ గోల్డెన్ ఐ కళాశాలను జిల్లా ఇంటర్మీడియెట్ ప్రాంతీయ విద్యాశాఖ అధికారి ప్రభాకర్ గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్డెన్‌ఐ కళాశాలకు అనుమతులులేవని గుర్తించారు. అమరావతి పేరుతో అనుమతులతో నడుపుతున్నట్లు యాజమాన్యం వివరించింది. వెంటనే అమరావతి పేరుతో బోర్డు నెలకొల్పి కళాశాల నడపాలని ఆర్ఐఓ ఆదేశించారు. విద్యార్థుల్ని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో పటమట ఎస్ఐ జి.రేవతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కార్తీక్, కృష్ణాజిల్లా కార్యదర్శి సాదిక్‌బాబు నాయకులు పాల్గొన్నారు.

పర్వతనేని కుటుంబసభ్యులకు ఎంపీ పరామర్శ



గుణదల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన నవత ట్రాన్స్‌పోర్ట్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతనేని కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) గురువారం పరామర్శించారు. క్రీస్తురాజపురంలోని ఆయన నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియపర్చి కోటేశ్వరరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు భవకుమార్, రాజేశ్వరరావు, సురేష్, కరీముల్లా, దేవానంద్, రామకృష్ణ ఉన్నారు.





పాఠశాలకు వెళుతున్న గోవిందరాజు స్కూల్ విద్యార్థులు, ఎన్ఎస్ఎం స్కూల్ విద్యార్థులు



కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ

తెరుచుకున్న బడులు : విద్యార్థులకు కిట్లు పంపిణీ

పటమట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వం రూ.13 వేలు తల్లికి వందనం కింద విద్యార్థుల తల్లులఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఒకటో తరగతి నుంచి 5 వరకు శనివారం నో బ్యాగ్స్ డేను అమలు చేస్తామని చెప్పడంతో పిల్లలపై కొంత భారం తగ్గుతుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను కొన్ని చోట్ల పంపిణీ చేశారు. మరి పాఠశాలల్లో శుక్రవారం పంపిణీ చేయ నున్నట్లు హెచ్ఎంలు తెలిపారు. విద్యామిత్ర కిట్లకు, బూట్లకు, బెల్టులకు ప్రత్యేక ముద్రను ముద్రించారు. నాణ్యత సరిగా లేకపోయినా, దుర్వినియోగం చేసి నా గుర్తించే విధంగా విద్యాశాఖ ముద్ర వేశారు.



విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ


అవంతి స్కూల్‌లో విద్యార్థులకు కిట్లు పంపిణీ

భారతీనగర్: గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్లోని దాసరి వెంకట గిరిధర కుమార్ అవంతి నగరపాలక సంస్థ పాఠశాలలో గురువారం 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన విద్యా కిట్లును ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ విద్యార్థులకు అందజేశారు.



కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ

ఎస్ఎంసీ చైర్‌పర్సన్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కబడ్డీ అసోసియేషన్‌లో వివాదానికి తెర

- అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మాజీ సెక్రటరీల తొలగింపు
- దుర్వినియోగమైన నిధులు వడ్డీతో చెల్లించాలని ఆదేశాలు

విజయవాడ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి: ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్‌లో గత కొన్నేళ్లుగా జరుగుతున్న వివాదానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేఈ ప్రభాకర్, మాజీ సెక్రటరీ వీర్లంకయ్యలను వెంటనే తొలగించడంతో పాటు దుర్వినియోగం చేసిన రూ.7,12,051 వడ్డీతో చెల్లించాలని ఆదే శాలు జారీ చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల శాప్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు ఆలిండియా కబడ్డీ అసోసియేషన్ మద్దతు కూడా లభించింది. ఈ సందర్భంలో ఈ ఎన్నికపై కొందరు వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఈ ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం. గతంలో సెక్రటరీగా ఉన్న వీర్లంకయ్యపై నిధుల దుర్వి నియోగంతో పాటు మహిళా కబడ్డీ క్రీడా కారులపై లైంగిక వేధింపులు పాల్పడినట్లు మాచవరం పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. దీనిపై ప్రభుత్వానికి పూర్తి నివేదికలు అందడంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

తప్పుడు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు తప్పుడు కబడ్డీ సర్టిఫికెట్లతో పోస్టల్‌లో ఉద్యోగం పొందిన విశాఖకు చెందిన సత్యనారాయణను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది.

క్రీడా అసోసియేషన్ల ప్రక్షాళన తప్పదు: శాప్ చైర్మన్

ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌లో జరిగిన అవకతవకలపై, నిధుల దుర్వినియోగంపై వచ్చిన నివేదిక ఆధారంగా శాప్ ఎండీ చర్యలు తీసుకుంటారని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. అసోసియేషన్ల సభ్యులు వివాదాలు మరిచి ఒకే తాటిపైకి వచ్చి ఆయా క్రీడలను, క్రీడాకారులకు అభివృద్ధి చేసే విధంగా ముందుకు రావాలన్నారు. క్రీడా అసోసియేషన్ల ప్రక్షాళన మాత్రం తప్పదని తెలిపారు.

దుర్గగుడి స్వర్ణతాపడానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం స్వర్ణతాపడానికి హైదరాబాద్‌కు చెందిన గోపాల్ దంపతులు గురువారం ఈఈ కోటేశ్వరరావుకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

అన్న క్యాంటీన్ నిర్వహణ భేష్ : ధ్యానచంద్ర

గాంధీనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ధర్నాచౌక్ సమీపంలో అన్న క్యాంటీన్‌ను గురువారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహణలో అధికారులు తీసుకుంటున్న శ్రద్ధను ఆయన ప్రశంసించారు. అలాగే నగరంలోని అన్ని అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని నోడల్ అధికారులను ఆదేశించారు. శాఖల సమన్వయంతో రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.



ఎక్స్‌పో లో వస్త్రాలు తిలకిస్తున్న సందర్శకులు

శేషసాయిలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

లబ్బీపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రేమికుల కోసం నగరంలోని శేషసాయి కల్యాణమండపంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌పో నిర్వాహకులు తెలిపారు. ఈ ఎక్స్‌పో లో స్పెషల్ సమ్మర్, వెడ్డింగ్‌తో పాటు సిల్క్ అండ్ కాటన్ శారీస్, డిజైనర్ వేర్, ఈతనిక్ వేర్, కుర్తీ అండ్ డ్రెసెస్, ఫ్యాషన్ జ్యువలరీ, హ్యాండ్ క్రాఫ్టెడ్ టెక్స్‌టైల్స్, కంచి, గద్వాల్, వెంకటగిరి, బెనారస్, పట్టు లంగాలు, ప్యూర్ జరీ చీరలతో పాటు దేశంలోని 150కి పైగా ప్రాంతాలకు చెందిన మాస్టర్ వీవర్స్ అండ్ బెస్ట్ వస్త్రాలు ఈ ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 14 వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆటపరికరాలకు మరమ్మతులు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొత్త ఉయ్యాల, సీసా ఆట పరికరానికి ఏర్పాటు చేసిన కొత్త సీటు

పటమట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పటమట దర్శిపేట పార్క్‌లో ఆటపరికరాలకు అధికారులు మరమ్మతులు చేయించారు. పటమట దర్శిపేట పార్క్‌లో పని చేయని ఆట పరికరాలు అనే శీర్షికన ఈ నెల 7న ప్రచురించిన కథనానికి అధికా రులు స్పందించారు. ఆట పరికరాలకు మరమ్మతులు చేయించారు. కొత్త ఊయల ఏర్పాటు చేశారు. సీ..సా ఆట పరికరానికి కొత్త సీటు అమర్చారు. మరి కొన్ని ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. పార్క్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.












సద్బోధ

వైఫల్యాలను స్వీకరిద్దాం



మానవుడి ఎదుగుదల, పరిణామ క్రమంలో అనేక సార్లు వైఫల్యాలు ఎదురవడం సహజం. వైఫల్యం కచ్చితంగా మనల్ని కుంగదీస్తుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడి నుంచి ఆత్మహత్య వరకూ... దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. కానీ వైఫల్యానికి ఒక సానుకూలమైన కోణం కూడా ఉంది. దాని నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కొత్త ఆలోచనలు చేయవచ్చు. కొత్త ఆశలు చిగురింపజేసుకోవచ్చు. ఇవన్నీ మన ప్రయాణానికి కొత్త దిశను అందిస్తాయి.

సమస్యలు శత్రువులు కాదు....

మన జీవితాల్లో విజయం కన్నా వైఫల్యమే ఎక్కువ సార్లు ఎదురవుతుందనేది ఒక వాస్తవం. కాబట్టి, వైఫల్యాలకు కుంగిపోకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి, ముందుకి సాగుతూ ఉండాలి. మనం విఫలమైనప్పుడు... అంతకు ముందు చేసిన తప్పులు మళ్ళీ చెయ్యకుండా జాగ్రత్త పడాలి. మన తప్పుల నుంచి మనం నేర్చుకున్నంతకాలం... అవి మనకి ఎలాంటి హానీ చెయ్యలేవు. విజయవంతమైన వ్యక్తులు కూడా విఫలమైన వ్యక్తుల్లాగానే వైఫల్యాలు ఎదుర్కొంటూ ఉంటారనేది నమ్మడం కష్టమైనప్పటికీ అది వాస్తవం. కానీ తేడా ఏమిటంటే... వాళ్ళు తమను తాము మెరుగుపరుచుకొని, తమ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ప్రగతి దిశగా ముందుకు సాగుతూ ఉంటారు. ఎందుకంటే విజయం అనేది వైఫల్యానికి అవతలి చివర్లో ఉంటుది. విజేతలు తమ విజయంకోసం సాగించిన పయనంలో అనేకసార్లు విఫలమైనవారే. కానీ వాళ్ళు ఒక వైఫల్యంగా తమను ఎన్నటికీ పరిగణించుకోరు. మహా భక్తురాలు, కవయిత్రి మీరాబాయి ఒక రాణి. ఆమె భర్తను కోల్పోయిన తరువాత బంధువులు ఎంతగానో వేధించారు, హింసించారు. చిత్తోడ్‌గఢ్ రాజమందిరాన్ని విడిచి ఆమె బయటకు పోవాల్సి వచ్చింది. కానీ ఈ ప్రతికూలతను ఒక అవకాశంగా ఆమె మార్చుకుంది. బృందావనానికి వెళ్ళి, అక్కడే నివసిస్తూ ఆధ్యాత్మిక సంపదను పోగుచేసుకుంది. కాబట్టి గొప్పవారు తమకు ఎదురైన కష్టాలకు కుంగిపోరు. తమ అంతరంగాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఒక అవకాశంగా దాన్ని మలచుకుంటారు. సమస్యలు మనకు శత్రువులు కాదు. అవి నేర్చుకోవడానికి మనకు అనేక అవకాశాలు ఇస్తాయి. కొత్త దృక్పథంతో జీవితాన్ని చూసేలా చేస్తాయి. ఆత్మశోధనకు ఆస్కారం కల్పిస్తాయి. మనలో దాగి ఉన్న సామర్థ్యాలను బయటకు తీయడానికి దోహదం చేస్తాయి.

ఎదుగుదలే శాశ్వతం

"లోకహానౌ చింతా న కార్యా నివేదితాత్మ లోక వేద శీలత్వాత్... భక్తుడు తనను, ఈ లోకాన్ని, ఇక్కడ చేసే కర్మలను, తన ప్రవర్తనను... ఇలా అన్నిటినీ ఆ పరమాత్మకే సమర్పిస్తాడు. కాబట్టి అతను ఎటువంటి కష్టాలకు, దుఃఖాలకు చలించడు. వాటిలో దేవుడి కృపనే దర్శిస్తాడు" అన్నాడు నారద మహర్షి తన 'భక్తి సూత్రాల'లో. కష్టాల్లో కూడా దైవికమైన ఆశీర్వాదం అంతర్లీనంగా ఉందని నారద మహర్షి మనకు ఉపదేశిస్తున్నాడు. ప్రతికూలమైన పరిస్థితుల్లో మనం ప్రాపంచికమైన విషయాలకు దూరంగా జరుగుతాం. అలాంటి కష్ట సమయాల్లో భగవంతుణ్ణి మీ మనసులో స్మరించుకోండి. మీ ప్రవర్తనలను మార్చుకోవడానికి ప్రయత్నించండి. భౌతికమైన లక్ష్యాలను పెంచుకోవడం మన లక్ష్యం అయితే... ప్రతికూల పరిస్థితులను సహజంగానే ఎదుర్కోవలసి వస్తుంది. కానీ మనం ఆధ్యాత్మికమైన పురోగతిని కోరుకున్నప్పుడు... ప్రతికూలతలను ఎదుగుదలకు అవకాశాలుగా చూడడం నేర్చుకుంటాం. కష్టాల వల్ల కలిగే బాధ తాత్కాలికమని, వాటిని ఎదుర్కొని, పరిష్కరించుకోవడం ద్వారా మనలో సంభవించే ఎదుగుదల శాశ్వతమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.

• స్వామి ముక్తానంద
జేకేయోగ్ వ్యవస్థాపకుడు

దైవమార్గం

అంతరంగంతో వినాలి



మంచి ఉపమానాలతో, సామాన్యులకైనా చక్కగా అర్థమయ్యేలా హితవు చెప్పేవాడు ఏసు క్రీస్తు. ఆయన బోధల్లో వెల్లడించే ఎంతటి నిగూఢ సత్యమైనా సులువుగా అవగతమయ్యేది. అలాంటి కథల్లో ఇది ఒకటి. "ఆధ్యాత్మిక విషయాలు మామూలు చెవులతో వింటే గ్రహించడం కష్టం. వాటిని ఆత్మీయమైన అంతరంగంతో వినాలి" అంటూ ఈ కథను ఆయన ప్రారంభించాడు.

ఒక రైతు తన భూమిని దున్ని, విత్తనాలు చల్లడానికి సిద్ధమయ్యాడు. అతను విత్తనాలు చల్లుతూ ఉంటే... వాటిలో కొన్ని దారి పక్కన పడిపోయాయి. పక్షులు వచ్చి వాటిని మింగేశాయి. మరి కొన్ని మట్టి ఎక్కువగా లేని రాతి నేలలో పడ్డాయి. అవి ఎండకు మాడి పోయాయి. ఇంకొన్ని ముళ్ళ పొదల్లో పడ్డాయి. ఆ పొదలు వాటిని ఎదగనివ్వకుండా చేశాయి. మిగిలినవి సారవంతమైన నేల మీద పడ్డాయి. అవి ఒక్కొక్కటీ ముప్పై మొదలు నూరింతల వరకూ ఫలించాయి.

అలాగే ఒక వ్యక్తి ఎంతోమందికి నీతిసారాన్ని బోధిస్తున్నప్పటికీ... వాటిని గ్రహించే విషయంలో వ్యత్యాసాలు ఉంటాయి. అందరూ వాటిని వింటారు. కానీ కొందరి మనసుల్లో తిష్ట వేసుకొని ఉన్న చెడ్డ బుద్ధి వాటిని పక్కకు నెట్టేస్తుంది. దారి పక్కన పడిన విత్తనాలు అలాంటివే. మరి కొందరి మనసుసుల్లో ఆ మాటలు బాగా నాటుకోవు. అవి రాతి నేల మీద పడిన విత్తనాల్లాంటివి. ఇంకొందరు ఆ బోధలను విన్నప్పటికీ... ఐహిక బంధాలు, ధన వ్యామోహాలు వాటిని అణచివేస్తాయి. ఇవి ముళ్ల పొదల్లో పడిన విత్తనాలు. బోధను చక్కగా విని, వాటిని బాగా అర్థం చేసుకొని, పాటించేవారు కొందరు ఉంటారు. వారు సారవంతమైన నేలలో పడిన విత్తనాల్లా ప్రయోజకులవుతారు. అందరూ ఆ విధంగా కావాలనేది ఏసు ఆకాంక్ష.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

గీతాసారం

కోరికను, కోపాన్ని వదులుకోవాలంటే..



ప్రతి తుపానుకు దాని కేంద్రంలో ఒక ప్రశాంతమైన నేత్రం ఉంటుంది. అలాగే మన కోరికలు, కోపం అనే తుపానుకు కూడా... కోరికలు, క్రోధం లేని ఒక కేంద్రం మన మనసులోనే ఉంటుంది. ఆ కేంద్రాన్ని చేరుకోవడమే మోక్షం. ఈ ప్రక్రియలో... కోరికలకు మూల కారణమైన 'నేను' అనే భావనను తృణీకరించడానికి ఎంతో ధైర్యం కావాలి. రోజువారీ జీవితంలో ఈ విషయాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి రెండు సులభమైన పద్ధతులను పాటించవచ్చు. మొదటిది... గతంలో మనం కోరికతో నిండిన అవస్థను గాని, కోపం తెప్పించిన ఒక పరిస్థితిని గాని గుర్తుకు తెచ్చుకొని, ఒక సాక్షిగా గమనించాలి. 'అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ ఒక్కటే. కానీ ప్రతి ఒక్కరూ ఒకే సత్యాన్ని అనేక విధాలుగా గ్రహిస్తారు' అనే మెరుగైన అవగాహనతో పరిస్థితిని విశ్లేషించాలి.

"కామ క్రోధ రహితులకు, చిత్తవృత్తులను జయించినవారికి, పరబ్రహ్మమైన పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందిన జ్ఞానులకూ అన్నిటిలోనూ ఆ పరమాత్మే గోచరిస్తాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి 'కోరికలు' అనే వ్యాధి నుంచి, 'కోపం' అనే వెర్రితనం నుంచి స్వేచ్ఛ పొందడం ఎలా? భారతీయ సంప్రదాయాలు జీవితాన్ని 'లీల' అంటే 'కేవలం ఒక నాటకం' అని చెప్పాయి. అందులో ఏ విషయాన్నీ తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. ఏడు నుంచి పది రోజుల పాటు మనం ఒక నాటకంలో నటిస్తున్నట్టు భావించి... దేన్నీ తీవ్రంగా తీసుకోకుండా... ఉల్లాస మనఃస్థితిలో ఉండడం అనేది రెండో మార్గం. ఇది ఒక నటుడు నాటకం కోసం కోరికను, కోపాన్ని అరువు తెచ్చుకొని, వాటిని అనుభూతి చెందడం లాంటిదే. ఒకసారి వాటిపై పట్టు సాధించిన తరువాత... మనం సుఖదుఃఖాల్లాంటి ఇంద్రియాల జాలంలో చిక్కినా కూడా... నెమ్మదిగా కోరికను, కోపాన్ని అప్పటికప్పుడే వదులుకోవడం నేర్చుకుంటాం. అంటే వర్తమానంలోనే పరమ స్వేచ్ఛను పొందడం, లేదా మోక్షాన్ని పొందడం ఎలాగో తెలుసుకుంటాం.

చివరి అడుగు పరమాత్మను శరణువేడడం. "భగవంతుడు యజ్ఞాలకు, తపస్సులకు భోక్త, సమస్త లోకాలకు, లోకేశ్వరులకు అధిపతి, సమస్త ప్రాణులకు ఆత్మీయుడు, అంటే అవ్యాజమైన దయ కలిగినవాడు, పరమ ప్రేమ స్వరూపుడు. ఈ భగవత్ తత్త్వాన్ని ఎరిగిన భక్తులకు పరమ శాంతి లభిస్తుంది" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.




కె.శివప్రసాద్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఏపీ సీఎం చంద్రబాబుతో 15న సినీ ప్రముఖుల భేటీ

• పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని సీఎం నివాసానికి 30మంది



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ నెల 15న సమావేశం కాబోతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్ర పరిశ్రమ తరఫున దాదాపు 30మంది ప్రముఖులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్నారు. సినీ ఇండస్ట్రీ అభివృద్ధి, సినిమా థియేటర్ల నిర్వహణ, చిత్ర పరిశ్రమలోని సమస్యలు, తాజా పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా టాలీవుడ్ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలవకపోవడంపై పవన్ అంతకుముందు అసహనం వ్యక్తం చేశారు. 'రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు థ్యాంక్స్' అంటూ డిప్యూటీ సీఎం చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇండస్ట్రీలో కలకలం సృష్టించాయి. సినీ నిర్మాతలు కేవలం తమ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపునకు మాత్రమే ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారని, సినీ పరిశ్రమ అభివృద్ధికి సంఘటితంగా ప్రభుత్వం వద్దకు రావట్లేదన్నారు. ఇకపై వ్యక్తులు ఇచ్చే వినతుల్ని పట్టించుకోబోమని, అసోసియేషన్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కూడా పవన్ ఆ సమయంలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు చిత్ర ప్రముఖులు పవన్ కల్యాణ్‌ను సంప్రదించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో చర్చించి సినీ పరిశ్రమ అభివృద్ధికి అందరం పాటుపడదాం అని పవన్ సూచించడంతో చలన చిత్ర రంగ ప్రముఖులు చంద్రబాబుతో ఆదివారం భేటీ కానున్నారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)

వేడుకను విజయవంతం చేయండి

-దిల్ రాజు



పద్నాలుగు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తోన్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల వేడుకను విజయవంతం చేయాలని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విమాన ప్రమాద దుర్ఘటన కారణంగా మంత్రి కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. ఈనెల 14న హైటెక్స్‌లో నిర్వహిస్తోన్న అవార్డుల బహూకరణ కార్యక్రమాన్ని ఐఅండ్‌పీఆర్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తున్నాం. ఇలా ప్రతి ఏడాదిలో మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తున్నాం. 2024 సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా ఇస్తున్నాం' అని దిల్ రాజు తెలిపారు.

అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది

- సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్



'ఓ అపర కుబేరుడు, బిచ్చగాడికి మధ్య ఇంటెలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రం 'కుబేర'. అసలు వారిద్దరూ ఒకరికొకరు ఎలా తారసపడ్డారు, వారి మధ్య పోరుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న హిందీలో కూడా పాపులర్ స్టార్స్. అందుకే మా చిత్రాన్ని హిందీలో కూడా డబ్ చేసి విడుదల చేస్తున్నాం. మొత్తం 1600కు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం. అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావు అన్నారు. వారిద్దరూ నిర్మాతలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వారిద్దరూ మీడియాతో ముచ్చటించారు.

- శేఖర్ కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన మంచి ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని టచ్ చేస్తూ ఉండే సినిమాలు తీస్తారు. 'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత శేఖర్ కమ్ముల 'కుబేర' కథను మాకు చెప్పారు. తర్వాత ధనుష్ కూడా ఓకే చేయడంతో సినిమా మొదలుపెట్టాం. 'కుబేర' సినిమా అద్భుతంగా వచ్చింది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది.
- తన గత చిత్రాలకు భిన్నంగా ఈ సారి అగ్రతారలతో శేఖర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇదొక డిఫరెంట్ మూవీ. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. సినిమాలో అధికభాగం రియల్ లొకేషన్లలో చిత్రీకరించడం సవాల్‌గా అనిపించింది. ముంబైలోని మురికివాడలు, డంపింగ్ యార్డ్స్‌లో చిత్రీకరణ జరిపాం. ఇందులో ధనుష్ బిచ్చగాడిగా సాహసోపేతమైన పాత్రలో నటించారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. ధనుష్‌ను తప్ప ఈ పాత్రలో మరొకర్ని ఊహించుకోలేం. ఈ చిత్రంలో ధనుష్ రెండు పాటలు పాడారు. దేవిశ్రీ నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. నాగార్జున అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. శేఖర్ కమ్ములతో మరో సినిమా చేస్తున్నాం.

యుద్ధభూమిలో యోధుడు



గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'గోపీచంద్ 33'-వర్కింగ్ టైటిల్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూపొందించిన భారీసెట్లో చిత్రీకరణ జరుగుతోంది. గోపీచంద్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం చిత్ర బృందం పోస్టర్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోపీచంద్ విభిన్నమైన లుక్‌లో కనిపించారు. యుద్ధభూమిలో వీరతిలకం ధరించిన యోధుడిగా ఆయన కనిపించారు. ఏడో శతాబ్దానికి చెందిన ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని ఓ పాయింట్‌తో సంకల్ప్‌రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని యూనిట్ తెలిపింది.

మిత్రమండలి వినోదం



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన తారాగణంగా తెరకెక్కుతోన్న చిత్రం 'మిత్రమండలి'. నిహారిక ఎన్.ఎం కథానాయిక. విజయేందర్ ఎస్. దర్శకత్వంలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. నిర్మాత బన్నీ వాసు, బీవీ వర్క్స్‌తో కలసి సమర్పిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ 'మిత్రమండలి' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బన్నీ వాసు సమర్పిస్తున్న తొలి చిత్రం ఇది. టీజర్ చాలా బావుంది. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. బన్నీ వాసు మాట్లాడుతూ 'వినోదాత్మకంగా, ఉల్లాసంగా సాగే నలుగురు స్నేహితుల కథ ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. థియేటర్లకు వచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి' అన్నారు. 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే కంటెంట్‌తో వస్తున్నాం' అని విజయేందర్ ఎస్. అన్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

గద్దర్ ఫిల్మ్ అవార్డులను తక్షణమే నిలిపివేయాలి

గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫూల్ రాంరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆంధ్రా సినిమాలకు ఇవ్వవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామని, శుక్రవారం వాదనలు వినిపించబోతున్నామని వారు చెప్పారు. కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు.

-బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

సీనియర్ నిర్మాత మహేంద్ర కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. దర్శకుడు రవికుమార్ చౌదరి మరణించిన 24 గంటలు కాకముందే సీనియర్ నిర్మాత, ఎ.ఎ.ఆర్ట్స్ అధినేత కాపూరి మహేంద్ర(79) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధమైన సమస్యలతో బాధపడుతున్న మహేంద్ర తన స్వస్థలమైన గుంటూరులోని రమేశ్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నటుడు, నిర్మాత మాదాల రవి ఆయనకు అల్లుడు. కుమారుడు జీతూ కొన్నేళ్ల క్రితమే మరణించారు. ప్రొడక్షన్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించిన మహేంద్ర తర్వాత నిర్మాణరంగంలోకి ప్రవేశించి గీతా ఆర్ట్ పిక్చర్స్, ఎ.ఎ. ఆర్ట్స్ బేనర్లపై 36 చిత్రాలు నిర్మించారు. 1977లో వచ్చిన 'ప్రేమించి పెళ్లి చేసుకో' నిర్మాతగా మహేంద్ర తొలి సినిమా. రాజశేఖర్ హీరోగా నటించిన 'అర్జున' ఆయన చివరి చిత్రం.



జూలై 15 నుంచి లెక్చరర్ పోస్టులకు పరీక్షలు

» ఏపీపీఎస్సీ కొత్త షెడ్యూలు విడుదల

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ లెక్చరర్లు(99), జూనియర్ లెక్చరర్లు(47), డిగ్రీ లెక్చరర్లు(240), టీటీడీ డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టుల భర్తీకి రాత పరీక్షల కొత్త షెడ్యూలును ఏపీపీఎస్సీ ప్రకటించింది. జూలై 15 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపింది. జూలై 23తో పరీక్షలు ముగుస్తాయని పేర్కొంది. అన్ని పోస్టులకూ.. కొన్ని పేపర్లు ఒకేవిధంగా ఉంటాయని తెలిపింది. కాగా, టీటీడీ డిగ్రీ కాలేజీలో భర్తీ చేయనున్న పోస్టులకు సంబంధించి ఏపీపీఎస్సీ రాత పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుంది. అనంతరం భర్తీ ప్రక్రియ టీటీడీ చేపడుతుంది.

మోడల్ స్కూళ్లలో బదిలీలకు అనుమతి

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో ప్రిన్సిపాళ్లు, పీజీటీలు, టీజీటీల బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత పాఠశాలలో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నవారు తప్పనిసరిగా బదిలీ కావాలి. రెండేళ్లు దాటిన వారు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండేళ్లలోపు రిటైర్ కాబోయే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. బదిలీల ప్రక్రియ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరుగుతుంది. సాధారణ టీచర్ల తరహాలోనే నాలుగు కేటగిరీల్లో పాయింట్లు కేటాయిస్తారు. ఏడాదికి అర పాయింట్ చొప్పున సర్వీస్ పాయింట్లు ఇస్తారు. బదిలీల ప్రక్రియ చేపట్టడంపై మోడల్ స్కూల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివశంకర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

బడి తొలిరోజే ఆగిన ఊపిరి

» గుండెపోటుతో హెచ్‌ఎం హఠాన్మరణం



సురేశ్ కుమార్

ఏలూరు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్కూల్ పునఃప్రారంభం రోజున.. విధి నిర్వహణలో ఉండగానే.. గుండెపోటుతో ఓ హెచ్‌ఎం కుప్పకూలి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. గురువారం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కూచింపూడి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.వి.సురేశ్ కుమార్(47) తొలుత పాఠశాలలో స్టాఫ్ మీటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో హఠాత్తుగా కుప్పకూలిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను వెంటనే ఏలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే సురేశ్ కుమార్ మృతి చెందారు. హెచ్‌ఎం సురేశ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జిల్లా విద్యాశాఖ తరఫున ఉపాధ్యాయులకు నిర్వహించే వివిధ శిక్షణ కార్యక్రమాలకు సురేశ్ డీఆర్పీగా వ్యవహరిస్తుంటారు. ఆయన మృతికి డీఈవో వెంకట లక్ష్మమ్మ, డీవైఈవో రవీంద్ర భారతి, ఎంఈవో అరుణ్ కుమార్, హెచ్‌ఎంల సంఘం జిల్లా నాయకులు సంతాపం తెలియజేశారు.

ముందస్తు వ్యూహంతోనే అరాచకం

» కుట్ర కోణంపై పోలీసులు అనుమానాలు

» ముందురోజు వాట్సాప్ మెసేజీల పరిశీలన

» పొదిలిలో మహిళలపై దాడి కేసులో తొమ్మిది మంది వైసీపీ మూకల అరెస్టు



'ఎవరైనా సరే తొక్కిపడేస్తాం' అంటూ అల్లరి మూకలు ప్రదర్శిస్తున్న ఫ్లెక్సీలను చూపిస్తున్న పోలీసులు

పొదిలి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'ముందస్తు వ్యూహం, పక్కా ప్రణాళికతోనే వైసీపీ మూకలు అల్లర్లకు పాల్పడినట్లు గుర్తించాం, దీనిపై లోతుగా పరిశీలిస్తున్నాం. వాట్సాప్‌లో ముందురోజు వచ్చిన మెసేజ్‌లను పరిశీలిస్తే కుట్రకోణం ఉన్నట్లు తెలుస్తోంది' అని ప్రకాశం జిల్లా ఏఎస్పీ కె.నాగేశ్వరరావు అనుమానం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత జగన్ పొదిలి పర్యటనలో ఆ పార్టీ మూకలు మహిళలు, పోలీసు సిబ్బందిపై రాళ్లతో దాడి చేసిన ఘటనలో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గురువారం పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా అల్లర్లు సృష్టించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, ప్రభుత్వ ఆస్తులను నష్టపరచడంతో పాటు మహిళలపై రాళ్లు, చెప్పులతో దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. రాజధాని మహిళలను కించపరిచారనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో భాగంగా పొదిలిలో కూడా మహిళలు అమ్మవారిశాల బజారు, బెస్తపాలెం ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్‌లో శాంతియుతంగా నిరసన తెలిపారని చెప్పారు. ఆ సమయంలో జగన్ ర్యాలీలో పాల్గొన్న అల్లరిమూకలు ప్రణాళికతోనే చెప్పులు, వాటర్ బాటిళ్లు, రాళ్లతో మహిళలపై దాడి చేశారని తెలిపారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన బందోబస్తులో ఉన్న దర్శి డీఎస్పీ, ఒంగోలు రూరల్ సీఐ, మిగతా సిబ్బందిపై కూడా దాడులకు పాల్పడ్డారని చెప్పారు. వేలం కేంద్రంలోకి జగన్‌తో పాటు ముఖ్య నాయకులకు మాత్రమే అనుమతి ఉందని మార్కాపురం డీఎస్పీ తమ సిబ్బందితో కలిసి పదేపదే చెబుతున్నా అల్లరి మూకలు వారిని తోసుకుంటూ 'ఎవరైనా రాని తొక్కిపడేస్తాం' అంటూ బలవంతంగా లోపలికి పోయారని తెలిపారు. ఈ క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బాబూరావుకూ గాయాలయ్యాయన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామని, వారిలో 9 మందిని గురువారం అరెస్టు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలనే ఉద్దేశంతో మద్యం తాగి అల్లరి మూకలు దాడులకు తెగబడ్డారని తెలిపారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియాలో ముందు రోజు మెసేజ్‌లను పరిశీలించామని, అందులో 'రేపు జగనన్న పర్యటనలో ప్రభుత్వ రూల్స్ కాదు.. జగనన్న రూల్స్' అంటూ రెచ్చగొట్టే మెసేజ్‌లు ఉన్నాయన్నారు. ఇది ముందస్తు వ్యూహంగా అనుమానిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసులో మరి కొంతమందిని గుర్తించామని, వారినీ త్వరలో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

పరామర్శ పేరుతో హల్‌చల్

» అత్యాచారాన్ని రాజకీయం చేసేందుకు వైసీపీ కుతంత్రం

» 'హెలిప్యాడ్' ఘటనలా రెచ్చగొట్టే కుట్ర!

» ఉద్రిక్తతల సృష్టికి 'చలో పేరూరు'కు పిలుపు

» టీడీపీ విజయోత్సవ ర్యాలీ ఉండడంతో అనుమతి నిరాకరించిన పోలీసులు

» అయినా 3 వాహనాల్లో తరలిన వైసీపీ కార్యకర్తలు

» ర్యాలీకి ఎదురుగా వెళ్లి ఈలలు, కేకలతో కవ్వింపు

» టీడీపీ శ్రేణులపై రాళ్ల దాడులు

» తెలుగు తమ్ముళ్ల ఎదురుదాడులు

» మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి, మాజీ మంత్రి నాగార్జునను మద్దెలచెరువులోనే అడ్డుకున్న పోలీసులు



మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి, వైసీపీ నేతలతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ధర్మవరం/రామగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పరామర్శల ముసుగులో వైసీపీ నేతలు ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలికపై అత్యాచారాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకునేందుకు శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులు ప్రయత్నించారు. సదరు బాలిక కుటుంబసభ్యులను పరామర్శించే పేరుతో 'చలో పేరూరు'కు పిలుపు ఇచ్చి అరాచకాలకు దిగారు. రామగిరి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారం జరిగిన విషయం ఇటీవల వెలుగుచూసింది. పోలీసుల అనుమతి లేకున్నా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి గురువారం 'చలో పేరూరు'కు పిలుపునిచ్చారు. వాస్తవానికి అక్కడ గురువారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించాలని టీడీపీ నేతలు నిర్ణయించారు. వైసీపీ వాళ్లు కూడా వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు 'చలో పేరూరు'కు అనుమతి నిరాకరించారు. అయినా వైసీపీ కార్యకర్తలు కొందరు పొరుగూళ్ల నుంచి 3 మూడు వాహనాల్లో అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ వందలాది టీడీపీ కార్యకర్తలు, నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నారు. వైసీపీ వాళ్లు వాహనాల్లో పార్టీ జెండాలు చేతపట్టుకుని, ఈలలు, కేకలు వేస్తూ ర్యాలీకి ఎదురుగా వచ్చి కవ్వింపు చర్యలకు దిగారు. టీడీపీ వాళ్లపై రాళ్లు రువ్వారు. దీంతో టీడీపీ కార్యకర్తలు కూడా ఎదురు దాడులకు దిగారు. వైసీపీ మూకల వాహన అద్దాలు పగిలిపోయాయి. తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. చివరకు వైసీపీ వాళ్లు తమ వాహనాల్లో వెనుదిరిగిపోయారు. ఇంకోవైపు.. తోపుదుర్తి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఉమ్మడి అనంతపురం జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనంతపురం నుంచి పేరూరుకు బయల్దేరారు. మార్గమధ్యంలో కనగానపల్లి మండలం మద్దెలచెరువులో పోలీసులు వారిని అడ్డుకున్నారు. వెళ్లడానికి అనుమతి లేదని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తేల్చిచెప్పారు. అలాగే పేరూరుకు వెళ్తున్న వైసీపీ శింగనమల ఇన్‌చార్జి సాకే శైలజానాథ్‌ను కూడా చెన్నేకొత్తపల్లి మండలం ఎన్‌ఎస్ గేటులో పోలీసులు అడ్డుకోవడంతో ఆయన వెనుదిరిగారు.

అప్పుడూ ఇలానే..

రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్ ఈ ఏడాది ఏప్రిల్ 8న వచ్చిన సమయంలో కూడా వైసీపీ మూకలు హెలిప్యాడ్ వద్ద నానా బీభత్సం చేశాయి. దీంతో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిందంటూ పైలట్లు జగన్‌ను వదిలేసి వెళ్లారు. ఇలా.. పరామర్శ పేరుతో వైసీపీ వాళ్లు పథకం ప్రకారమే ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ఆదుకుంటాం

» రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్



సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న జవహర్

కాకినాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడలో వీధి సుబ్రహణ్యం కుటుంబాన్ని టీడీపీ ఇన్‌చార్జి ఎన్.మనోజ్, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ఆయన పరామర్శించారు. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు, అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి రీ ఇన్వెస్టిగేషన్ చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటుందని జవహర్ తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయ బృందాన్ని సిద్ధం చేసిందని చెప్పారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునే విషయంలో కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడంతోపాటు కుటుంబానికి న్యాయంగా రావాల్సిన అన్ని సదుపాయాలు అందేలా కమిషన్ కృషి చేస్తుందని జవహర్ తెలిపారు. అతని కుటుంబసభ్యులకు అందజేసిన నిరుపయోగమైన భూమి స్థానంలో జీవనోపాధి పొందేలా అనువైన స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వీధి సుబ్రహ్మణ్యం కేసు విషయంలో మొదటి నుంచి ఆ కుటుంబానికి అండగా నిలిచిన సామాజిక కార్యకర్త పిట్టా వరప్రసాద్‌ను జవహర్ అభినందించారు.

ఆడబిడ్డలపై నేరాలకు పాల్పడితే ఉపేక్షించం

» మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



తన్మయి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న రాయపాటి శైలజ

అనంతపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎక్కడైనా ఆడబిడ్డలపై నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించేలా కమిషన్ చర్యలు తీసుకుంటుంది' అని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. గురువారం ఆమె అనంతపురం పర్యటనకు వచ్చారు. హత్యకు గురైన విద్యార్థిని తన్మయి తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందనీ, దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన అత్యాచార బాధితురాలిని అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో ఆమె పరామర్శించి, ఓదార్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనల్లో నిందితులందరికీ కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆహార భద్రత కల్పించేలా పరిశోధనలు

» రంగా వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి అచ్చెన్న

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడులు తగ్గేలా, అధిక దిగుబడులిచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు శాస్త్రవేత్తలను కోరారు. గురువారం గుంటూరు సమీపంలోని లాంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచుతూ, రసాయన ఎరువుల వాడకం తగ్గించేలా కృషి చేయాలి. భూసార పరీక్షల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఆహార భద్రత సాధించే దిశగా అత్యుత్తమ రకాలను రూపొందించాలి. ఈ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులైన విద్యార్థులు దేశవిదేశాల్లో అత్యున్నత పదవుల్లో పని చేయడం ముదావహం' అని మంత్రి అచ్చెన్న అన్నారు. వీసీ శారద జయలక్ష్మి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ డిల్లీరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ టెక్నికల్ బులిటెన్‌ను మంత్రి ఆవిష్కరించారు. 2023-25లో ఉత్తమ సేవలందించిన పలువురు శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులకు అవార్డులు అందజేశారు.

రాష్ట్రంలో పోషకాహార మిషన్‌కు కమిటీ ఏర్పాటు

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆహార భద్రత, పోషకాహార మిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ, మిషన్‌ను నడిపించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నతాకారులు.. 11మందితో కార్యనిర్వాహక కమిటీని నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, శ్రీలంక, భారత్‌లో వాతావరణ మార్పులకు ప్రభావాలకు గురయ్యే వర్గాల స్థితిని బలోపేతం చేయడానికి చేపట్టిన ఏడీఏపీటీ4ఆర్ ప్రాజెక్టుకు రాష్ట్ర, జిల్లా స్థాయి అమలు కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వు జారీ అయ్యింది.

రేపు పోలవరానికి సీడబ్ల్యూసీ బృందం

» డయాఫ్రంవాల్, ప్రధాన డ్యాం పనుల పరిశీలన

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. డయాఫ్రంవాల్, ప్రధాన డ్యాం ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం పనుల నాణ్యాతా ప్రమాణాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు కేంద్ర జల సంఘం సభ్యుడు యోగేందర్ పైతాంకర్, చీఫ్ ఇంజనీర్ హెచ్‌ఎస్ సెంగర్ శుక్రవారం రాజమహేంద్రవరానికి రానున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో జరుగుతున్న పనులను వారు శనివారం సమీక్షిస్తారు. అదేరోజు రాత్రికి రాజమహేంద్రవరంలో బస చేసి అధికారులతో సమావేశమవుతారు. ఆదివారం తిరిగి ఢిల్లీకి పయనమవుతారు.

న్యాయం చేయాలని కోరితే చెయ్యెత్తుతారా?

» వెటర్నరీ డైరెక్టర్ తీరుపై జేఏసీ ఆగ్రహం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పశుసంవర్థకశాఖ బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని చెప్పుకోవటానికి వచ్చిన వెటర్నరీ డాక్టర్‌పై ఆశాఖ డైరెక్టర్ చెయ్యెత్తి, దురుసుగా ప్రవర్తించడాన్ని ఏపీ వెటర్నరీ గెజిటెడ్ ఆఫీసర్ జేఏసీ, రాష్ట్ర పశుసంవర్థకశాఖ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించాయి. విశాఖకు చెందిన భార్యాభర్తలైన పశువైద్యులు.. ఐదేళ్లు పూర్తి కాకపోయినా తమను బదిలీ చేశారని, విజయవాడలోని డైరెక్టరేట్‌కు వచ్చి డైరెక్టర్ దామోదర్‌నాయుడును కలిశారని తెలిపింది. తన భార్య డాక్టర్ పద్మలీలకు అన్యాయం చేశారంటూ ఆమె భర్త డాక్టర్ సురేష్ డైరెక్టర్‌ను గట్టిగా నిలదీశారని, ఈ సందర్భంగా డైరెక్టర్ దామోదర్‌నాయుడు ఆయనపై చేయి చేసుకోబోయారని జేఏసీ ఆరోపించింది. అన్యాయం జరిగితే అడగటం తప్పన్నట్లు మాట్లాడి, ప్రభుత్వాన్ని అడుక్కోపో అంటూ దురుసుగా మాట్లాడారని మండిపడింది. డైరెక్టర్ తీరుపై ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేస్తామని జేఏసీ చైర్మన్ కృష్ణారావు తెలిపారు.

ఇద్దరి ప్రాణం తీసిన విష వాయువు



పగిరి చంద్రశేఖర్, శరగడం కుమార్

» మరొకరి పరిస్థితి విషమం.. ఫార్మాసిటీలోని సాయిశ్రేయాస్ ఫార్మాస్యూటికల్స్‌లో ఘటన

పరవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని సాయిశ్రేయాస్ ఫార్మాస్యూటికల్ ప్రైవేటు లిమిటెడ్‌లో విష వాయువు పీల్చడంతో ఇద్దరు ఉద్యోగులు మృతిచెందారు. మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కథనం మేరకు.. ఫార్మా కంపెనీలో హైదరాబాద్‌కు చెందిన పగిరి చంద్రశేఖర్ (32) సేఫ్టీ అసిస్టెంట్ మేనేజర్‌గా, అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన శరగడం కుమార్ (25) సేఫ్టీ షిఫ్ట్ ఆఫీసర్‌గా, ఒడిశాకు చెందిన బైదు బన్సాల్ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో చంద్రశేఖర్, కుమార్, బన్సాల్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో వ్యర్థ రసాయనాలు ఎంతవరకూ ఉన్నాయో చూసేందుకు వెళ్లి ట్యాంకుపై మూత తీశారు. ఈ క్రమంలో వ్యర్థ రసాయనాలను పీల్చడంతో చంద్రశేఖర్, కుమార్ అక్కడికక్కడే కుప్పకూలిపోగా, బన్సాల్ అస్వస్థతకు గురయ్యాడు. ముగ్గురినీ హుటాహుటిన షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చంద్రశేఖర్, కుమార్ మృతి చెందగా బన్సాల్‌కు ఐసీయూలో వైద్యసేవలందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు కంపెనీ యాజమాన్యం రూ.55 లక్షల చొప్పున పరిహారం అందజేసింది.

మా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టరూ!



జస్వంత్ శ్రీరామసాయి

» ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలకు కాలేయ వ్యాధి

» బాలిక మృతి, బాలుడి పరిస్థితి విషమం

» దాతల సాయం కోసం తల్లిదండ్రుల వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న పిల్లల తల్లిదండ్రులు

ద్వారకాతిరుమల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆడుతూ పాడుతూ కళ్లముందు తిరుగుతున్న బిడ్డలిద్దరికీ కాలేయ వ్యాధి సోకింది. పెద్దదైన పాప నాలుగు రోజుల క్రితం మృతి చెందింది...బాబు పరిస్థితి విషమంగా ఉంది. లక్షల్లో ఖర్చు.. చేతిలో సొమ్ములేదు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం దిక్కుతోచని స్థితి ఇది. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన బుద్దాల హరిబాబు, రాజేశ్వరి దంపతులకు మౌనిక(6), నాలుగేళ్ల జస్వంత్ శ్రీరామసాయి సంతానం. పిల్లలిద్దరూ కొద్ది రోజుల క్రితం జ్వరం, వాంతులు, విరోచనాలతో ఒక్కసారిగా నీరసించిపోయారు. జంగారెడ్డిగూడెంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ పాప మృతి చెందింది. బాబును రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించాలని, రూ.20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. వెంటనే బాలుడ్ని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10 లక్షలు మంజూరు చేయిస్తూ, ఎల్‌వోసీ ఇప్పించి హైదరాబాద్‌లోని ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. తల్లి రాజేశ్వరి తన లివర్‌ను ఇచ్చేందుకు సిద్ధపడటంతో గురువారం తెల్లవారు జామున తల్లి లివర్‌లో భాగాన్ని తీసి సాయికి అమర్చారు. ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. అయితే బాలుడికి ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని, చికిత్సకు చాలా ఖర్చు చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఇప్పటికే ఒక బిడ్డను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు, మిగిలిన ఒక్కగానొక్క బిడ్డను ఎలా కాపాడుకోవాలోనంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. దాతలు ఆపన్నహస్తాన్ని అందించి తమ బిడ్డకు పునర్జన్మ నివ్వాలని వేడుకుంటున్నారు. దాతలు సాయం చేయాల్సిన బ్యాంకు ఖాతా నంబర్ 15671040000347733(పోతన ఆంజనేయులు), ఫోన్ పే : 79897 72877(పోతన పూర్ణ అనంతలక్ష్మి).

48 గంటల్లో నైరుతిలో కదలిక

» నేడు ఉత్తరకోస్తా, సీమకు భారీ వర్ష సూచన

» 20వ తేదీ తరువాత అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం గురువారం నాటికి ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా పరిసరాల్లో కొనసాగుతోంది. దీని నుంచి ఛత్తీస్‌గఢ్, విదర్భ, మరట్వాడ మీదుగా కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఈ ప్రభావంతో దక్షిణ భారతంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 48 గంటల్లో నైరుతి రుతుపవనాలు విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని పలు ప్రాంతాలకు విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఈ నెల 18, 19 తేదీల్లో వాయవ్య, దానికి ఆనుకుని మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరిస్తుందని, దాని ప్రభావంతో 20 తర్వాత అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం మన్యం, అల్లూరి, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. గురువారం రాత్రి 7 గంటల వరకు తూర్పుగోదావరి జిల్లా మలకపల్లిలో 64 మిల్లీమీటర్లు, పల్నాడు జిల్లా మాచర్లలో 61.7, కాకానిలో 55, చిత్తూరు జిల్లా రెడ్డిగుంటలో 54 మిల్లీమీటర్ల వాన పడింది.

పరీక్షలు మొదలయ్యాయి... స్టే ఇవ్వలేం

» మెగా డీఎస్సీ నిలిపివేతకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఉపాధ్యాయ నియామక పరీక్షలు ఇప్పటికే మొదలైనందున మధ్యలో నిలిపివేత కుదరదని తేల్చి చెప్పింది. ఏపీ మెగా డీఎస్సీని నిలిపివేయాలని కోరుతూ పి.ఆనంద్ సాయి 9న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గురువారం ఆ పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని జస్టిస్ మిశ్రా ప్రశ్నించగా, ఏపీ హైకోర్టుకు సెలవులు ఉన్నందున సుప్రీంకోర్టును ఆశ్రయించామని పిటిషనర్ తరఫు న్యాయవాది చారు మాథుర్ తెలిపారు. ఇది ఎంతోమంది జీవితాలతో ముడిపడిన అంశమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనల్ని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తప్పుబట్టారు. పరీక్షలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, లక్షలాది మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. వాదనల తర్వాత.. పరీక్షలు మొదలైన నేపథ్యంలో స్టే ఇవ్వడం కుదరదని చెబుతూ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. 16న హైకోర్టు తిరిగి ప్రారంభమవుతుందని, అందువల్ల పిటిషనర్ ఏదైనా ఉపశమనం కోసం హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. గతంలో ఏపీ డీఎస్సీని నిలిపివేయాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించిన విషయం తెలిసిందే.

ఉద్యోగుల అంకితభావానికి కార్లు బహుమతి

» చెన్నైలోని ఓ ప్రైవేటు సంస్థ యజమాని ఉదారత



సిబ్బందికి కారు బహూకరిస్తున్న యజమాని

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దం పాటు తమ వద్దే పని చేసి, సంస్థ అభివృద్ధికి అహరహం కృషి చేసిన ఉద్యోగులకు చెన్నైలోని 'అజిలిసియం' అనే సంస్థ కార్లు బహుమతిగా అందజేసింది. లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు అటానమస్ ఏజెంట్ ఏఐ భాగస్వామి అయిన ఈ సంస్థ దశమ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా.. ఆది నుంచీ సంస్థలో అంకితభావంతో పని చేసిన 25 మంది ఉద్యోగులను గుర్తించి, హ్యుండాయ్ క్రెటా ఎస్‌యూవీ మోడల్ కార్లను అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ సీఈవో రాజ్‌బాబు మాట్లాడుతూ.. తమ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు ఎంతో కృషిచేశారని, ఈ కార్లు తాము వారికిచ్చే బహుమతి కాదని, అది శాశ్వత విశ్వాసమని వ్యాఖ్యానించారు.

తిరుమల కొండపై ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

» అలిపిరిలో చెక్ పాయింట్ అభివృద్ధికి ప్రణాళికలు: టీటీడీ ఈవో

తిరుమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణించేందుకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచితం చేయనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తిరుమలలో ప్రైవేట్ వాహనదారులు అధిక మొత్తంలో భక్తుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తిరుపతి-తిరుమల మధ్య తిరిగే బస్సులు బస్టాండుకే పరిమితం కాకుండా తిరుమలలోని ముఖ్య ప్రాంతాలకూ నడపాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. ఈ సర్వీసును ఉచితంగా ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారని తెలిపారు. దాదాపు 150 బస్సులు తొలిదశలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కాగా, దేశవ్యాప్తంగా టీటీడీకి చెందిన 61 ఆలయాలు, ఆస్తులు ఉన్నాయని, వాటి నిర్వహణ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి అధికారులను నియమిస్తామన్నారు. టీటీడీలోని 21 మంది అన్యమత ఉద్యోగులకు ఇప్పటికే వీఆర్ఎస్ ఆప్షన్ ఇచ్చామని, ఒకవేళ వారు దానికి అంగీకరించకుంటే కోర్టుకు నివేదిస్తామన్నారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అలిపిరిలో చెక్ పాయింట్ అభివృద్ధిలో భాగంగా జీఎంఆర్ సంస్థకు చెందిన ఓ బృందం పరిశీలన చేసిందన్నారు. ఆధునాతన కెమెరాలు, స్కానర్లు అందుబాటులోకి తీసుకువచ్చి తనిఖీల నిరీక్షణ సమయాన్ని తగ్గిస్తామన్నారు. టీటీడీ ఈవోగా నియమితులై ఏడాది కావడంపై స్పందిస్తూ 'ఈ బాధ్యత మంచి అనుభూతి కలిగించింది. శ్రీవారు, సీఎం ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ మంచి నిర్ణయాలు తీసుకుని అమలుచేస్తున్నా. భవిష్యత్తులో ఇంకా మెరుగైన సేవలు అందిస్తాం' అని శ్యామలరావు తెలిపారు.



ఇప్పటి వరకు నా మంచితనమే చూశారు

రౌడీయిజం చేసేవారి ఆటలిక సాగనివ్వను.. బీ కేర్‌ఫుల్

మేమిస్తున్నది ఇవీ..

వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను, తాము అమలు చేస్తున్న పథకాలను చంద్రబాబు వివరించారు. వైసీపీ కంటే టీడీపీ కూటమి ప్రభుత్వం ఏటా ఎంత మంది ఎక్కువ లబ్ధిదారులకు.. ఎంత మొత్తం అదనంగా ఇచ్చిందో వెల్లడించారు.

రాక్షసుల్లా రాష్ట్రాన్ని నాశనం చేసే కుట్ర

11 సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదు

'తల్లికి వందనం' కింద ఒక్క రోజే 10 వేల కోట్లు: సీఎం

వైసీపీ కన్నా ఘనంగా..! (పథకాల వారీగా వైసీపీ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మొత్తం, లబ్ధిదారుల సంఖ్య)

కూటమి పథకం	వైసీపీ పథకం	కూటమి అదనంగా ఇచ్చింది
తల్లికి వందనం 67.27లక్షల మందికి రూ.10,091 కోట్లు	**అమ్మఒడి** 42.61 లక్షల మందికి 5,540కోట్లు	24.65లక్షల మందికి రూ.4,551 కోట్లు
ఎన్టీఆర్ భరోసా ఏడాదికి రూ.34వేల కోట్లు	**వైఎస్సార్ పెన్షన్ కానుక** ఏడాదికి రూ.21,630కోట్లు	రూ.12,370 కోట్లు
దీపం-2 ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు రూ.2,650 కోట్లు ఖర్చు	**లేదు**	
అన్న క్యాంటీన్లు 204 క్యాంటీన్లు ఏడాది కాలంలో సుమారు 4 కోట్ల మందికి భోజనాలు	**ఉన్నవి మూసేశారు**	
మత్స్యకారుల సేవలో 1,29,178 మందికి రూ.259 కోట్లు	**మత్స్యకార భరోసా** 1,09,231 మందికి రూ.109 కోట్లు	19,947 మందికి రూ.150కోట్లు



ఇక ఉపేక్షించను!



రౌడీమూకతో రైతుల పరామర్శా?

జగన్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోను

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'రౌడీయిజం చేసి పెత్తనం చేయాలనుకునే వారి ఆటలు సాగనివ్వను.. ఇప్పటి వరకు నా మంచితనమే చూశారు. ఇకపై ఉపేక్షించను. బీకేర్‌ఫుల్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా గురువారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లా పొదిలిలో రౌడీమూకలతో వెళ్లి రైతులను పరామర్శించిన జగన్‌పై మండిపడ్డారు. ప్రజాభద్రతకు, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోనని స్పష్టం చేశారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా వారికి బుద్ధి రాలేదన్నారు. సమస్యలను అధిగమించేందుకు తాము ప్రయత్నిస్తుంటే రాక్షసుల మాదిరి రాష్ట్రాన్ని అతలాకుతలం చేయాలని, శాంతిభద్రతల సమస్య సృష్టించి ప్రజలకు ఇబ్బందులు కలిగించాలని రకరకాల విన్యాసాలు చేస్తున్నారని, నేరాలు, ఘోరాలు చేసే వారికి అండగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘవిద్రోహ శక్తులకు అండగా ఉండే వారికి ప్రజలు ఎందుకు మద్దతివ్వాలని ప్రశ్నించారు. 'దేశంలో ఎక్కడైనా వైసీపీ లాంటి నేర మనస్తత్వంతో కూడిన రాజకీయ పార్టీని చూశారా? సొంత బాబాయిని చంపి.. అప్పటి సీఎంగా ఉన్న నా చేతిలో కత్తి పెట్టే ధైర్యం వచ్చిందంటే.. వారు ఎలాంటి నేరమనస్తత్వం కలిగి ఉన్నారో అర్థమవుతుంది. నింద వేసి దానిని నమ్మించడానికి పేపర్‌ను, టీవీని అడ్డం పెట్టుకున్నారు' అని దుయ్యబట్టారు. 'దేవతల రాజధాని అమరావతి.. ప్రజారాజధాని అమరావతి.. అలాంటి దాన్ని వేశ్యల రాజధాని అంటారా.. ఇలాంటి మాటలనేవారి ఇళ్లలో ఆడవాళ్లు లేరా.. అలాంటి మాటలు వింటే రక్తం మరగదా.. ఎంత కొవ్వెక్కితే ఇలాంటి మాటలు వస్తాయి? అమరావతిపై చేసిన మురికి వ్యాఖ్యలను పక్కదారి పట్టించేందుకే పొదిలి వెళ్లి గొడవ చేశారు. మహిళలపై దాడి చేశారు' అని విరుచుకుపడ్డారు. వైసీపీ వారు యువతను గంజాయికి బానిసల్ని చేస్తే.. తాము 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

సంక్షేమంలో మనమే టాప్!

ఎన్టీఆర్ భరోసా పేరుతో 2024-25కి రూ.34వేల కోట్ల పింఛన్లు పంపిణీ చేశాం. ఏడాదికి రూ.34వేల కోట్లను ఓ సంక్షేమ పథకానికి ఖర్చు చేస్తున్నది దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం మాత్రమే. ఇది దేశ చరిత్రలోనే రికార్డు. రూ.3వేలు ఉన్న పింఛన్‌ను ఒకేసారి 4వేలకు పెంచాం. సంవత్సరానికి ఇంత చొప్పున పెంచుకుంటూ పోతామనేది మా సిద్ధాంతం కాదు. ఏ రాష్ట్రమూ సంక్షేమంలో మన దరిదాపుల్లో లేదు. గతంలో పెన్షన్లు పంచేందుకే వలంటీర్లను తీసుకొచ్చారు. వారు లేకపోతే పెన్షన్లు పంపిణీ చేయలేమన్నారు. కానీ మేం అధికారంలోకి రాగానే 1వ తేదీనే గౌరవప్రదంగా పింఛనుదారులు ఎక్కడుంటే అక్కడకు వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం. 1వ తేదీ సెలవైతే ముందు రోజే ఇస్తున్నాం. పింఛన్ల పంపిణీపై ఐవీఆర్‌ఎస్ సర్వేలో 85 నుంచి 90 శాతం సంతృప్తి స్థాయి వస్తోంది. 67 లక్షల మంది పిల్లలకు రూ.10వేల కోట్లు ఒకేరోజు ఇచ్చిన రికార్డు ఏరాష్ట్రానికీ లేదు. 'తల్లికి వందనం' డబ్బులను పేదరికం నుంచి బయటకు వచ్చేందుకు వినియోగించుకోవాలి. ఎప్పటికీ ప్రభుత్వాలపై ఆధారపడే పరిస్థితి రాకూడదనేది నా ఆశ.

చేతల్లో చేసి చూపించాం..

ఎన్నికల ప్రచార సమయంలో అభివృద్ధి, సంక్షేమం ఎన్డీయేకి రెండు కళ్లని చెప్పాను. ఆ మాటను అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో నూటికి నూరుపాళ్లూ అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. మేం అధికారంలోకి వచ్చాక.. చాలామంది.. పూర్తిగా విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడినపెట్టగలరా అని ప్రశ్నించారు. కానీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపించడాన్ని ఓ యజ్ఞంలా భావించి ముందుకెళ్తున్నాం. సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచి దాన్ని అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేస్తామని చెప్పాం. మాటల్లో చెప్పడం కాకుండా చేతల్లో చేసి చూపించాం.

బటన్ నొక్కుతున్నామని మభ్యపెట్టారు

అన్నదాతా సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో రూ.14వేలు ఇస్తామని చెప్పాం. కేంద్రం ఈ నెల 20న రూ.6వేలు వేస్తుంది. అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం కూడా వేస్తుంది. మేం రూ.14వేలు ఇస్తుంటే వైసీపీ వాళ్లురూ.7,500 ఇచ్చేవారు. మేం అదనంగా రూ.6,500 ఇస్తున్నాం. బటన్ నొక్కుతున్నానని ప్రజలను మభ్యపెట్టిన వైసీపీ కన్నా మేమిచ్చే సంక్షేమమే మిన్న. వారి హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఛిన్నాభిన్నం చేశారు. మద్యనిషేధం అన్నవారే మద్యం ఆదాయాన్ని 25ఏళ్లకు తాకట్టు పెట్టారు. అప్పులు తెచ్చారు. ఎమ్మార్వో ఆఫీసులు తాకట్టు పెట్టారు. 1వ తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారు. 94 కేంద్ర పథకాలను అటకెక్కించారు. ఆర్థిక వ్యవస్థను నీరుగార్చారు. ఈ పరిస్థితిని మా ప్రభుత్వం చక్కదిద్దుకుంటూ వస్తోంది. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడానికి ఎన్ని ఇబ్బందులున్నా అధిగమించే ప్రయత్నాలు చేస్తుంటే.. రాక్షసులు అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. ఏడాదిలో ఎన్నో పథకాలు వైసీపీ కన్నా మిన్నగా అమలుచేశాం. సుపరిపాలనలో ఇది తొలి అడుగు మాత్రమే.

> రైతుల పరామర్శకు 10-15 వేల మందితో బలప్రదర్శనగా వెళ్లి రౌడీయిజం చేస్తారా? రౌడీమూకలతో వెళ్లి రైతులను పరామర్శిస్తారా?
>
> ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది చాలక.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక.. రాక్షసుల మాదిరిగా రాష్ట్రంపై కుట్రలు చేస్తున్నారు.
>
> కష్టాలు వచ్చినప్పుడు కాడికింద పడేయడం నా నైజం కాదు. విధ్వంస రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపించడాన్ని ఓ యజ్ఞంలా భావించి ముందుకెళ్తున్నాం.
>
> - సీఎం చంద్రబాబు

మాట నిలబెట్టుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా తల్లికి వందనం అమలుపై గురువారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్‌తో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "నాడు ఒక ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరికి మాత్రమే ఇవ్వడం సరికాదని చెప్పాం. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తామని చెప్పాం. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైనది తల్లికి వందనం. నేడు దాన్ని అమలు చేస్తున్నాం. సుమారు 67లక్షల మంది పిల్లలకు రూ.10,091కోట్లు ఖర్చవుతుంది. ఇందులో రూ.1346 కోట్లు పాఠశాలల అభివృద్ధికి వెళుతుంది. అమ్మఒడి నిబంధనలే తల్లికి వందనం పథకానికీ వర్తింపచేస్తున్నాం. అయితే వైసీపీ ఇంట్లో ఒక్క పిల్లవాడికే ఇస్తే మేం ఎంతమంది ఉన్నా ఇస్తున్నాం. వైసీపీ హయాంలో 42 లక్షల మందికి అమ్మఒడి ఇస్తే, మా ప్రభుత్వం 67 లక్షల మందికి ఇస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో కన్నా 24.65 లక్షల మందికి అదనంగా ఇస్తున్నాం. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం పిల్లల అడ్మిషన్లు పూర్తయితే వారికి కూడా డబ్బులు వేస్తాం. తల్లిలేని పిల్లలకు వారి తండ్రి లేదా గార్డియన్ ఖాతాలో డబ్బులు వేస్తాం. అనాథ పిల్లలు అయితే జిల్లా కలెక్టర్ నిర్ధారించిన ఖాతాలో వేస్తాం. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 76వేల మందికి కూడా తల్లికి వందనం ఇస్తున్నాం. పథకంలో పారదర్శకత కోసం జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే జూన్ 26 లోపు ఫిర్యాదులు తీసుకుని 30న తుది జాబితా ప్రకటిస్తాం" అని చంద్రబాబు వివరించారు. తల్లికి వందనం తీసుకునే వారిలో బీసీలే ఎక్కువని చంద్రబాబు తెలిపారు. "బీసీలు 29లక్షల మంది, ఎస్సీలు 11 లక్షలు, ఎస్టీలు 4 లక్షలు, మైనార్టీలు 66,500, ఈబీసీలు 8లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక బిడ్డ ఉన్న తల్లులు 18,55,760 మంది, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322, ముగ్గురు బిడ్డలున్న తల్లులు 2,10,684, నలుగురు పిల్లలు ఉన్న తల్లులు 20,053 మంది ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ చిల్డ్రన్ హోమ్స్, ప్లే ఏరియా వంటివి ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

9.5 లక్షల కోట్ల పెట్టుబడులు

"గడిచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఈ సంవత్సరంలో తీసుకురాగలిగాం. రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. దేశీయ పెట్టుబడుల్లో ఏపీ భారతదేశంలోనే నంబర్ 1గా ఉంది. 16 శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. టీసీఎస్, ఎల్జీ, ఎన్టీపీసీ గ్రీన్, ఆర్సెలార్ మిట్టల్, బీపీసీఎల్, రిలయన్స్ రెన్యూపవర్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగాం. రైల్వే జోన్ సాధించాం. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేసుకోగలిగాం. తల్లికి వందనం పథకంలో ఇద్దరు పిల్లలు ఉంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు జమ చేస్తాం. ఓవైపు ఉద్యోగ, ఉపాధి కల్పన, అభివృద్ధి.. మరోవైపు సంక్షేమం అమలు చేస్తూ ప్రజలు ఏ ఆశతో కూటమికి 94 శాతం సీట్లు ఇచ్చి గెలిపించారో ఆ ఆశలు నెరవేర్చే దిశగా ముందుకెళుతున్నాం" అని లోకేశ్ పేర్కొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి జోడెద్దుల బండి: లోకేశ్

సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దుల బండిలాంటిదని మంత్రి లోకేశ్ అన్నారు. "ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచి ప్రజాపాలన ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్నాం. సుపరిపాలనలో తొలి అడుగు పడింది. విధ్వంస పాలన నుంచి వికాసం వైపు మన ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించింది. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తోంది.మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేస్తున్నాం. డీఎస్సీని ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసింది. ఈ రోజుతో 24వ కేసును కూడా సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. అన్నింటినీ ఎదుర్కొని డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం" అని అన్నారు.

ఏడాది పాలనలో చంద్రబాబు సాధించిందేమీ లేదు



సూపర్ సిక్స్‌కు ఇప్పటికీ దిక్కులేదు

- రాష్ట్రాన్ని మోసం చేస్తున్న బీజేపీకి మద్దతు ఎందుకిస్తున్నారు?: షర్మిల

అమరావతి, కడప, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపితే.. ఇప్పుడు చంద్రబాబు ఏడాది పాలనంతా గొప్పలు చెప్పడానికే సరిపోయింది. ఆయన ఏడాది పాలనంతా 3డీ గ్రాఫిక్స్ మాయాజాలమే. ప్రజలకు ఇప్పటి వరకూ ఒనగూరిందేమీ లేదు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. గురువారం విజయవాడ, కడప, నంద్యాలలో పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల హామీల్లో ప్రధానమైన సూపర్ సిక్స్‌కి నేటికీ దిక్కు లేదు. తల్లికి వందనంలో 87 లక్షల మంది విద్యార్థులుంటే ఇప్పుడు 67 లక్షల మందికి ఇవ్వడం మోసం చేయడమే. జగన్ సర్కారు విద్యుత్ భారం రూ.32 వేల కోట్లు మోపితే.. బాబు ఏడాది పాలనలో రూ.17 వేల కోట్లు భారం మోపారు. రాజధాని పేరుతో చంద్రబాబు దాదాపు రూ.80వేల కోట్లు అప్పులు తెచ్చారు. ఈ అప్పులు ఎవరు తీర్చాలి? రాష్ట్రాన్ని మోసం చేస్తున్న బీజేపీకి మద్దతు ఎందుకిస్తున్నారు? బీజేపీని ఎదుర్కొనే సత్తా, దమ్ము ఉన్న పార్టీ కాంగ్రెస్. కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాష్ట్రానికి ప్రత్యామ్నాయం. ప్రాంతీయ పార్టీలతో ప్రజలకు ప్రయోజనం శూన్యం' అని షర్మిల అన్నారు.

ఏడాది పాలనలో మైనార్టీలకు మహర్దశ

- మంత్రి ఫరూక్ ఉద్ఘాటన

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలవగా, కూటమి ప్రభుత్వం సుపరిపాలనవైపు వేగంగా ముందుకు వెళ్తోందని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, మైనార్టీ నాయకులు మంత్రిని కలిసి అభినందించారు. ఫరూక్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పారు. బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.5,434 కోట్లు కేటాయించామని, గత ప్రభుత్వం నిలిపివేసిన సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేశామని తెలిపారు.

67,27,164 మంది విద్యార్థులకు 'తల్లికి వందనం'

- తొలివిడతలో 54,94,703 మందికి నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- మలివిడతలో జూలై 5న పంపిణీ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పథకం అమలుకు పరిపాలనా అనుమతులు, మార్గదర్శకాలపై గురువారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 విద్యా సంవత్సరంలో 67,27,164 మంది విద్యార్థులకు పథకం అమలు చేయనున్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు పేర్కొంది. ఆ విద్యార్థుల తల్లులు సుమారు 42,69,459 మంది ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపింది. తొలివిడతలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 54 లక్షల మందికి పైగా లబ్ధిదారుల నగదును తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ప్రభుత్వం ఇస్తోందని, అయితే అందులో రూ.2 వేలు పాఠశాలలు, జూనియర్ కాలేజీల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ పనుల కోసం కలెక్టర్ల ఖాతాలో జమ చేయనున్నట్లు వివరించింది. దీంతో ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. లబ్ధిదారులను సంబంధిత సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా గుర్తించింది. విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఇచ్చే నగదులో పాఠశాలలకు చెల్లించాల్సిన ఫీజులు మినహాయించుకుని మిగిలింది తల్లుల ఖాతాలలో జమ చేస్తామని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి ఉపకార వేతనాలు పొందే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉపకారవేతనాల నగదు పోగా మిగిలింది తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని వివరించింది. గతంలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు అమ్మఒడి వర్తించేది కాదు. ఇప్పుడు ఒకటో తరగతిలో చేరినవారికి, జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ఫస్టియర్‌లో చేరినవారికి కూడా పథకం వర్తింపజేస్తున్నారు. మొత్తం 11,19,750 మంది లబ్ధిదారులు ఉన్నట్టు అంచనా. ఇక ఇంటింటి సర్వేలో కనిపించని 1,12,711 మందికి మరోసారి పరిశీలన అనంతరం పథకం అమలు చేస్తారు.

పథకం షెడ్యూలు

54,94,703 మంది విద్యార్థుల నగదు జమ	జూన్ 12
అర్హులు, అనర్హుల జాబితాల ప్రదర్శన	జూన్ 12
సచివాలయాల ద్వారా అభ్యంతరాలు, వినతుల స్వీకరణ	జూన్ 12-20
సప్లిమెంటరీ అర్హుల జాబితా రూపకల్పన	జూన్ 21-28
ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థుల జాబితాల ప్రదర్శన	జూన్ 30
మిగిలిన అర్హులకు నగదు పంపిణీ	జూలై 5

కార్పొరేషన్ల వారీగా లబ్ధిదారులు

కార్పొరేషన్	విద్యార్థులు	తల్లులు
ఏపీ మైనారిటీ కార్పొరేషన్	66,414	41,194
ఆర్యవైశ్య కార్పొరేషన్	50,740	35,753
బీసీ ఎ- కార్పొరేషన్	10,29,424	6,55,624
బీసీ బి- కార్పొరేషన్	6,75,618	4,42,688
బీసీ సి- కార్పొరేషన్	12,761	8,521
బీసీ డి- కార్పొరేషన్	8,62,381	5,67,187
బీసీ ఇ- కార్పొరేషన్	4,01,825	2,50,658
బ్రాహ్మణ కార్పొరేషన్	16,998	12,645
ఈబీసీ కార్పొరేషన్	48,606	31,753
కమ్మ కార్పొరేషన్	90,876	63,659
కాపు కార్పొరేషన్	4,52,221	3,00,392
క్షత్రియ కార్పొరేషన్	13,654	9,665
రెడ్డి కార్పొరేషన్	1,70,937	1,15,445
ఎస్సీ కార్పొరేషన్	11,75,918	7,43,403
ఎస్టీ కార్పొరేషన్	4,26,330	2,65,872

నగదు చెల్లింపు విధానం

ప్రతి తల్లి లేదా గార్డియన్ ఆధార్ సీడింగ్ పూర్తి చేసుకోవాలి. ఆధార్ సీడ్ అయిన బ్యాంకు ఖాతాలకే నగదు జమ అవుతుంది. సింగిల్ పేరెంట్ ఉంటే తండ్రి ఖాతాకు నగదు వెళ్తుంది. అనాథ పిల్లల నగదును జిల్లా కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసి, ఆతర్వాత పరిశీలన అనంతరం పంపిణీ చేస్తారు.

నగదు జమ ప్రారంభం

తల్లికి వందనం నగదు జమ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా గురువారమే 54 లక్షల మందికి పైగా లబ్ధిదారుల నగదును తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా... రాత్రికి అక్కడక్కడా కొందరికి నగదు జమైంది. శుక్రవారం సాయంత్రానికి ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం పథకం నిధులను బ్యాంకులకు పంపింది. అర్హులు, అనర్హుల జాబితాలను గురువారం ఉదయం గ్రామ, వార్డు సచివాలయాలకు పంపింది.

పథకానికి అర్హతలు

- కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు దాటకూడదు.
- కుటుంబ సభ్యుల్లో కనీసం ఒక్కరైనా రైస్ కార్డు కలిగి ఉండాలి.
- 3 ఎకరాలకు మించి మాగాణి, 10 ఎకరాలకు మించి మెట్ట సాగు భూమి ఉండకూడదు. రెండూ కలిపినా పది ఎకరాలు దాటకూడదు.
- నాలుగు చక్రాల సొంత వాహనం ఉండకూడదు (టాక్సీ, ట్రాక్టర్, ఆటోలకు మినహాయింపు).
- విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటకూడదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు అనర్హులు.
- ఆదాయపన్ను చెల్లించేవారు అనర్హులు.
- రాష్ట్ర హౌస్‌హోల్డ్ డేటాబేస్‌లో నమోదై ఉండాలి. విద్యార్థి నమోదై, తల్లి నమోదు కాకపోతే పరిశీలన చేసి ఎంపిక చేస్తారు.
- ఐటీఐ, పాలిటెక్నిక్, ఆర్జీయూకేటీల్లో చదివే విద్యార్థులకు పథకం వర్తించదు.
- విద్యార్థికి కచ్చితంగా 75 శాతం హాజరు ఉండాలి. ఈ ఏడాది 75 శాతం ఉంటేనే వచ్చే ఏడాది పథకం వర్తిస్తుంది.

ముఖ్యమైన జీవోలు అర్ధరాత్రా?

సీఎం చెప్పినా 'తల్లికి వందనం' జీవో ఆలస్యం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో ముఖ్యమైన జీవోలు అర్ధరాత్రి సమయాల్లో జారీ కావడం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన మెగా డీఎస్సీ జీవో అర్ధరాత్రి విడుదలైంది. కీలకమైన టీచర్ల బదిలీ జీవో కూడా అదే సమయంలో విడుదల చేశారు. ఇక తల్లికి వందనం పథకంపై బుధవారం జీవో విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశిస్తే పాఠశాల విద్యాశాఖ అధికారులు గురువారం ఉదయం విడుదల చేశారు. జీవో విడుదలైన తర్వాత హడావిడిగా సచివాలయాలకు అర్హులు, అనర్హుల జాబితాలు పంపారు. కొన్నిచోట్ల మధ్యాహ్నం వరకూ సమాచారం చేరలేదు. ఇలా ముఖ్యమైన జీవోలు ఆలస్యంగా విడుదల చేయడంతో క్షేత్రస్థాయిలో గందరగోళం ఏర్పడుతోంది.

విమాన దుర్ఘటనతో.. ఏడాది వేడుకలు రద్దు

- సీఎం నేటి విశాఖ పర్యటన కూడా..

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నేపథ్యంలో ప్రభుత్వం గురువారం రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించ తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం రద్దయింది. మొదట దీనిని శుక్రవారానికి వాయిదావేశారు. అయితే పూర్తిగా రద్దు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం నాటి తన విశాఖపట్నం పర్యటనను కూడా రద్దు చేసుకున్నారు. అక్కడ ఆయన న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ రీజనల్ వర్క్‌షాపులో పాల్గొనాల్సి ఉంది.

బ్రిస్బేన్‌లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఎన్నారై టీడీపీ, స్థానిక తెలుగు సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, నారా రోహిత్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నందమూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు. చిత్రంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ , మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, పిల్లి మాణిక్యాలరావు, దారపనేని నరేంద్ర తదితరులు ఉన్నారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి



మరణ విహంగం

గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం 290 మంది దుర్మరణం

ఘటనా స్థలంలో భీతావహ దృశ్యాలు







ప్రమాదంలో ధ్వంసమైన బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ మెస్ భవనం, మృతదేహాలను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

అహ్మదాబాద్, జూన్12: గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గాట్విక్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం(ఏఐ-171) కూలిపోయిన ఘటనలో 290మంది దుర్మరణంపాలయ్యారు. టేకాఫ్ సమయంలో సీటు బెల్టులు పెట్టుకున్న ప్రయాణికుల మృతదేహాలు.. భారీ ప్రమాదంతో కాలిపోయి, చెల్లా చెదురుగా మృతదేహాలు పడిపోయాయి. కాలిపోయి, బిగుసుకుపోయిన స్థితిలో రోడ్డుపై మృతదేహాలు కనిపించాయి. కొందరి శరీరాలు పూర్తిగా అగ్నికి ఆహుతవ్వగా.. తల, కాళ్లు, చేతులు విడిపోయి కనిపించాయి. కడపటి వార్తలందేసరికి 50మృతదేహాలు మాత్రమే లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. మిగతా వారి మృతదేహాలు పూర్తిగా కాలిపోయే ప్రమాదమున్నందున.. సంఘటనా స్థలి వద్ద నమూనాల సేకరణ జరిగే నిమిత్తం సైన్యంతో పహారా ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు, 10 మంది విమాన సిబ్బంది ఉన్నారు. వారిలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు రమేశ్ విశ్వాస్‌కుమార్, మరో ప్రయాణికుడు మినహా.. మిగతా వారంతా చనిపోయారు. మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమానం టేకాఫ్ అయిన 59 సెకన్లలోనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు విమానాశ్రయంలోని సీసీటీవీ ఫుటేజీ స్పష్టం చేస్తోంది. అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ జీఎస్ మాలిక్, కేంద్ర విమానయాన వర్గాల కథనం ప్రకారం.. ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.38కి టేకాఫ్ అయ్యింది. సెకన్ల వ్యవధిలోనే.. విమానం 825 అడుగులకు ఎగిరాక.. పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్ 'మేడే కాల్(సహాయాన్ని కోరడం)' ఇచ్చారు. దీంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) సిబ్బంది స్పందించేలోగా విమానం 625అడుగుల ఎత్తుకు పడిపోయింది. అప్పటి నుంచి పైలట్ల ద్వారా సంకేతాలు కట్ అయ్యాయి. టేకాఫ్ అయిన 59వ సెకనుకు.. విమానం ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలోని జనావాసాలపై కుప్పకూలిపోయింది. ఓ వైద్య కళాశాల హాస్టల్ భవనంపై పడింది. భవనానికి ముందువైపు విమానం తోకభాగం, వెనకవైపు తల భాగం ఉండడాన్ని బట్టి, ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అంతకు ముందు విమానం ఓ చెట్టును ఢీకొన్నట్లు అధికారులు చెబుతున్నారు. "పెద్ద ఎత్తున వ్యాపించిన మంటల కారణంగా ఎవరినీ రక్షించలేకపోయాం" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. చూస్తుండగానే.. ఆ ప్రాంతంలో మంటలు వ్యాపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దట్టమైన పొగ ఐదారు కిలోమీటర్ల దూరం వరకు కనిపించిందని పేర్కొన్నారు. బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌కు ఇంధన సామర్థ్యం ఎక్కువ(1.25 లక్షల లీటర్లు)గా ఉంటుంది. ఫుల్ ట్యాంక్ కారణంగా భారీ పేలుడు సంభవించడమే కాకుండా.. మంటలు వేగంగా వ్యాపించాయి. రంగంలోకి దిగిన ఫైరింజన్లు గంటపాటు శ్రమించి, మంటలను ఆర్పివేసినా.. భారీ ప్రాణనష్టం చోటుచేసుకుంది. దుర్ఘటన జరిగిన సమయంలో ఆ విమానంలో 230 మంది ప్రయాణికులు, 10 మంది విమాన సిబ్బంది, పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కోపైలట్/ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుందర్ ఉన్నారు. 169 మంది భారతీయులు, 53మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ పాస్‌పోర్టు హోల్డర్లు, ఒక కెనెడియన్ ఉన్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. మెడికల్ కాలేజీ విద్యార్థులకు సరిగ్గా 1-2గంటల మధ్య మధ్యాహ్న భోజన సమయం కావడంతో.. మెడికోలు హాస్టల్ పైఅంతస్తులోని మెస్‌లో భోజనం చేస్తున్నారు. అదే సమయంలో విమానం పడడంతో 50 మంది మృతిచెందినట్లు దైనిక్ భాస్కర్ గుజరాతీఎడిషన్ 'దివ్య భాస్కర్' పేర్కొంది. పదుల సంఖ్యలో గాయపడినట్లు రిపోర్ట్ చేసింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అహ్మదాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముందు జాగ్రత్త చర్యగా వడోదరలోని సయాజీ ఆస్పత్రి నుంచి 137 యూనిట్ల రక్త నిల్వలను తెప్పించినట్లు అధికారులు తెలిపారు. అయితే, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. సహాయక చర్యల కోసం ఆరు ఎన్‌డీఆర్ఎఫ్, రెండు బీఎస్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు. ఈ ప్రమాదానికి బాధ్యులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



విమానం కూలిన ప్రాంతం నుంచి వస్తున్న పొగ

ఏఏఐబీ, డీజీసీఏ దర్యాప్తు

విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) రంగంలోకి దిగిందని పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఏఏఐబీ డీజీ, ఇతర అధికారులు సంఘటనాస్థలికి చేరుకుని, పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై సమీక్ష నిర్వహించారు. అటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) కూడా ప్రమాదంపై దర్యాప్తును ప్రారంభించింది. ప్రమాదానికి కారణాలింకా తెలియరాలేదని పేర్కొంది. కెప్టెన్ సుమిత్ సభర్వాల్‌కు 8,200గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల మేర విమానాలను నడిపిన అనుభవం ఉందని వివరించింది. అహ్మదాబాద్ విమానాశ్రయంలోని రన్‌వే 23 నుంచి విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపట్లోనే విమానం కూలిపోయినట్లు వివరించింది. పైలట్ 'మేడే కాల్' ఇచ్చిన కాసేపటికే.. ఏటీసీ సిబ్బంది మార్గదర్శనం చేస్తుండగా సిగ్నల్స్ తెగిపోయాయని వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్‌లైన్ నంబర్ 1800-5691444నుఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రమాదం జరిగిన తర్వాత విమానాశ్రయంలో సేవలను నిలిపివేశామని, సాయంత్రం 4 గంటల సమయంలో పునరుద్ధరించినట్లు వెల్లడించింది. పౌరవిమానయాన సంస్థ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల కుటుంబ సభ్యులు 011-24610843, 9650391589, 9978405304, 070-23251900, 9974111327లకు ఫోన్ చేసి, వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొంది.

దర్యాప్తునకు సహకరిస్తాం: అమెరికా

విమాన ప్రమాదంపై దర్యాప్తునకు భారత అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) తెలిపింది. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు బృందాలు దర్యాప్తునకు సహకరిస్తాయని పేర్కొంది.

ఆకాశమే కూలినంత శబ్దం.. భారీ విస్ఫోటనం.. కన్ను మూసి తెరిచే సరికి అంతా విధ్వంసం.. తెగిపడ్డ తలలు, ముక్కలైన శరీరాలు.. మాంసపు ముద్దలు.. 90 శాతానికి పైగా కాలిపోయిన మృతదేహాలు..

ఎటు చూసినా చిందరవందరగా పడి ఉన్న విమాన శకలాలు.. పేలుడు, అగ్నికీలల ధాటికి కమ్మేసిన పొగ.. మంటల్లో కాలి నల్లగా మసిబారిన భవనాలు.. కాలి బూడిదైన చెట్లు, వాహనాలు..!!

ఆ ప్రాంతాన్ని చూసిన వారెవరైనా సరే ఒక్క క్షణం నిశ్చేష్టులయ్యేంత భయోత్పాతం. ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ మెస్, పరిసర ప్రాంతాల వద్ద పరిస్థితి ఇది.

భయానకం.. బీభత్సం!

ప్రమాదం అనంతరం అంబులెన్సు, ఫైరింజన్ల సైరన్ల మోతతో ఆ ప్రాంతంలో ఉద్విగ్న వాతావరణం నెలకొనగా.. సహాయక చర్యలు జరుగుతున్న కొద్దీ.. ఆ ప్రాంతాన్ని మృత్యుదేవత కబళించిందేమో అనేలా పరిణామాలు మారాయి.

విమానం కూలి పేలుడు సంభవించి అగ్నికీలలు ఎగసిపడుతుండగా.. ఆకాశాన్నే మింగేసే అంత నల్లటి దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. మెస్ భవనం పైకప్పు కూలిపోయి.. ఆ భవనం పూర్తిగా ధ్వంసమవ్వగా.. మెస్ వంట గదిలోని సామగ్రి, వస్తువులు కూడా బుగ్గి అయ్యాయి.

విమానం టేకాఫ్ అయిన కాసేపటికే ప్రమాద జరగ్గా.. విమానంలోని భారీగా ఉన్న ఇంధనం వల్ల పేలుడు తీవ్రత కూడా అధికంగా ఉంది. మెస్ భవనంతోపాటు చుట్టు పక్కల ఉన్న కొన్ని భవనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. మెస్ భవనం చుట్టుపక్కల నిలిపి ఉంచిన వాహనాలు, పరిసరాల్లోని చెట్లు కాలిపోయాయి.

ప్రమాదం జరిగిన తీరును కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వివరిస్తున్న రామ్మోహన్ నాయుడు



మొత్తం ప్రయాణికులు	: 230
భారతీయులు	: 169
బ్రిటిషర్లు	: 53
పోర్చుగీసు పౌరులు	: 7
కెనెడియన్లు	: 1
విమాన సిబ్బంది	: 12
పైలట్, కోపైలట్	: 2
సీనియర్ సిబ్బంది	: 2
ఇతర క్రూ సభ్యులు	: 8
పైలట్ అనుభవం	: 8,200 గంటలు
కో పైలట్ అనుభవం	: 1,100 గంటలు

ప్రమాదానికి గురైన విమానం వివరాలు

ఫ్లైట్ నంబర్	: ఏఐ171/ఏఐసీ171
విమానయాన సంస్థ	: ఎయిరిండియా
ఎయిర్‌క్రాఫ్ట్ పేరు	: బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్
బయల్దేరిన స్థానం	: అహ్మదాబాద్
గమ్యస్థానం	: లండన్
ఎన్నిగంటల్లో చేరాలి	: 9 గంటల 2 నిమిషాలు
గ్రౌండ్ స్పీడ్	: 174 కేటీఎస్
వెర్టికల్ స్పీడ్	: 896 ఎఫ్‌పీఎం

మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు

మృతదేహాలతో అహ్మదాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీ నిండిపోయింది. ఓ వైపు బంధుమిత్రుల ఆర్తనాదాలు, మరోవైపు క్షతగాత్రుల హాహాకారాలతో ఆస్పత్రి ప్రాంగణంలో భయానక పరిస్థితులు కనిపించాయి. విమాన ప్రమాదంలో మృతిచెందిన 241 మందిని గుర్తించేందుకు సాయంత్రం 5 గంటల నుంచి ఆస్పత్రిలో డీఎన్ఏ పరీక్షలను ప్రారంభించారు. డీఎన్ఏ నమూనాలు ఇచ్చేందుకు మృతుల బంధుమిత్రులు బాధాతప్త హృదయాలతో క్యూలైన్‌లో నిలబడ్డ దృశ్యాలు అక్కడి వారిని కలిచివేశాయి. డీఎన్ఏ నమూనాల సేకరణకు సమయం పడుతుందని గుజరాత్ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ధనుంజయ్ ద్వివేది మీడియాకు తెలిపారు. మృతుల తల్లిదండ్రులు లేదా పిల్లలు లేదా సమీప రక్తసంబంధీకులు నమూనాలను ఇవ్వాలని కోరారు. చికిత్స పొందుతున్న మెడికోల పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

హుటాహుటిన అహ్మదాబాద్‌కు రామ్మోహన్ నాయుడు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే విజయవాడలో ఉన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో అహ్మదాబాద్ బయలుదేరి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించ తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన ఆయన... దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన బయలుదేరి అహ్మదాబాద్ వెళ్లారు. ప్రమాదస్థలానికి చేరుకుని, అక్కడ పరిస్థితిని పర్యవేక్షించారు.

ఆ గణేశుడే రక్షించాడు

ప్రమాదానికి గురైన విమానం ఎక్కలేక పోయిన ఓ మహిళ భావోద్వేగం

ట్రాఫిక్‌లో చిక్కుకుని విమానాశ్రయానికి 10 నిమిషాలు ఆలస్యంగా చేరుకోవడమే ఓ మహిళకు వరమైంది. ఎయిరిండియా విమానాన్ని ఎక్కలేకపోవడంతో ఆమె ప్రాణాలతో మిగిలింది. ఇలా 10 నిమిషాల ఆలస్యం భూమి చౌహాన్ అనే మహిళ ప్రాణాన్ని నిలబెట్టింది. భర్తతో కలిసి లండన్‌లో నివాసముంటున్న భూమి చౌహాన్ రెండేళ్ల తర్వాత ఇటీవల స్వదేశానికి వచ్చారు. పనులు ముగించుకుని ఒంటరిగా లండన్ తిరుగుప్రయాణమైన ఆమె.. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం ఎక్కాల్సింది. కానీ, విమానాశ్రయానికి 10 నిమిషాలు ఆలస్యంగా చేరుకోవడంతో ఫ్లైట్ మిస్సయ్యారు. అయితే, ప్రమాద వార్త తెలిసిన వెంటనే తన నోట మాట రాలేదని భూమి చౌహాన్ విలేకరులతో అన్నారు. తాను పూజించే వినాయకుడే తనని రక్షించాడని ఆమె భావోద్వేగంగా చెప్పారు.



మృత్యుంజయుడు.. రమేశ్



ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలోని ఓ ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. వందల మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన నుంచి తప్పించుకున్న రమేశ్ విశ్వాస్‌కుమార్(40) మృత్యుంజయుడిగా నిలిచాడు. విమానం నేలకూలిన వెంటనే బయటికొచ్చిన రమేశ్.. ప్రాణభయంతో ఘటనాస్థలి నుంచి దూరంగా వెళుతుండగా చుట్టుపక్కల వారు అతనిని వీడియో కూడా తీశారు. విమానంలో 11ఏ సీటులో కూర్చున్న రమేశ్.. బోర్డింగ్ పాస్ ఇంకా అతని వద్దే ఉంది. "విమానం టేకాఫ్ అయిన 30 సెకండ్లకు పెద్ద శబ్దం వచ్చింది. ఆ వెంటనే విమానం కూలిపోయింది. కళ్లు తెరిచి చూసేసరికి నా చుట్టూ మృతదేహాలే ఉన్నాయి. వెంటనే పైకి లేచి పరుగెత్తా" అని రమేశ్ పేర్కొన్నారు. ప్రమాదంలో రమేశ్ కళ్లు, వీపు, కాళ్లు, చేతులకు గాయాలవ్వగా.. కొన్ని శరీర భాగాలకు కాలిన గాయాలయ్యాయి. కాగా, భవన నిర్మాణ కార్మికుడైన రమేశ్ భలియా... బ్రిటన్ పౌరుడు. 20 ఏళ్లుగా లండన్‌లోనే ఉంటున్న ఆయన కుటుంబసభ్యులను కలిసేందుకు ఇటీవల భారత్‌కు వచ్చిన రమేశ్, అతని సోదరుడు అజయ్‌కుమార్(45)తో కలిసి లండన్ తిరుగు ప్రయాణమయ్యారు. ప్రమాదం తర్వాత అజయ్ ఆచూకీ తెలియరాలేదు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం

బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించి ఇస్తాం: టాటా గ్రూపు

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 12: అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూపు రూ.కోటి చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. గాయపడినవారికి ఉచిత వైద్య సహాయం అందిస్తామని తెలిపింది. విమానం కూలడంతో ధ్వంసమైన బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించి ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు టాటా సన్స్ చైర్‌పర్సన్ చంద్రశేఖరన్ ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి సహాయం అందించడంపై దృష్టి కేంద్రీకరించామని, ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. ఘటనా స్థలంలో సహాయ బృందాలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. పెను విషాదంతో ఎయిరిండియా ఎంతో వేదనను అనుభవిస్తోందని ఆ సంస్థ సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తమ సంస్థ తరఫు నుంచి ప్రత్యేక బృందాలు అహ్మదాబాద్ చేరుకున్నాయని తెలిపారు.

అన్ని విభాగాలతో కలిసి నిరంతరం పనిచేస్తున్నాం

» బాధిత కుటుంబాలకు సహకరిస్తున్నాం: అదానీ

అహ్మదాబాద్, జూన్ 12 : విమాన ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని అదానీగ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ నిర్విరామంగా పనిచేస్తున్నామని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ మద్దతుగా నిలుస్తున్నామని అదానీ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, అహ్మదాబాద్ విమానాశ్రయ నిర్వహణను అదానీ గ్రూపు చూస్తోంది. ప్రమాదం జరిగినందున ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు.



ప్రమాదం తర్వాత విమాన శకలాలను పరిశీలిస్తున్న సహాయక సిబ్బంది

అదే చివరి సిగ్నల్...!

ఫ్లైట్ రాడార్ నుంచి కీలక సమాచారం

ఎయిర్ ట్రాఫిక్‌ను రియల్‌టైమ్‌లో చూపించే లైవ్ ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్ రాడార్.. ఈ ప్రమాదానికి సంబంధించి కొంత కీలక డేటాను అందించింది. 'టేకాఫ్ అయిన కొన్ని సెకన్ల తర్వాత ఆ విమానం నుంచి మాకు చివరి సిగ్నల్ అందింది. బోయింగ్ 787-8 ప్రమాదంలో ఉన్నట్టు తెలిసింది' అని ఫ్లైట్ రాడార్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. ప్రమాద సమయంలో విమానం భూమి నుంచి 625 అడుగుల ఎత్తులో ఉన్నట్టు ఫ్లైట్ రాడార్ డేటా సూచిస్తోంది. విమానం వెర్టికల్ స్పీడ్ 896 ఫీట్ పర్ మినిట్‌గా నమోదైంది.



డ్రీమ్‌లైనర్.. డిజాస్టర్!

బోయింగ్ 787 విమానం అత్యాధునికం.. సాంకేతిక సమస్యలూ అత్యధికం!



- హైడ్రాలిక్ లీక్, బ్యాటరీ సమస్యలతో పలుమార్లు అత్యవసర ల్యాండింగ్
- నాణ్యత, భద్రతా అంశాల్లో అనేక లోపాలు
- పలు విమానయాన సంస్థల ఫిర్యాదులు..

కుప్పకూలడం మాత్రం ఇదే తొలిసారి!

(సెంట్రల్ డెస్క్)

బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్.. అత్యాధునికమైన, ఇంధన సామర్థ్యం కలిగిన విమానంగా పేరుపొందింది. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ తయారు చేసిన ఈ భారీ విమానంలో ఒకేసారి 242-290 మంది వరకు ప్రయాణించవచ్చు. దీని పొడవు 57 మీటర్లు, రెక్కల పొడవు 60 మీటర్లు, ఎత్తు 17 మీటర్లు. 2011లో బోయింగ్ దీన్ని మార్కెట్‌లోకి తెచ్చింది. పలు విమానయాన సంస్థలు ఖండాంతర ప్రయాణాలకు ఈ డ్రీమ్‌లైనర్లను వినియోగిస్తుంటాయి. విమాన బాడీని 50 శాతం కంటే ఎక్కువ కార్బన్ ఫైబర్ సమ్మేళనాలతో నిర్మించారు. ఇది ఉక్కు కంటే బలంగా, అల్యూమినియం కంటే తేలికగా ఉంటుంది. ఫలితంగా విమానం బరువు తగ్గి, ఇంధన సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇది పర్యావరణహిత విమానంగా పేరు పొందింది. ఇందులో రెండు హై బైపాస్ టర్బో ఫ్యాన్ ఇంజన్లు ఉంటాయి. జీఈఎన్ఎక్స్ లేదా రోల్స్‌రాయిస్ ట్రెంట్ 1000 ఇంజన్లను వినియోగిస్తారు. వీటి వల్ల బోయింగ్ 767తో పోలిస్తే 20 శాతం ఎక్కువ ఇంధన సామర్థ్యం ఉంటుంది. ఈ విమానం ఏకధాటిగా 13,530 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. 2011లో ఈ విమానం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. బోయింగ్ సంస్థ ఈ డ్రీమ్‌లైనర్ విమానాన్ని 2009లో తయారు చేసింది. ఇప్పటి వరకు ప్రపంచంలోని పలు విమానయాన సంస్థలకు 1000కి పైగా విమానాలను సరఫరా చేసింది. సాంకేతికతంగా అధునాతన ఫీచర్లు ఉన్నప్పటికీ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ అనేక వివాదాలు కూడా ఎదుర్కొంది. తయారీ నాణ్యత, భద్రతాపరమైన అంశాల్లో బోయింగ్ రాజీ పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. సీట్లు వదులుగా ఉండడం, పిన్స్ సరిగా ఏర్పాటు చేయకపోవడం, నట్లు, బోల్టులు గట్టిగా బిగించకపోవడం, భద్రత లేని ఫ్యూయల్ లైన్ క్లాంపులు వంటి సమస్యలు ఉన్నాయని, తయారీలో నాణ్యతా ప్రమాణాలు దారుణంగా ఉన్నాయని కేఎల్ఎం సహా పలు విమానయాన సంస్థలు ఆరోపించాయి. అంతర్జాతీయంగా ఈ డ్రీమ్‌లైనర్‌లోని సాంకేతిక సమస్యలపై పలు విమానయాన సంస్థలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాయి. బోయింగ్‌కు చెందిన నార్త్ చార్లటన్ ప్లాంట్‌లో 2019 నుంచి క్వాలిటీ కంట్రోల్ సమస్యలపై డ్రీమ్‌లైనర్‌ను తనిఖీలు చేస్తూనే ఉన్నారు.

- అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే కుప్పకూలింది. ఈ విమానంలో 242 మంది ఉన్నారు. ప్రమాద ఘటన నేపథ్యంలో బోయింగ్ విమానాల భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. డ్రీమ్‌లైనర్‌లో ఇప్పటికే పలుమార్లు సాంకేతిక సమస్యలు తలెత్తినా.. విమానం కూలిపోవడం మాత్రం ఇదే తొలిసారి.

సాంకేతిక సమస్యలెన్నో..

బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం హైడ్రాలిక్ లీక్ సమస్యలు, బ్యాటరీ సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయిన సందర్భాలు ఉన్నాయి. బోయింగ్ మాజీ ఇంజనీర్, ప్రజావేగు సామ్ సలేపూర్ న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్ వంటి మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో గతంలో డ్రీమ్‌లైనర్ విమానంపై ఆరోపణలు చేశారు. బోయింగ్ 777, 787 మోడల్ విమానాల నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆరోపించారు. దీర్ఘకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విమానాల తయారీని పూర్తిగా నిలిపేయాలని డిమాండ్ చేశారు.

ఆర్నెల్ల కిందట కూడా..

అహ్మదాబాద్‌లో కుప్పకూలిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో ఆర్నెల్ల కిందట కూడా తీవ్రమైన సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఎయిరిండియాకు చెందిన ఏఐ-171 విమానం అహ్మదాబాద్- లండన్ గాట్విక్ మార్గంలో తిరుగుతుంది. గత డిసెంబరులో కూడా భారీ సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. దాంతో నిర్వహణ లోపాలు, విమాన భద్రతా ప్రక్రియలో లోపాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, తనిఖీల అనంతరం మళ్లీ విమానాన్ని నడిపేందుకు అనుమతులు ఇచ్చారు. కాగా, ప్రయాణీలకు అసౌకర్యం, విమాన భద్రత చర్యల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను ఎయిరిండియాకు డీజీసీఏ పలుమార్లు షోకాజ్ నోటీసులివ్వడంతో పాటు జరిమానాలు కూడా విధించింది.

గతంలో జరిగిన ఘటనలివీ..

ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్ నుంచి బయల్దేరిన డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో లాగోస్‌లో అత్యవసరంగా దించారు. అమెరికా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానంలో 245 మంది ప్రయాణికులు, ఎనిమిది మంది సిబ్బంది, ముగ్గురు పైలట్లు ఉన్నారు. ఐవరీ కోస్ట్ గగనతలంలో ఉండగా విమానం హఠాత్తుగా నియంత్రణ కోల్పోయి వేగంగా కిందకు పడిపోతుండడంతో ప్రయాణికులు భయంతో వణికిపోయారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

గత ఏడాది సెప్టెంబరులో ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 విమానం ఢిల్లీ నుంచి బర్మింగ్‌హాం వెళ్తుండగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మాస్కోలో దించారు. విమానం సురక్షితంగా దిగడంతో 258 మంది ప్రయాణికులు, 17 మంది సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

గత ఏడాది జూలైలో ఎయిరిండియాకే చెందిన డ్రీమ్‌లైనర్ ఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్తుండగా కార్గో ఏరియాలో సమస్యను గుర్తించిన పైలట్లు ముందుజాగ్రత్తగా సైబీరియాలో ల్యాండ్ చేశారు.

గత ఏడాది మేలో న్యూజిలాండ్‌కు చెందిన విమానం కాక్‌పిట్‌లో సమస్యలు తలెత్తడంతో హఠాత్తుగా కొన్ని వేల అడుగులు కిందకు పడిపోయింది. ఆ ఘటనలో 50 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. దీంతో 787 డ్రీమ్‌లైనర్ విమానాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని బోయింగ్ సంస్థ విమానయాన సంస్థలకు సూచించింది.

మరింత సమాచారం అందాల్సి ఉంది: బోయింగ్

బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కూలిన ఘటనపై ప్రాథమిక సమాచారం మాత్రమే వచ్చిందని బోయింగ్ సంస్థ తెలిపింది. మరింత సమాచారం అందాల్సి ఉందని పేర్కొంది. ఈ విషయమై ఎయిరిండియాతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే కంపెనీ షేర్లు అమెరికా ప్రి-మార్కెట్‌లో భారీగా పతనమయ్యాయి.

విమానం గాల్లోకి లేచినట్లే.. ప్రాణాళికల తాలూకు కలలు, ఊహలు గాల్లోకి లేచి.. ఆ ఫ్లైట్ ముక్కలైనట్లుగానే అర్ధంతరంగా ఛిద్రమైపోయాయి. ఆప్తుల కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపాయి. పెళ్లయ్యాక భర్త దగ్గరికి వెళుతూ యువతి, మామగారి పెద్దకర్మ కోసం వెళుతూ ఏడాదిన్నర కుమారుడి సహా ఓ మహిళ, భారత పర్యటనలోని తీపిజ్ఞాపకాలను మూటగట్టుకొని స్వదేశానికి బయలుదేరిన యూకే యువకుడు మరలిరాని లోకాలకు శాశ్వతంగా తరలిపోయారు.


ప్రమాద స్థలంలో అంబులెన్సులు

పెళ్లయ్యాక తొలిసారి భర్త దగ్గరకు వెళుతూ..

రాజస్థాన్‌కు చెందిన యవతి దుర్మరణం

పెళ్లయ్యాక.. తొలిసారి తన భర్త దగ్గరకు వెళుతూ రాజస్థాన్‌కు చెందిన నవ వధువు తిరిగిరాని లోకాలకు చేరింది. రాజస్థాన్‌కు చెందిన బలోత్రా జిల్లాకు చెందిన మదన్ సింగ్ రాజ్‌పుత్ కుమార్తె ఖుష్బూ వివాహం జనవరి 18న లండన్‌లో ఉంటున్న వైద్యుడు రాజ్‌పురోహిత్‌తో జరిగింది. పెళ్లయినప్పటి నుంచి స్వదేశంలోని అత్తింట్లో ఉంటున్న ఖుష్బూ, తొలిసారి భర్త రాజ్‌పురోహిత్ వద్దకు వెళ్లేందుకు లండన్ బయలుదేరింది. ప్రమాదం గురించి తెలిసి.. కుటుంబసభ్యులు, గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

నా కూతురు.. మనుమడు ఎక్కడ?

పుణెవాసి కన్నీటి పర్యంతం..

ఉదయం తొమ్మిదింటికే కూతురుతో మాట్లాడాను.. ఇప్పుడామె గురించి తెలియడం లేదు అని పుణెకు చెందిన మనీశ్ కన్నీటిపర్యంతమయ్యాడు. అహ్మదాబాద్ విమానంలో మనీశ్ కూతురు యషా, ఆమె ఏడాదిన్నర కుమారుడు రుద్ర, యషా అత్తగారు ఉన్నట్లు చెప్పారు. ఇప్పుడు వీరి ఆచూకీ గురించి ఎవ్వరూ చెప్పడం లేదని, ఇప్పటివరకు అధికారులెవరూ తమను సంప్రదించలేదని మనీశ్ వాపోయాడు. ఆస్పత్రిని ముఖ్యమంత్రి సందర్శించిన తర్వాతే లోపలికి అనుమతిస్తామని బాధితులకు చెబుతున్నారని చెప్పాడు. యూకేలో ఉంటున్న తన కూతురు మామగారు నెలక్రితం అహ్మదాబాద్‌లో చనిపోయారని, 22న జరగాల్సిన కర్మక్రియలకు హాజరయ్యేందుకు బయలుదేరారని చెప్పాడు.


మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

భారత్‌లో ఇదే చివరిరాత్రి అని పోస్టు పెట్టి..

ఇన్‌స్టాలో యూకే యువకుడి పోస్టు

జామీ మీక్! యోగా పట్ల గొప్ప ఆసక్తిగల ఈ బ్రిటన్ యువకుడు.. 'భారత్‌లో ఇదే చివరి రాత్రి' అని పోస్టు పెట్టాడు గానీ.. తన జీవితంలోనే 'చివరిది' అని ఊహించలేకపోయాడు. తన భారత పర్యటనను ముగించుకొని జామీ గురువారం లండన్ విమానం ఎక్కాడు. అంతకుముందు భారత్‌లో తాను చవిచూసిన మధురమైన జ్ఞాపకాలను క్రోడీకరిస్తూ 'గుడ్‌బై ఇండియా' అని భావోద్వేగపూరితమైన పోస్టు పెట్టాడు. భారత్‌లో తాను ఊహించని గొప్ప అనుభూతిని పొందానని.. మనసు కదిలించే జ్ఞాపకాలతో యూకే వెళుతున్నానంటూ 'గుడ్‌బై ఇండియా' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు. భారత్‌లో చివరిరోజు.. గుజరాతీ థాలీ రుచి చూడటం.. హోటల్‌లో ఓ రాత్రి గడపడం అద్భుతం అని రాసుకొచ్చాడు.

పెళ్లికి హాజరై తిరిగి వెళుతూ..

రెండేళ్లపాప సహా తల్లీకూతుళ్ల దుర్మరణం

జసాధికాబెన్ మహ్మద్, మియాన్ షెత్వాలా తల్లీకూతుళ్లు. షెత్వాలాకు రెండేళ్ల పాప కూడా ఉంది. వీరు లండన్‌లో ఉంటున్నారు. ఈ తల్లీకూతుళ్లు పాపతో కలిసి ఓ పెళ్లికని భారత్‌కొచ్చారు. గురువారం విమానంలో తిరుగుప్రయాణమై ప్రమాదంలో మృతిచెందారు. చోటా ఉదేపూర్‌కు చెందిన 32 ఏళ్ల నాన్సీ చిత్రేశ్ పటేల్‌కు ఇటీవలే పెళ్లయింది. ఒంటరిగా విమానంలో బయటుదేరింది. వడోదరకు చెందిన దంపతులు నీరజ్, అపర్ణ.. గాంధీనగర్‌కు చెందిన గౌరవ్ భాయ్, కల్యాణిబెన్ దంపతులు.. సూరత్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు... అఖిల్ అబ్దుల్లా (32), హనా అఖిల్ నానబావా (31), హనా కుమార్తె సారా ఆఖిల్ ప్రాణాలొదిలారు.

ప్రమాద దృశ్యాలు కలచివేస్తున్నాయి

: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు అనేక మంది బ్రిటన్ పౌరులు ప్రయాణిస్తున్న విమాన ప్రమాద దృశ్యాలు కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నానని, బ్రిటన్‌కు చెందిన ప్రయాణికుల కుటుంబాలకు అండగా ఉంటామని ఒక ప్రకటనలో తెలిపారు. వారికి సహాయ కార్యక్రమాల కోసం ఢిల్లీ, లండన్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ పేర్కొన్నారు. భారత్‌లోని హై కమిషన్ అక్కడి అధికారులతో కలిసి పనిచేస్తోందని సోషల్ మీడియాలో తెలిపారు. 020 7008 5000 నంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు.

విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు... మాంట్రియల్ ఒప్పందం ప్రకారం బీమా సొమ్ము!

విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు బీమా సొమ్మును మాంట్రియల్ ఒప్పందం ప్రకారం చెల్లిస్తారని నిపుణులు పేర్కొంటున్నారు. ఆ ఒప్పందంలో భారత్ కూడా భాగస్వామి. మొదటగా వివిధ దేశాల మధ్య 1999లో ఈ ఒప్పందం కుదిరినా భారత్ 2009లో చేరింది. దీని ప్రకారం విమానయాన సంస్థ ప్రయాణికులకు ఎంత సొమ్ము చెల్లించాలనేది వారు ఏ దేశానికి చెందిన వారనే అంశంపై ఆధారపడి ఉంటుందని ప్రుడెంట్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ వైస్ ప్రెసిడెంట్ హితేష్ గిరోత్రా తెలిపారు. వయసు, వృత్తి వంటి ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఎయిర్‌లైన్స్ సంస్థ అప్పటికప్పుడు నష్టపరిహారం ప్రకటించినప్పటికీ మాంట్రియల్ ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని హౌడెన్ (ఇండియా) ఎండీ, సీఈవో అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు.




మాటలకందని విషాదం

విమాన ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

మనసును కలచివేస్తోంది: రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, పలువురు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదమని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ప్రధాని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన సహాయం అందించాలని ప్రధాని ఆదేశించారు. మోదీ శుక్రవారం ప్రమాదస్థలిని సందర్శిస్తారు. ఈ ప్రమాదం మనసును కలచివేస్తోందని రాష్ట్రపతి ముర్ము తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం మద్దతుగా నిలుస్తుందన్నారు. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఓ ప్రకటనలో... 'లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో వందల మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోవడం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి' అని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు ఎక్స్‌లో స్పందిస్తూ... ప్రమాదంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్‌లో స్పందిస్తూ... 'ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుల కుటుంబాలకు దేశం బాసటగా ఉండాల్సిన సమయం ఇది' అని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వేర్వేరు ప్రకటనలో ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు. కేంద్ర మంత్రులు నిర్మలా, గడ్కరీ, కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విమానయాన సంస్థలు ఇండిగో, స్పైస్‌జెట్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఈ కష్ట సమయంలో ఎయిరిండియాకు మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నాయి. ఈ పెను విషాదం గుండెను పిండేస్తోందని బాలీవుడ్ నటులు అక్షయ్ కుమార్, అలియా భట్, విక్కీ కౌశల్, కరీనా కపూర్ తదితరులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

బోయింగ్.. డైయింగ్!?

ఎగిరే శవపేటికల్లా విమానాలు.. కొన్నేళ్లుగా వరుసగా దుర్ఘటనలు.. నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో లోపాలు

- ఆ సంస్థ ఉద్యోగులే స్వయంగా బయటపెట్టినా మారని తీరు
- సునీతా విలియమ్స్ ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోవడానికీ ఇదే కారణం
- ప్రస్తుతం భారత ఎయిర్‌లైన్స్ సంస్థల వద్ద 185 బోయింగ్ విమానాలు.. మరో 645 విమానాలకు ఆర్డర్లు



అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయిన ఘటనతో బోయింగ్ సంస్థ విమానాల పనితీరుపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. ఇటీవలికాలంలో విమానాల్లో సాంకేతిక లోపాల నుంచి తలుపులు ఊడిపోవడం వంటి నిర్మాణ లోపాల దాకా వరుస ఘటనలు ఆ విమానాల భద్రతా ప్రమాణాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వాస్తవానికి బోయింగ్ సంస్థలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులే.. విమానాల భద్రతా ప్రమాణాల పట్ల ఆ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును బయటపెట్టారు. ఆ ఘటనలతో అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) బోయింగ్ విమానాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఈ క్రమంలో భద్రతా ప్రమాణాల లోపాన్ని అంగీకరిస్తూ.. బోయింగ్ సీఈవో డేవ్ కాల్హౌన్ తన పదవికి రాజీనామా చేశారు. సంస్థలో 737 విమానాల విభాగం చీఫ్ ఎడ్ క్లార్క్ కూడా వైదొలిగారు.

సీఈవోలు మారినా.. భద్రత లేక..

వాస్తవానికి డేవ్ కాల్హౌన్‌కు ముందు డెన్నిస్ ములెన్‌బర్గ్ బోయింగ్ సీఈవోగా పనిచేశారు. 2018, 2019లలో రెండు 737 మ్యాక్స్ 8 విమానాలు కూలిపోయి 346 మంది మరణించడంతో.. బోయింగ్ విమానాల భద్రతపై విమర్శలు చెలరేగాయి. ఆ రెండు విమానాలు కూడా టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల్లోనే కూలిపోవడం గమనార్హం. దీనితోబోయింగ్ సంస్థ డెన్నిస్ ములెన్‌బర్గ్‌ను తొలగించింది. సీఈవోగా డేవ్ కాల్హౌన్‌ను నియమించింది. భద్రతా ప్రమాణాలను పెంచి సంస్థపై నమ్మకాన్ని తిరిగి నిలబెడతానంటూ పదవిని చేపట్టిన ఆయన.. అదే భద్రతా లోపంతో రాజీనామా చేయడం గమనార్హం. 2024 జనవరిలో అమెరికాలోని అలాస్కాలో ప్రయాణిస్తున్న బోయింగ్ 737 మ్యాక్స్ 9 విమానం గాలిలో ఉండగానే దాని డోర్ ఊడిపోయింది. అదే ఏడాది డిసెంబర్‌లో దక్షిణ కొరియాలో బోయింగ్ 737-800 విమానం కూలిపోయి 179 మంది చనిపోయారు. తాజాగా అహ్మదాబాద్‌లో బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం కూలిపోయింది. ప్రస్తుతం బోయింగ్ సీఈవోగా కెల్లీ ఓర్ట్‌బెర్గ్ పనిచేస్తున్నారు.

సునీతా విలియమ్స్ చిక్కుకుపోవడానికీ..

భారత సంతతి నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు తొమ్మిది నెలలపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోవడానికి కూడా బోయింగ్ సంస్థ వైఫల్యమే కారణం. బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో థ్రస్టర్లు సరిగా పనిచేయకపోవడం, హీలియం లీకేజీ సమస్యలు తలెత్తాయి. వాటిని సరిదిద్దడానికి బోయింగ్, నాసా ఎంతగా ప్రయత్నించినా వీలుకాలేదు. చివరికి ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన క్రూ-9 మిషన్ సాయంతో వారిని భూమ్మీదికి తీసుకురావాల్సి వచ్చింది.

మన ఎయిర్‌లైన్స్‌లో బోయింగ్ విమానాలెన్నో..

ప్రస్తుతం మన దేశ ఎయిర్‌లైన్స్ సంస్థలు సుమారు 185 బోయింగ్ విమానాలను వినియోగిస్తున్నాయి. బోయింగ్ 737 మ్యాక్స్, 777-200 ఎల్ఆర్, 777-300ఈఆర్, 787-8 డ్రీమ్‌లైనర్, 787-9 డ్రీమ్‌లైనర్ విమానాలను వాడుతున్నాయి. విదేశాలకు సర్వీసులు నిర్వహించే ఎయిర్ ఇండియా వద్ద మొత్తం 198 విమానాలుంటే అందులో 40 బోయింగ్‌వే, దేశీయ సర్వీసులు నిర్వహించే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్న మొత్తం 104 విమానాలూ బోయింగ్‌వే. ఇండిగో సంస్థ 437 విమానాలతో సర్వీసులు నిర్వహిస్తుండగా అందులో ఎనిమిది, స్పైస్‌జెట్ వద్ద ఉన్న 62 విమానాల్లో 33 విమానాలు (లీజుకు తీసుకున్నవి కలిపి) బోయింగ్ కంపెనీవే. అంతేకాదు ఈ సంస్థలు పెద్ద సంఖ్యలో బోయింగ్ విమానాల కోసం ఆర్డర్లు కూడా పెట్టాయి. ఎయిర్ ఇండియా సుమారు 290 విమానాలకు ఆర్డర్ పెట్టింది. స్పైస్‌జెట్ గతంలోనే 205 విమానాలకు ఆర్డర్ పెట్టగా.. గత ఏడాది డిసెంబర్ నాటికి 13 విమానాలు డెలివరీ అయ్యాయి. తర్వాత స్పైస్‌జెట్‌కు ఆర్థిక ఇబ్బందులతో నిలిచిపోయింది. విమానాల కొనుగోలును పునరుద్ధరించుకోవాలని తాజాగా ఆ సంస్థ నిర్ణయించింది. ఇక కొత్తగా వచ్చిన ఆకాశ ఎయిర్ సంస్థ కూడా 150 బోయింగ్ విమానాల కోసం ఆర్డర్ చేసింది.

- సెంట్రల్ డెస్క్



ఎయిరిండియా విమాన ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఓ కుటుంబం దుర్మరణం చెందింది. రాజస్థాన్‌లోని బన్సవారాలో పేరొందిన వైద్యురాలైన డాక్టర్ కోని వ్యాస్.. తన భర్త ప్రదీప్ జోషి, తమ ముగ్గురు పిల్లలతో కలిసి లండన్‌లో స్థిరపడాలని ఎంతోకాలంగా అనుకుంటున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి కావడంతో రెండ్రోజుల క్రితమే వ్యాస్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. లండన్ వెళ్లేందుకు కుటుంబం అంతా కలిసి అహ్మదాబాద్‌లో గురువారం విమానం ఎక్కారు. ఆ వెంటనే వారంతా ఓ సెల్ఫీ తీసుకుని కుటుంబసభ్యులు, స్నేహితులకు పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కాసేపటికే ఆ విమానం కూలడంతో వారంతా లోకాన్ని వీడారు.

మిగతా సర్వీసులపై ప్రభావం

అహ్మదాబాద్, జూన్ 12: గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఏఐ-171 విమానం బయలుదేరిన కొద్ది క్షణాల్లోనే కూలిపోవడంతో మిగతా విమాన సర్వీసులపై ప్రభావం పడింది. ప్రయాణ సమయాల్లో తాజా మార్పులకు సంబంధించి ప్రయాణికులు తమ ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించాలంటూ అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రయాణికులు ఇప్పటికే బుక్ చేసుకున్న టికెట్ల తాలూకు మొత్తాన్ని తమ వెబ్‌సైట్ ద్వారా తిరిగి పొందవచ్చని ఇండిగో ఎక్స్‌లో పోస్ట్ చేసింది. టికెట్‌లు మళ్లీ బుక్ చేసుకోవాలని కూడా సూచించింది. తదుపరి నోటీసు వచ్చేవరకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో అన్ని విమాన సర్వీసులను నిలిపివేసినట్లు స్పైస్ జెట్ ప్రకటించింది. విమానాలకు సంబంధించిన తాజా సమాచారం తమ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించింది. మరోవైపు కోల్‌కతా నుంచి బయలుదేరి అహ్మదాబాద్‌లో దిగాల్సిన ఇండిగో 6ఈ- 318 విమానం.. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం నేపథ్యంలో తిరిగి వెనక్కు కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి ల్యాండయింది. మధ్యాహ్నం 1:49కు కోల్‌కతా నుంచి అహ్మదాబాద్‌కు బయలుదేరి తిరిగి కోల్‌కతాలో 2:52కు దిగింది.

ప్రయాణికుల కుటుంబ సభ్యుల కోసం సహాయక విమానాలు

విమాన ప్రమాదంలో మరణించిన ప్రయాణికులు, సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం ఎయిర్ ఇండియా రెండు ప్రత్యేక విమానాలు నడపనుంది. ఢిల్లీ, ముంబై నుంచి అహ్మదాబాద్‌కు సహాయక విమాన సర్వీసులు ఏర్పాటు చేసింది.



కాబోయే డాక్టర్లు.. కల చెదిరి..



హాస్టల్ మెస్‌పై విమానం కూలడంతో పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు మృతి!



హాస్టల్ మెస్‌లో చెల్లాచెదురైన కంచాలు

భోజనం చేస్తూనే కన్నుమూసిన కొందరు

భవనంలో ఎటు చూసినా విధ్వంసమే..

అహ్మదాబాద్, జూన్ 12: వారంతా కాబోయే వైద్యులు.. ప్రమాదంలో ఉన్నవారికి ప్రాణం పోసి కాపాడేవారు.. సరదాగా మాట్లాడుకుంటూ మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.. ఉన్నట్టుండి ఆ భవనంపై విమానం కుప్పకూలడంతో వారు కన్న కలలు చెదిరిపోయాయి. భోజనం చేస్తున్న కొందరు వైద్య విద్యార్థులు అలాగే ప్రాణాలు కోల్పోగా.. శిథిలాలు మీద పడి చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. మిగతా వారంతా కంచాల్లో ఆహారాన్ని ఎలా ఉన్నది అలా వదిలేసి భయంతో పరుగులు పెట్టారు. అహ్మదాబాద్‌లోని బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై ఎయిరిండియా విమానం కూలిపోయినప్పటి హృదయ విదారక దృశ్యమిది. ప్రమాదం జరిగిన సమయంలో నాలుగో అంతస్తులోని మెస్‌లో 60మందికి పైగా వైద్య విద్యార్థులు, పీజీ చేస్తున్న రెసిడెంట్ వైద్యులు భోజనం చేస్తున్నారని అంచనా. వీరిలో చాలా మంది ఆచూకీ తెలియలేదు. శిథిలాలను తొలగిస్తూ మృతదేహాలను వెలికి తీస్తున్నారు. ఇప్పటివరకు ఐదు మృతదేహాలను గుర్తించారు. కొందరు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. "చాలా మంది వైద్య విద్యార్థులు, పీజీ వైద్యుల ఆచూకీ లభించడం లేదు. కొందరి మృతదేహాలను మాత్రం గుర్తించారు. ఇక్కడి పరిస్థితిని చూస్తుంటే 50 మంది వరకు మరణించి ఉంటారు.." అని బీజే వైద్య కళాశాలకు చెందిన వైద్యుడు కెవ్లిన్ నిర్వాన్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో 50 మంది వైద్య విద్యార్థులు మృతిచెందినట్టుగా దైనిక్ భాస్కర్ వార్తా సంస్థ తమ వెబ్ సైట్‌లో పేర్కొంది.



విలపిస్తున్న మృతుల బంధువులు

కిందకు దూకేసిన కొందరు..

ఇక ఇదే భవనంలోని మిగతా అంతస్తుల్లో రెసిడెంట్ వైద్యులు కుటుంబాలతో నివసిస్తున్నారు. విమానం కుప్పకూలి, మంటలు చెలరేగడంతో రెండు, మూడో అంతస్తుల్లోని కొంత భాగం కూడా ధ్వంసమైంది. దీనితో ఆయా కుటుంబాల వారు కూడా మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కొందరు రెండు, మూడో అంతస్తుల నుంచి కిందికి దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. "నేను, నా జూనియర్ డాక్టర్ గాయపడ్డాం. మరో 30-40 మందికి తీవ్రగాయాలయ్యాయి. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెబుతున్నారు" అని డాక్టర్ శ్యామ్ గోవింద్ తెలిపారు. ఇక తన కుమారుడు లంచ్ బ్రేక్ కోసమని క్యాంటీన్‌కు వెళ్లాడని, ప్రమాదం జరగడంతో రెండో అంతస్తు నుంచి కిందికి దూకేశాడని ఓ వైద్య విద్యార్థి తల్లి రమీలా వెల్లడించారు.

ఎటు చూసినా విధ్వంసమే

విమానం కుప్పకూలడం, భారీగా మంటలు చెలరేగడంతో.. హాస్టల్ భవనంలో మెస్ సహా చాలా భాగం తీవ్రంగా ధ్వంసమైంది. దీనికి సంబంధించి వైద్య విద్యార్థులు, సహాయక చర్యల్లో పాల్గొన్న స్థానికులు తీసిన వీడియోలు, ఫొటోలు వైరల్‌గా మారాయి. అందులో ఎటు చూసినా కూలిపోయి, చెల్లాచెదురుగా పడిన భవన పైకప్పు, గోడల శిథిలాలు, విమానం భాగాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు కనిపిస్తున్నాయి. విమానం తోక భాగం కొంత ఆ భవనం నాలుగో అంతస్తులోకి చొచ్చుకెళ్లి, పైనుంచి వేలాడుతూ కనిపిస్తోంది. మెస్‌లోని కొన్ని టేబుళ్లపై కంచాలు, వాటిలో మిగిలి ఉన్న ఆహారం దుర్ఘటనతో నెలకొన్న విషాదానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కాగా, భారత వైద్య రంగంలో ఇదొక దారుణ విషాదమని, భవిష్యత్తు వైద్యులను కోల్పోవడం బాధాకరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి ధ్రువ్ చౌహాన్ పేర్కొన్నారు.

గాల్లో ప్రాణాలు!

దేశ చరిత్రలో వినాశకరమైన విమాన ప్రమాదాల జాబితా ఇదీ...

- **2020 ఆగస్టు 7** ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం దుబాయ్ నుంచి కేరళలోని కోజికోడ్ చేరుకుంది. అక్కడి ల్యాండ్ అవుతుండగా వర్షం కారణంగా అదుపుతప్పి రన్‌వే నుంచి జారిపోయింది. టేబుల్‌టాప్ రన్‌వేను దాటి పక్కనే ఉన్న లోయలో పడి పోయింది. విమానంలో 190 మంది ఉండగా 21 మంది ప్రాణాలు కోల్పోయారు.
- **2010 మే 22న** దుబాయ్ నుంచి వచ్చిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన బోయింగ్ విమానం కర్ణాటకలోని మంగళూరు విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా టేబుల్‌టాప్ రన్‌వేకు అవతల ఉన్న లోయలో పడిపోవడంతో 158 మంది ప్రాణాలు కోల్పోయారు.
- **2000 జూలై 17న** అలయన్స్ ఎయిర్ సంస్థకు చెందిన బోయింగ్ విమానం బిహార్‌లోని పాట్నాలో ల్యాండ్ అవుతున్న సమయంలో అదుపుతప్పి జనావాసాలపై కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న 55 మందితో పాటు కింద ఉన్న మరో ఐదుగురు మరణించారు.
- **1996 నవంబరు 12న** హరియాణా సమీపంలోని చార్ఖి దాద్రి సమీపంలో సౌదీకి చెందిన బోయింగ్ 747 విమానం, కజకిస్థాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఇల్యూషిన్ ఇల్-76 విమానం ఢీకొన్న ఘటనలో 349 మంది ప్రాణాలు కోల్పోయారు. కజకిస్థాన్ విమానం నిర్దేశించిన ఎత్తు కంటే కిందకు దిగడంతో ప్రమాదం సంభవించింది.
- **1991 ఆగస్టు 16న** కోల్‌కతా నుంచి ఇంఫాల్‌కు వెళ్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం నావిగేషన్ లోపం కారణంగా కొండల్లో కూలిపోవడంతో 59 మంది ప్రయాణికులు మరణించారు.
- **1990 ఫిబ్రవరి 14న** ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం బెంగళూరులోని హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటుండగా కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో ఉన్న 146 మందిలో 92 మంది మృతిచెందారు.
- **1988 అక్టోబరు 19న** ముంబై నుంచి అహ్మదాబాద్ వస్తున్న బోయింగ్ 737-200 విమానం పొగమంచు కారణంగా విమానాశ్రయానికి సమీపంలో చెట్లను ఢీకొని కూలిపోయింది. విమానంలో ఉన్న 135 మందిలో 133 మంది దుర్మరణం చెందారు.
- **1985 జూన్ 23న** మాంట్రియల్- లండన్ ఎయిరిండియా కనిష్క విమానం ఐర్లాండ్ సమీపంలో నేలకు 31 వేల అడుగుల ఎత్తున పేలిపోయింది. 1984లో ఆపరేషన్ బ్లూస్టార్‌కు ప్రతీకారంగా సిక్కు ఉగ్రవాదులు ఈ విమానంలో సూటుకేసు బాంబు అమర్చారు. మొత్తం 329 మంది మరణించారు.
- **1982 జూన్ 21న** కౌలాలంపూర్ నుంచి ముంబైకి వస్తున్న బోయింగ్ విమానం భారీ వర్షం కారణంగా ముంబైలోని శాంతాక్రాజ్ విమానాశ్రయంలో ల్యాండింగ్ అవుతుండగా కూలిపోయింది. ఈ ఘటనలో 58 మంది మృతిచెందారు.
- **1978 జనవరి 1న** ముంబైనుంచి దుబాయ్ వెళ్తున్న ఎయిరిండియా బోయింగ్ 747 విమానం అరేబియా సముద్రంలో కూలిపోయింది. 213 మంది ప్రయాణికులు మృత్యువాత పడ్డారు.
- **1976 అక్టోబరు 12న** ముంబై నుంచి మద్రాస్ వెళ్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజన్ వైఫల్యంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికి కూలిపోవడంతో 54 మంది ప్రాణాలు కోల్పోయారు.

మెడికల్ కాలేజీ ప్రాంగణంలో విమాన శకలాలు





ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అసలేం జరిగింది!?

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు

న్యూఢిల్లీ, జూన్ 12: అహ్మదాబాద్‌లో బోయింగ్ 787 విమానం కూలిన ఘటనపై నిపుణులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అలాగే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. టేకాఫ్ అయిన వెంటనే కూలిపోవడానికి గల కారణాలు అంతుచిక్కడం లేదని అంటున్నారు. అయితే మాజీ పైలట్ ఎహసాన్ ఖలీద్ మాత్రం విమానం ల్యాండింగ్ గేర్ కిందకు ఉండడంపై అనుమానం వ్యక్తం చేశారు. పైలట్ ఏటీసీకి 'మేడే' కాల్ ఇచ్చారంటే విమానంలో వ్యవస్థ విఫలమైందని అర్థమన్నారు. "ల్యాండింగ్ గేర్ ఎందుకు కిందకు ఉందో అర్థం కావడం లేదు. విమానం గాల్లోకి లేచిన వెంటనే ల్యాండింగ్ గేర్ లోపలికి వెళ్లిపోతుంది. కూలిన విమానం ల్యాండింగ్ గేర్ కిందకు ఉందంటే ఇంజన్ విఫలమైనట్లు గుర్తించాలి. ప్రమాదానికి ఇలాంటి ఎన్నో అంశాలు కారణమై ఉంటాయి. అయితే ల్యాండింగ్ గేర్ ఎందుకు కిందకు ఉందన్నదే పెద్ద ప్రశ్నగా మారింది. విమానం కూలడానికి కారణం ఏంటన్నది ఇప్పుడే ఎవరూ చెప్పలేరు" అని ఖలీద్ అన్నారు. విమానం శక్తిని కోల్పోయినట్లు కనిపించిందని, దానికి ఇంజన్‌లో లోపం కూడా కారణమై ఉండొచ్చని తెలిపారు. అయితే ఒకేసారి రెండు ఇంజన్లు విఫలమయ్యే అవకాశం ఉండదన్నారు. అంత తక్కువ సమయంలో పక్షి ఢీకొనడం వల్ల ఇంజన్లు ఫెయిలయ్యే చాన్స్ కూడా ఉండదని చెప్పారు. అమెరికా ఏరోస్పేస్ సేఫ్టీ కన్సల్టెంట్ ఆంటోనీ బ్రిక్‌హౌస్ కూడా ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తం చేశారు. టేకాఫ్ అయిన విమానానికి ల్యాండింగ్ గేర్ ఆ స్థితిలో ఉండడం అసహజంగా అనిపిస్తోందన్నారు. కూలిపోయే ముందు ఆ విమానాన్ని చూస్తే రన్‌వే వైపు వెళ్తున్నట్లుగా అనిపించిందని చెప్పారు.

స్లాట్‌లు, ఫ్లాప్‌లు సరిగానే ఉన్నాయా?

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై అమెరికా నిపుణులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు విమానం ప్రయాణానికి పూర్తిగా సిద్ధంగా ఉందా? అన్నది కూడా తేలాల్సి ఉందని అంటున్నారు. ఏవియేషన్ సేఫ్టీ కన్సల్టెంట్ జాన్ ఎం కాక్స్ మాట్లాడుతూ.. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాన్ని ప్రయాణానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారా? అన్నది విచారణ అధికారులు తేల్చాల్సి ఉందని చెప్పారు. విమాన రెక్కలకు ఉండే స్లాట్‌లు, ఫ్లాప్‌లు సరైన స్థితిలోనే ఉన్నాయా? విమానం ఎగిరేందుకు అనువుగా ఉన్నాయా? అన్న అంశంపైనా దర్యాప్తు చేయాలన్నారు. విమానం ఫొటోలు చూస్తుంటే ఈ అనుమానం కలుగుతోందని చెప్పారు. విమానాలను నడపడంలో టేకాఫ్, ల్యాండింగే అత్యంత ప్రమాదకరమైన దశలని మరో నిపుణుడు వ్యాఖ్యానించారు. విమానాలు 200 మీటర్లు లేదా 650 అడుగులకు పైగా ఎత్తుకు చేరుకోలేనప్పుడు పైలట్లు ఆలస్యమైనా సరే టేకాఫ్‌ను ఆపేస్తారని తెలిపారు. కానీ, ఈ ప్రమాద ఘటనలో టేకాఫ్ చివరి దశలో ఉండగా హఠాత్తుగా సమస్య ఉత్పన్నమై ఉంటుందని చెప్పారు.

ఇంజన్ల విఫలం లేదా పక్షి ఢీకొట్టడం..

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి కారణం ఇంజన్లు విఫలమవడం లేదా పక్షి ఢీకొట్టడం అయి ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. విమానం కూలిన వీడియోలు చూస్తుంటే టేకాఫ్‌కు అవసరమైన శక్తిని అందించడంలో ఇంజన్లు విఫలమైనట్లు కనిపిస్తోందని ముగ్గురు సీనియర్ వైడ్ బాడీ పైలట్లు అభిప్రాయపడ్డారు. ఒక ఇంజన్ విఫలమైనట్లు కనిపించడం లేదని, అలా అయి ఉంటే విమానం ఊగిపోతుందని ఓ పైలట్ పేర్కొన్నారు. కానీ, ఈ ఘటనలో విమానం స్థిరంగానే ఉందన్నారు. అంటే రెండు ఇంజన్లూ విఫలమై ఉంటాయని, రెండు ఇంజన్లలోనూ థ్రస్ట్ కోల్పోయి ఉండొచ్చని మరో కమాండర్ పేర్కొన్నారు. పక్షులు ఢీకొనడం వల్ల కూడా రెండు ఇంజన్లలో మంటలు చెలరేగి ఉండొచ్చని అన్నారు. కాగా, విమానం రెండు ఇంజన్లు శక్తిని కోల్పోయి ఉంటాయని మూడో పైలట్ చెప్పారు. ఒక ఇంజన్ విఫలమై ఉంటుందని, ల్యాండింగ్ గేర్ పైకి రాకపోవడంతో రెండో ఇంజన్ కూడా సరిపడా శక్తిని ఉత్పత్తి చేయలేకపోయి ఉంటుందని తెలిపారు.

ఎమర్జెన్సీలో.. మేడే

ముప్పు ముంగిట ఏటీసీకి పైలట్ పంపే హెచ్చరిక

- సాయం చేయండి అని అర్థం
- కాల్ రాగానే ఎమర్జెన్సీ మోడ్‌లోకి ఏటీసీ
- విమానానికి పూర్తి ట్రాఫిక్ క్లియరెన్స్



న్యూఢిల్లీ, జూన్ 12: విమానంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు పైలట్.. సంబంధిత 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కి మేడే కాల్ చేస్తారు. అవతలి వారికి స్పష్టంగా వినిపించటం కోసం 'మేడే, మేడే, మేడే' అంటూ మూడుసార్లు చెబుతారు. ఇంజిన్ ఫెయిల్ కావటం, అగ్నిప్రమాదం సంభవించటం, విమానం మీద నియంత్రణ కోల్పోవటం, పీడనంలో అకస్మాత్తుగా మార్పులు చోటు చేసుకోవటం వంటి సందర్భాల్లో మే డే కాల్ చేస్తుంటారు. మే డే అనేది ఫ్రెంచి పదం 'మెయ్‌డెజ్' నుంచి పుట్టింది. ఈ పదానికి.. 'సాయం చేయండి' అని అర్థం. 1920ల నుంచి మేడే కాల్‌ని అంతర్జాతీయంగా అమలు చేయటం మొదలైంది. ఒక విమాన పైలట్ 'మే డే' కాల్ చేసినప్పుడు.. ఏటీసీ సిబ్బంది ఎమర్జెన్సీ ప్రొటోకాల్స్‌ను అమలు చేస్తారు. ఆ విమానానికి గగనతలంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా చూస్తారు. పైలట్‌తో ప్రత్యక్ష కమ్యూనికేషన్‌లోకి వస్తారు. ఆ విమానం దిగే ఎయిర్‌పోర్ట్ ఎమర్జెన్సీ విభాగంతో సమన్వయం చేసుకుంటారు. అవసరమైతే స్థానిక వైమానిక స్థావరాలను, ఎయిర్‌పోర్టులను అప్రమత్తం చేస్తారు. ఏటీసీ నుంచి సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ ఎమర్జెన్సీ విభాగం.. రన్‌వే వెంబడి అంబులెన్సులను, అగ్నిమాపక దళాల్ని మోహరిస్తుంది. విమానాలు మూడు రకాల ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఉన్నప్పుడు పైలట్లు హెచ్చరికలు జారీ చేస్తుంటారు. 1. అనిశ్చితి 2. ప్రమాద సంకేతం 3. ముంచుకొచ్చిన విపత్తు. మూడో దశలో మే డే కాల్ చేస్తుంటారు.


విమానాలు ప్రమాదాల బారిన పడటానికి తరచూ పక్షులు కారణమవుతున్నాయి. సాధారణంగా టేకాఫ్, ల్యాండింగ్, తక్కువ ఎత్తులో (3 వేల అడుగుల కంటే తక్కువలో) విమానం ప్రయాణిస్తున్నప్పుడు పక్షులు విమానాన్ని ఢీకొనే ప్రమాదం ఎక్కువ. ఒక పక్షి లేదా కొన్ని పక్షుల గుంపు విమానాన్ని ఢీకొని ఇంజన్‌లో చిక్కుకుపోతే.. ఇంజిన్‌లోని బ్లేడ్లు వంగిపోవటం, ఇంజన్ సామర్థ్యం తగ్గిపోవటం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఇంజన్ నిలిచిపోవటమో, అగ్నిప్రమాదం సంభవించటమో జరుగుతుంది. అహ్మదాబాద్ ఘటనలో ఇదే జరిగి ఉంటుందని వైమానిక నిపుణులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి

పక్షులతో భారీ ముప్పు

తగినట్లుగానే, విమాన ప్రమాద ప్రాంతంలో దాదాపు 50కిపైగా పక్షులు మరణించాయని వార్తలు వెలువడ్డాయి. పక్షులు ఢీకొనటం వల్ల విమానాల్లో విండ్‌షీల్డ్ దెబ్బతిని, పైలట్లకు విమానం ముందున్న మార్గం సరిగా కనిపించకపోవటం, క్యాబిన్‌లో వాయుపీడనం పెరిగిపోవటం వంటి సమస్యలు కూడా తలెత్తిన సందర్భాలున్నాయి. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) ప్రకారం, పక్షులు ఢీకొనే ఘటనల్లో 92 శాతం పెద్దగా ప్రమాదాలు జరగనప్పటికీ, 8 శాతం ఘటనలు మాత్రం తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తున్నాయి. పక్షులు విమానం ఇంజన్‌ను ఢీకొని దాంట్లో కూరుకుపోయిన సందర్భాల్లో మాత్రం తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయి.

రెండుసార్లు గుజరాత్ సీఎంగా విజయ్ రూపానీ

2016-21 మధ్య సీఎంగా బాధ్యతలు




అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిర్ ఇండియా విమానంలో ఆ రాష్ట్ర మాజీ సీఎం విజయ్ రూపానీ (68) కన్నుమూశారు. ఆయన గుజరాత్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

ఆనందిబెన్ పటేల్ స్థానంలో 2016 ఆగస్టు ఏడో తేదీన తొలిసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విజయ్ రూపానీ.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత రెండోసారి సీఎంగా నియమితులై 2021 సెప్టెంబర్ 11 వరకూ కొనసాగారు. 2014 నవంబర్ - 2016 ఆగస్టు వరకూ రాష్ట్ర మంత్రిగా.. 2016 ఫిబ్రవరి-ఆగస్టు వరకూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రూపానీ సేవలందించారు. ఆయన తొలుత 1988-96 మధ్య రాజ్‌కోట్ నగరపాలక సంస్థ కార్పొరేటర్‌గా.. 1996-97 మధ్య మేయర్‌గా సేవలందించారు. విద్యార్థి దశలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకుడిగా పని చేసిన రూపానీ.. రాజ్‌కోట్‌లోని ధర్మేంద్ర సింగ్‌జీ ఆర్ట్స్ కాలేజీలో బీఏ పట్టా అందుకుని, సౌరాష్ట్ర యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఎమర్జెన్సీ సమయంలో 1976లో 11 నెలలు జైలు జీవితం గడిపిన రూపానీ.. జైన్ బనియా సామాజిక వర్గానికి చెందిన వారు. మయన్మార్ (పూర్వ బర్మా)లోని యాంగూన్‌లో రామ్‌నీక్లాల్, మాయాబెన్ దంపతులకు 1956 ఆగస్టు రెండో తేదీన జన్మించారు. 1960ల్లో భారత్‌కు వలస వచ్చిన రూపానీ కుటుంబం గుజరాత్‌లో స్థిరపడింది. విజయ్ రూపానీ కొనుగోలు చేసిన యాక్టీవా/ కారు నంబర్ 1206. ఆయన పుట్టిన తేదీ రెండో తేదీ కాగా, విమానంలో సీటు నంబర్ 2. ఏ కీలక పని చేపట్టాలన్నా జూన్ 12నే ప్రారంభిస్తారు విజయ్ రూపానీ. కాగా, ఆయనకు భార్య అంజలి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా, చిన్న కుమారుడు పుజిత్ ప్రమాదంలో మరణించారు. లండన్‌లో ఉన్న భార్య అంజలి, కూతురు రాధిక వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన విజయ్ రూపానీ విమాన ప్రమాదంలో మరణించారు.

బ్లాక్ బాక్స్ చెప్పేస్తుంది!

అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదానికి కారణం ఏమిటనేదానిపై ఇంతవరకూ అధికారిక ప్రకటన వెలువడలేదు. అది తెలియాలంటే బ్లాక్‌బాక్స్ దొరకాలి. దీనికోసం దర్యాప్తు బృందాలు వెతుకుతున్నాయి. అది దొరికితే.. ఈ ప్రమాదం సాంకేతిక సమస్య వల్ల జరిగిందా.. లేక ఇంజిన్ పనిచేయలేదా.., పక్షులు ఢీకొన్నాయా.., విమానంలో మంటలు చెలరేగాయాగా.. లేదా ఇది మానవ తప్పిదం వల్లే జరిగిందా అనేది కచ్చితంగా నిర్ధారించవచ్చు. టేకాఫ్ తర్వాత క్లిష్టమైన క్షణాల్లో సిబ్బంది 'మేడే కాల్' ద్వారా ప్రమాదంలో ఉన్నాం.. సాయం కావాలని కోరినట్టు తెలిసింది. ఆ వివరాలు బ్లాక్‌బాక్స్‌లో రికార్డవుతాయి. బ్లాక్ బాక్స్ దొరికితే.. దాన్ని డీజీసీఏ లేదా ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)కి పంపుతారు. అక్కడ దీనిలో రికార్డయిన డేటాను డీకోడ్ చేస్తారు. ఆ డేటాను రాడార్, ఏటీసీ లాగ్స్‌తో అనుసంధానిస్తారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 24 గంటల నుంచి వారం రోజుల వరకూ పట్టవచ్చు. పరికరానికి ఎంత నష్టం వాటిల్లింది అనే దాన్నిబట్టి ఇది ఆధారపడి ఉంటుంది.



రెండు విభాగాలు..

బ్లాక్ బాక్స్‌లో రెండు ప్రధాన భాగాలు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్)కాగా, మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్). ఎఫ్‌డీఆర్ విమాన వేగం, ఎంత ఎత్తులో ఎగురుతోంది, ఇంజన్ పనితీరు, నియంత్రణ వంటి టెక్నికల్ డేటాను రికార్డు చేస్తుంది. సీవీఆర్.. కాక్‌పిట్‌లో పైలట్ల సంభాషణ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో వారి కమ్యూనికేషన్, విమానంలో ఇతర శబ్దాలను రికార్డు చేస్తుంది. గత 25 గంటల్లో జరిగిన సంభాషణల సమాచారం వీటిలో నిక్షిప్తమై ఉంటుంది. ఈ రెండింటిలోని డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదానికి ముందు విమానంలో ఏం జరిగిందో, పైలట్లు ఏం మాట్లాడారో, వ్యవస్థలు ఎలా పనిచేశాయో దర్యాప్తు అధికారులు తెలుసుకుంటారు. ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని గుర్తించి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నివారించేందుకు అవసరమైన సమాచారాన్ని బ్లాక్‌బాక్స్ అందిస్తుంది.

పోస్టింగులపై గందరగోళం..!

» వ్యవసాయ అనుబంధ శాఖల్లో వివాదాస్పదంగా ఉద్యోగుల బదిలీలు


అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ శాఖల్లో ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులు గందరగోళంగా మారాయి. ఒకే స్థానంలో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారిని, ఎక్కడైనా రెండేళ్లు పనిచేసిన వారిని, ఆరోగ్య కారణాలతో బదిలీ కోరుకున్న వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలిస్తే.. కొందరు ఉద్యోగుల విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. సిఫారసులతో బదిలీలు చేసేసిన ఉన్నధికారులు.. కొందరిని అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ పేరుతో ఇష్టారాజ్యంగా బదిలీలు చేసి, పలువురికి పోస్టింగ్‌లు చూపలేదు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల్లో దశాబ్ద కాలంగా ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను కదిలించకుండా, జిల్లాల్లో ఐదేళ్లు దాటని ఉద్యోగులను మార్చడం వివాదస్పదమైంది. బదిలీల కౌన్సెలింగ్ జాబితాలో తమ స్థానాలను ఖాళీ పోస్టులుగా చూపకుండానే మరొకరికి పోస్టింగ్‌లు ఇచ్చి, తమకు మాత్రం పోస్టింగ్‌లే ఇవ్వలేదని పలు శాఖల ఉద్యోగులు వాపోతున్నారు. ఓవైపు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చిన ఉన్నతాధికారులు.. బదిలీల జీవోకు విరుద్ధంగా వ్యవహరించారన్న విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయశాఖలో కొన్ని పోస్టుల విషయంలో అధికార పార్టీ నేతల సిఫారసులను పక్కన పెట్టేసి, ఓ యూనియన్ నేత ఒత్తిళ్లతో పోస్టింగ్‌లు మార్చేసినట్లు తేలింది. మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి లోకేశ్‌కు తెలియకుండానే బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మళ్లీ మార్పులు చేసినట్లు సమాచారం. వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌లో ఐదేళ్లు దాటి పనిచేస్తున్న ఉద్యోగిని ఇప్పుడు కూడా మార్చకుండా, అక్కడే కొనసాగించడంతో ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పశుసంవర్థక శాఖలో ఐదేళ్లు దాటని తమను మార్చారని ఉత్తరాంధ్రకు చెందిన పశు వైద్య దంపతులు.. మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి జోక్యంతో ఒకరి సమస్యకు పరిష్కారం చూపారు.

ఆస్పత్రి నుంచి పీఎస్ఆర్ డిశ్చార్జి

» హైదరాబాద్‌కు పయనం.. 26న తిరిగి జైలుకు

విజయవాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో నిందితుడు పీఎస్ఆర్ ఆంజనేయులు విజయవాడ ప్రభుత్వాసుపత్రి నుంచి గురువారం మధ్యాహ్నం డిశ్చార్జి అయ్యారు. జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన.. అనారోగ్యంగా ఉందని చెప్పడంతో ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందజేశారు. ఇదిలా ఉండగా, పీఎస్ఆర్‌కు విజయవాడ కోర్టులో మధ్యంతర బెయిల్ (వైద్యం నిమిత్తం) మంజూరైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ఆయన తన సొంత వాహనంలో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆయన ఈనెల 26వ తేదీన జైలులో లొంగిపోవాల్సి ఉంది.

మహిళలకు కోటా రెడీ!



» 2029 ఎన్నికల్లో 33% సీట్లు

» లోక్‌సభ, అసెంబ్లీల్లో అమలుకు కేంద్రం ప్రణాళిక

» కొత్త జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన

» ఆ ప్రక్రియలోనే అతివలకు రిజర్వేషన్

న్యూఢిల్లీ, జూన్ 12: దేశమంతా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి అమల్లోకి తెచ్చే ప్రణాళికను కేంద్రం సిద్ధం చేస్తోంది. 2023లోనే చేపట్టిన 128వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. వనితలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో 33శాతం సీట్లను ఖరారు చేయనుందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఓ కథనం ప్రచురితమైంది. 2027లో చేపట్టనున్న జనగణన ఆధారంగా దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని అందులో పేర్కొన్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరిట మహిళలకు 33% కోటా కల్పిస్తారని వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన అంటే లోక్‌సభ/అసెంబ్లీ స్థానాల సరిహద్దులను తిరిగి ఖరారుచేయడం.. వాటిలో సీట్ల సంఖ్యను నిర్ణయించడం. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలను కూడా నిర్ధారిస్తారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చాక జరిగే తొలి జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని చట్టంలో పేర్కొన్నారు. జనగణన తర్వాత ఈ పునర్విభజన ప్రక్రియ చేపట్టాలంటే పార్లమెంటు జనగణన చట్టాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. జనగణన పూర్తిచేసిన ప్రతిసారీ నియోజకవర్గాలను పునర్విభజించడం తప్పనిసరని రాజ్యాంగంలోని 82వ అధికరణ పేర్కొంటోంది. కాగా.. ప్రస్తుతం నియోజకవర్గాల పునర్విభజన రాజకీయ వివాదంగా మారింది. 1971లో దేశ జనాభాలో దక్షిణ రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉండేది. 2023నాటికి అది 19.7 శాతానికి తగ్గిందని.. దీంతో పార్లమెంటులో తమ సీట్ల సంఖ్య తగ్గుతుందని.. అందుచేత మరో 25ఏళ్ల వరకు నియోజకవర్గాల పునర్విభజన ఉండదంటూ చట్టం చేయాలని తమిళనాడులో పాలకపార్టీ డిమాండ్ చేస్తోంది. అయితే దక్షిణ రాష్ట్రాలు ఒక్క సీటు కూడా కోల్పోవని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు.



9 నెలల్లోనే జనాభా లెక్కలు రెడీ!

న్యూఢిల్లీ, జూన్ 12: జనాభా లెక్కల ప్రక్రియ 2027 మార్చి 1న మొదలవుతుందని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అధునాతన టెక్నాలజీ సాయంతో డిసెంబరుకల్లా కొత్త లెక్కలు అందుబాటులోకి వచ్చేస్తాయని కేంద్రం ధీమా వ్యక్తం చేస్తోంది. గత ప్రక్రియల కంటే నవీన రీతిలో జరగబోతోందని.. డేటా సేకరణకు మొబైల్ యాప్స్, రియల్‌టైం ప్రాసెసింగ్‌కు నిఘా వ్యవస్థలను వినియోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జనాభా లెక్కలు మొదలైన తేదీ నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా, తాలూకా/మండల స్థాయిల్లో లింగాలవారీ జనగణన వివరాల ప్రచురణకు 9 నెలల సమయం తీసుకునే అవకాశముందని తెలిపాయి. 2011లో చేపట్టిన జనగణనలో సదరు వివరాలు ప్రచురించేందుకు రెండేళ్లకు పైనే పట్టిందని పేర్కొన్నాయి.

అంతర్రాష్ట్ర గజదొంగ సలీమ్ ఖురేషి అరెస్టు

విశాఖపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 200కుపైగా దొంగతనాలకు పాల్పడిన హైదరాబాద్ వాసి మహ్మద్ సలీమ్ ఖురేషి(51)ని విశాఖపట్నం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం విలేకరులకు తెలిపారు. సలీమ్ ఖురేషి తన గ్యాంగ్‌తో కలసి ఏపీలో 5(విశాఖలో 3, గుంటూరులో 2), తెలంగాణాలో 65, మహారాష్ట్రలో 35, రాజస్థాన్, గుజరాత్‌లలో ఒక్కొక్కటి, కర్ణాటకలో ఆరు సహా 200కుపైగా దొంగతనాలకు పాల్పడినట్టు సీపీ తెలిపారు. 2001లో ముంబైలో గ్యాంగ్‌స్టర్ చోటారాజన్ ఇంట్లో పది కోట్ల విలువైన బంగారు వస్తువులు, వజ్రాలను దొంగిలించాడన్నారు. మహారాష్ట్రకు చెందిన మయూర్ జాదవ్ అలియాస్ వసీం అబ్దుల్ షేక్, పఠాన్ అనే మరో ఇద్దరితో కలిసి విశాఖలో మూడిళ్లలో దొంగతనానికి పాల్పడ్డాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని మహారాష్ట్రలో అరెస్టు చేసినట్టు తెలిపారు. అతడి నుంచి రూ.25 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నెలాఖరులోగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీ

» సొంత మండలంలో పనిచేయకూడదని నిబంధన

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి బదిలీల ప్రక్రియ చేపడుతూ ఆ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 30లోగా హేతుబద్ధీకరణ, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మార్గదర్శకాల ప్రకారం.. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బందిని తప్పకుండా బదిలీ చేస్తారు. ఐదేళ్లు పూర్తి కాని వారు కూడా బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. సిబ్బంది ఇకపై సొంత మండలంలో పనిచేయరాదు. బదిలీలు పూర్తయిన తర్వాత ఎవరైనా సిబ్బంది అదనంగా ఉంటే అక్కడే కొనసాగుతారు. బదిలీల్లో దృష్టి లోపం, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల పైబడి సర్వీసు పూర్తిచేసిన వారికి, 40% పైబడి వైకల్యం ఉన్న వారికి, మెడికల్ గ్రౌండ్ తదితర అంశాల్లో సాధారణ బదిలీల మాదిరిగా నిబంధనలు వర్తిస్తాయి.

కరోనాపై భయాందోళన అక్కర్లేదు!

» వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ స్పష్టీకరణ



గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా కొత్త వేరియంట్లపై ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలన 11 ఏళ్ల పూర్తయిన సందర్భంగా బీజేపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన గురువారం గుంటూరు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ చాలా కొత్త వేరియంట్లు కనిపిస్తున్నాయని, అయితే వాటిల్లో ఏవీ ప్రమాదకరంగా లేవన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 76 పాజిటివ్ కేసులు మాత్రమే ఉన్నాయని, వారిలో 9 మందికి ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నామని, మిగతా వాళ్లంతా హోం ఐసోలేషన్‌లోనే ఉన్నారని తెలిపారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు అవసరమైన కిట్‌లు, మందులు వంటివన్నీ సిద్ధం చేశామన్నారు.

అమెరికా ఆర్మీ డేకు అతిథిగా పాక్ ఫీల్డ్ మార్షల్

న్యూఢిల్లీ, జూన్ 12: వాషింగ్టన్‌లో శనివారం జరగనున్న 250వ అమెరికా ఆర్మీ డే ఉత్సవాలకు పాకిస్థాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌కు ఆహ్వానం అందడం భారత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అదేరోజు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జన్మదినం కూడా. పహల్గాం ఉగ్రవాద దాడి వెనుక మునీర్ పాత్ర ఉందన్న ఆరోపణలు రావడం, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌కు వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో భారత బృందాలు ప్రపంచవ్యాప్తంగా వివరించి తిరిగి వచ్చిన నేపథ్యంలో అమెరికా చర్య ప్రాధాన్యం సంతరించుకొంది. ఆర్మీ డేను చాలా ఘనంగా నిర్వహించేందుకు అమెరికా ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పాక్ ఆర్మీ చీఫ్‌కు అతిథిగా రావాలంటూ ఆహ్వానం అందడం భారత్‌కు దౌత్యపరంగా దెబ్బ అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేష్ అన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ మొండిపట్టుదల వీడి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపాలన్నారు.



విజయవాడ పటమటలో మొదటి రోజు పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

గందరగోళంగా బడుల పునఃప్రారంభం

» అధికారులంతా తల్లికి వందనంలో నిమగ్నం

» కొనసాగుతున్న ఎస్జీటీల బదిలీలు

» స్కూల్ అసిస్టెంట్లు అటూ ఇటూ

» ప్రారంభం కాని విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రణాళికా లోపంతో పాఠశాల విద్యాశాఖ గందరగోళంగా మారింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా బడులు తెరుచుకున్నా ఏ టీచర్ ఎక్కడున్నారో అర్థంకాని పరిస్థితి. బడులు తెరిచిన రోజే విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. కానీ సరిపడా టీచర్లు లేక ఎక్కడా కిట్ల పంపిణీ ప్రారంభం కాలేదు. కొన్ని చోట్ల అరకొరగా పాఠ్యపుస్తకాలు మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుత పాఠశాలల్లో ఉన్న టీచర్లు.. బదిలీల్లో కొత్తగా వచ్చే టీచర్లు పంపిణీ చేసుకుంటారనే ఉద్దేశంతో వదిలేస్తున్నారు. బడుల పునఃప్రారంభాన్ని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పూర్తిగా తల్లికి వందనం పథకం పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు ఇంకా కొనసాగుతున్నాయి. దీంతో ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం అస్తవ్యస్తంగా మారింది. ఈసారి బదిలీలు సకాలంలో పూర్తికాకపోవడం ఇబ్బందిగా మారింది. ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ వల్ల వేల మంది టీచర్లు బదిలీల ప్రక్రియలో ఉండిపోయారు. దీంతో సింగిల్ టీచర్లు ఉన్న బడుల ప్రారంభం అయోమయంగా మారింది. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తయినా కొందరు మాత్రమే రిలీవ్ అయ్యారు. ఒకవేళ టీచర్లు రిలీవ్ అయినా పాత స్థానం ఖాళీగా మిగిలిపోతే తిరిగి అక్కడికే వచ్చి పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. చాలా మంది పాత పాఠశాలలకు తిరిగి రావట్లేదు. పల్నాడు జిల్లాలో ఈ తరహా సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. 500 మంది విద్యార్థులున్న ఒక ఉన్నత పాఠశాలలో ఒక్కరే సోషల్ టీచర్ ఉన్నారు. కొన్ని పాఠశాలల్లో కొన్ని సబ్జెక్టులకు ఒక్కరూ టీచర్ లేరు. డీఈవో పట్టించుకోకపోవడం సమస్యలను మరింతగా పెంచుతోందని టీచర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 76.14 శాతం ఉత్తీర్ణత

» అబ్బాయిలు 73.55 శాతం... అమ్మాయిలు 80.10 శాతం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో 76.14 శాతం మంది ఉతీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలకు 1,23,477 మంది హాజరు కాగా, 94,017 మంది ఉత్తీర్ణులయ్యారు. గురువారం ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఫలితాలను విడుదల చేశారు. పరీక్షలకు అబ్బాయిలు 74,702 మంది హాజరు కాగా, 54,946 మంది (73.55శాతం), అమ్మాయిలు 48,755 మందికిగాను 39,071 మంది(80.1శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా 98.24శాతం, పశ్చిమగోదావరిలో అత్యల్పంగా 50.24 శాతం ఉతీర్ణత నమోదైంది. ఈ నెల 13 నుంచి 19 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని డైరెక్టర్ తెలిపారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 15,422 మంది టెన్త్ పరీక్షలు రాయగా 10296 మంది, 27,123 మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాయగా 18,099 మంది ఉత్తీర్ణత సాధించారు.

సజ్జలపై 18 వరకు తొందరపాటు చర్యలొద్దు

» పోలీసులకు హైకోర్టు ఆదేశం



తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సజ్జలపై ఫిర్యాదు చేస్తున్న కంభంపాటి శిరీష

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సంకర జాతి అంటూ రాజధాని ప్రాంత ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఈ నెల 18 వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ వ్యాఖ్యలకు సంబంధించి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు డీజీపీకి వినతి సమర్పించారని.. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి తనను అరెస్టు చేసే ప్రమాదం ఉందని, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని.. ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సజ్జల దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను గురువారం కోర్టు లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై ఎలాంటి కేసూ నమోదు కాలేదన్నారు. కేవలం ఆందోళనతో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని తెలిపారు. సజ్జల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్.. పిటిషనర్‌పై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలన్నారు. తదుపరి విచారణను వాయిదా వేశారు.

సజ్జలపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

తాడేపల్లి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో గురువారం దళిత యువజన జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు చేశారు. అమరావతి మహిళలను సంకరజాతి వారని ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె ఫిర్యాదును స్వీకరించిన తాడేపల్లి ఎస్ఐ జె శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టారు.

జగన్‌కు జడ్‌ప్లస్ ఇవ్వండి.. వైసీపీ నేతల వినతి

విజయవాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు జడ్‌ప్లస్ కేటగిరి భద్రతను కల్పించాలని వైసీపీ ఎన్టీఆర్ జిల్లా నేతలు గవర్నరు అబ్దుల్ నజీర్‌ను కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు రాజ్‌భవన్‌లో గురువారం సాయత్రం గవర్నరును కలసి వినపతిపత్రం ఇచ్చారు.

మిథున్‌రెడ్డి బెయిల్ విచారణ నుంచి తప్పుకొన్న జడ్జి

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు తప్పుకొన్నారు. ఫైలును సీజే ముందు ఉంచి వ్యాజ్యం సాధ్యమైనంత త్వరగా మరో బెంచ్ ముందు విచారణకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆ న్యాయమూర్తి గురువారం ఆదేశించారు.

ఓఎంసీ కేసులో శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్ విడుదల

సైదాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న బీవీ శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్ గురువారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న వీరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

కృష్ణమోహన్‌రెడ్డికి ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు

విజయవాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న పి.కృష్ణమోహన్‌రెడ్డికి ప్రభుత్వాస్పత్రిలో గురువారం వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం జైలుకు తీసుకెళ్లారు.

డీడీఓ వ్యవస్థ బలోపేతం!

» డివిజన్ స్థాయిలో ఒకే గొడుగు కిందకు పీఆర్, ఆర్డీ

» సంక్షేమ శాఖల డివిజన్ స్థాయి కార్యాలయాలూ డీడీఓ పరిధిలోకి

» డీఎల్‌పీఓ, డ్వామా ఏపీడీ కార్యాలయాలూ అదే ఆవరణలోకి

» కీలక నిర్ణయాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో పాలనను బలోపేతం చేసేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే పంచాయతీరాజ్ వ్యవస్థలకు మరిన్ని అధికారాలు, బాధ్యతలను అప్పగిస్తూ కూటమి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ సంస్కరణల్లో భాగంగా డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీఓ)లకు కీలకమైన అధికారాలు కట్టబెట్టింది. ఆ మేరకు డీడీఓల జాబ్‌చార్ట్‌ను మారుస్తూ ఉత్తర్వులు జారీచేసింది. డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురావాలని నిర్ణయించింది. డివిజన్ స్థాయిలో ఉన్న డివిజనల్ పంచాయతీ ఆఫీసు(డీఎల్‌పీఓ), డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఏపీడీ), ఇతర శాఖల డివిజనల్ కార్యాలయాలనూ డీడీఓ కార్యాలయాల సముదాయంలోకి మార్చాలని నిర్ణయం తీసుకుంది. సమగ్రమైన జాబ్‌చార్ట్ రూపొందిస్తూ పాత జాబ్‌చార్ట్‌కు సవరణలు చేశారు. ఆ మేరకు జీఓ నెం. 58ను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది.

డీడీఓల విధులివే..

డివిజన్ స్థాయిలో అన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలను డీడీఓ నియంత్రిస్తారు. డివిజన్ స్థాయిలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారు. పాలనాపరంగా ప్రతి నెలా కనీసం 20 రోజులు పర్యటించి టూర్ డైరీలను కలెక్టర్లకు సమర్పించాలి. ఎంపీడీఓలతో పాటు డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది మొత్తం డీడీఓ నియంత్రణలో పనిచేస్తారు. ప్రతి ఆర్నెల్లకోసారి మండలపరిషత్ కార్యాలయాలను డీడీఓ తనిఖీ చేస్తారు. అభివృద్ధి పనుల్లో తేడాలుంటే జిల్లా యంత్రాంగానికి నివేదిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి వరకు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీగా ఆర్డీఓలుగా ఉండేవారు. ఇక నుంచి డీడీఓలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరించనున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న డీడీఓ కార్యాలయాల ఆవరణలోనే డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీల కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం మరో ఉత్తర్వును గురువారం జారీచేసింది. ఇతర శాఖల కార్యాలయాలూ ఈ ఆవరణలోనే ఏర్పాటు చేయనున్నారు.

ఏం మాట్లాడేదీ తెలియదా?

వేశ్యల రాజధాని అని ఎలాగన్నారు?

» కృష్ణంరాజును నిలదీసిన మంగళగిరి కోర్టు

» తప్పుచేశానని అర్థమవుతోందన్న కృష్ణంరాజు

» ఏ-1కు రిమాండ్ విధించిన మేజిస్ట్రేట్

» గుంటూరు జిల్లా జైలుకు తరలింపు



కృష్ణంరాజును మంగళగిరి కోర్టులో హాజరుపరిచి తీసుకువెళుతున్న పోలీసులు

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుగా 30 ఏళ్ల అనుభవం ఉన్న మీకు.. ఏం మాట్లాడాలో.. ఏది మాట్లాడకూడదో తెలియదా అని ఎనలిస్టు వాడపల్లి వెంకట రాధాకృష్ణంరాజు అలియాస్ వీవీఆర్ కృష్ణంరాజును మంగళగిరి న్యాయస్థానం నిలదీసింది. రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొంటూ వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రధాన నిందితుడైన (ఏ-1) ఆయన.. తప్పుచేశానని అర్థమవుతోందని బదులిచ్చారు. ఆయనకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తుళ్లూరు పోలీసు స్టేషన్లో నమోదైన ఈ కేసులో కృష్ణంరాజును విశాఖ వద్ద భీమిలి పోలీసులు అరెస్టుచేసి.. తుళ్లూరు పోలీసులకు అప్పగించడం.. బుధవారం రాత్రి ఆయన్ను నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించడం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం కృష్ణంరాజుకు పోలీసులు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మంగళగిరిలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ సురేశ్‌బాబు ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు కృష్ణంరాజును గుంటూరులోని జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో రెండో నిందితుడైన కొమ్మినేని శ్రీనివాసరావు కూడా ఈ జైల్లోనే రిమాండ్‌లో ఉన్నారు. సాక్షి యాజమాన్యం ఏ-3గా ఉన్న సంగతి తెలిసిందే.

బెయిల్ కోసం కోర్టుకు కొమ్మినేని

నిందితుడు కొమ్మినేని బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు నాలుగు రోజులు గడువు కావాలని ప్రత్యేక న్యాయవాది వీరగంధం రాజేంద్రప్రసాద్ కోరగా.. అందుకు కోర్టు అనుమతించింది. కృష్ణంరాజు రాజధాని ప్రాంత మహిళలను వేశ్యలుగా చిత్రీకరించి మాట్లాడిన సమయంలో యాంకర్‌గా ఉన్న కొమ్మినేని ఖండించకపోగా.. అవును నిజమే.. తాను కూడా ఆంగ్ల పత్రికల్లో చదివానంటూ వాటి పేర్లు చెప్పారని.. అయితే ఆయన బెయిల్ పిటిషన్లో ఆయా పత్రికల క్లిప్పింగ్స్ లేవని రాజేంద్ర ప్రసాద్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కాగా.. ఈ కేసులో ఇద్దరు నిందితులనూ తమ కస్టడీకి కోరుతూ పోలీసులు శుక్రవారం పిటిషన్లు దాఖలు చేయనున్నారు.

కోర్టు వద్ద మహిళల నిరసన

» పోలీసు వాహనాన్ని అడ్డుకునే యత్నం

మంగళగిరి సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కృష్ణంరాజును మంగళగిరి కోర్టులో గురువారం హాజరు పరుస్తున్నారనే విషయం తెలుసుకున్న అమరావతి ప్రాంత రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో కోర్టు వద్దకు చేరుకున్నారు. రిమాండ్ విధించిన అనంతరం గుంటూరు జైలుకు తరలిస్తున్న క్రమంలో కృష్ణంరాజుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అప్పటికే కోర్టు వద్ద మోహరించిన ప్రత్యేక పోలీసు బలగాలు వారిని అడ్డుకున్నాయి. పలువురు రైతులు కృష్ణంరాజుపైకి వాటర్ ప్యాకెట్లు విసిరే ప్రయత్నం చేశారు. రైతులు, మహిళల ఆందోళనను గమనించిన పోలీసులు పరుగున కృష్ణంరాజును వ్యానులోకి ఎక్కించారు. అదే సమయంలో వర్షం కురవడంతో పోలీసుల పని సులువైంది.

మేజిస్ట్రేట్ ప్రశ్నలవర్షం..

కృష్ణంరాజును కోర్టులో హాజరుపరిచిన సమయంలో మేజిస్ట్రేట్ సురేశ్‌బాబు ఆయనపై ప్రశ్నలవర్షం కురిపించారు. సాక్షి చానల్ డిబేట్లో కొమ్మినేనితో పాటు ఉన్న రెండో వ్యక్తి మీరేనా అని అడుగగా.. తానేనని కృష్ణంరాజు సమాధానం చెప్పారు. ల్యాప్‌టాప్‌లో నాటి చర్చను చూపమంటారా అని అడుగగా.. అవసరం లేదండీ.. చర్చలో పాల్గొన్నానని తెలిపారు.

మేజిస్ట్రేట్: మీరేం చేస్తుంటారు?

కృష్ణంరాజు: 30ఏళ్లుగా జర్నలిజంలో ఉన్నాను.

మేజిస్ట్రేట్: అంతటి అనుభవం ఉన్న మీకు ఏం మాట్లాడాలో.. ఏం మాట్లాడకూడదో తెలియదా? అమరావతి దేవతల రాజధాని కాదని, వేశ్యల రాజధాని అని ఎలా అన్నారు?

కృష్ణంరాజు: (సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. తలవంచుకున్నారు)

మేజిస్ట్రేట్: పోలీసులు ఇబ్బంది పెట్టారా?

కృష్ణంరాజు: బాగా చూసుకున్నారు. ముఖ్యంగా తుళ్లూరు డీఎస్పీ చాలా మర్యాదగా వ్యవహరించారు (ఆకాశానికెత్తేలా మాట్లాడుతుండగా మేజిస్ట్రేట్ వారించారు).

మేజిస్ట్రేట్: మీకు కేసు పత్రాలు అందించారా?

కృష్ణంరాజు: ఇచ్చారు.

మేజిస్ట్రేట్: మీరు చెప్పుకొనేది ఏమైనా ఉందా?

కృష్ణంరాజు: పొరపాటు చేసినట్లు అర్థమవుతోంది.

'ముందస్తు' పిటిషన్‌పై విచారణ మూసివేత

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ముందస్తు బెయిల్ కోరుతూ కృష్ణంరాజు వేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఆయన తరఫు న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్‌ను పోలీసులు అరెస్టు చేశారని.. ముందస్తు బెయిల్ పిటిషన్ నిరర్థకమైందన్నారు. ఈ వాదనలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్.. వ్యాజ్యంపై విచారణను మూసివేస్తున్నట్లు ప్రకటించారు.

అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

» ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేం

» పిన్నెల్లి సోదరులకు స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతల హత్యకు సంబంధించిన కేసులో వైసీపీ నేతలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. బెయిల్ పిటిషన్లపై విచారణను ఈనెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. పల్నాడుజిల్లా, వెల్దుర్తి మండలం, గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. టీడీపీలో ఆధిపత్య పోరు కారణంగా హత్యలు జరిగాయన్నారు. తదుపరి విచారణ వరకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల ప్రోద్బలంతోనే హత్యలు జరిగాయన్నారు. పిటిషనర్ల నేరచరిత్రను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. దీంతో పిన్నెల్లి తరఫు న్యాయవాది సమర్పించిన పెన్‌డ్రైవ్‌లోని అంశాల వాస్తవికత, ఘటన జరిగినప్పుడు పిటిషనర్లు మరోచోట ఉన్నట్లు చెబుతున్న అంశాలపై వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.